అనుదినం... జనస్వరం
నవతెలంగాణ
బుధవారం 06-02-2019
సమగ్ర తెలుగు దినపత్రిక



సంపుటి : 5 సంచిక : 39 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar, Mahaboobnagar, Warangal | www.navatelangana.com | 12 + 16 పేజీలు | వెల : 6.50

ఆ సమాచారం లేదు

ఉపాధిపై నోట్లరద్దు ప్రభావం విషయంలో..




కేంద్ర మంత్రి సంతోశ్ గంగ్వార్

న్యూఢిల్లీ: దేశంలో పెద్దనోట్ల రద్దు నిర్ణయంతో తీవ్ర విమర్శలపాలైన మోడీ ప్రభుత్వం.. దాని ప్రభావం అసంఘటిత రంగంలోని ఉపాధిపై ఎలా ఉన్నదన్న విషయంలో తగిన గణాంకాలను కూడా క్రోడీకరించలేదు. ఈ విషయాన్ని సాక్షాత్తు కేంద్ర కార్మిక, ఉపాధి సహాయ మంత్రి



సంతోశ్ కుమార్ గంగ్వార్ లోక్‌సభలో వెల్లడించారు. 'దేశంలో అసంఘటిత రంగంలోని ఉపాధిపై నోట్ల రద్దు ప్రభావం ఎలా ఉన్నదన్న విషయంలో కేంద్రం వద్ద తగిన సమాచారం లేదు. ఈ విషయంలో నోట్ల రద్దు ప్రభావానికి సంబంధించిన సమాచారాన్ని క్రోడీకరించలేదు' అని గంగ్వార్ వెల్లడించారు. 2016లో పెద్ద నోట్ల రద్దు అనంతరం దేశంలోని అసంఘటిత రంగంలో ...9లో

కార్పొరేట్ల ఖాతాల్లో..
అప్పులు మరో 3.5 లక్షల కోట్లు



2020 సెప్టెంబర్ నాటికి అదనం

- ఇది వరకే రూ.14 లక్షల కోట్లు
- తిరిగిరాని బాకీలు 40శాతానికి పైనే..
- బ్యాంకులపై తీవ్ర ఒత్తిడి : ఇండియా రేటింగ్స్ రిపోర్టు..

వివరాలు 10లో



పొంగిన గ్లాసులు.. ఖజానాకు కాసులు

ఫుల్లుగా మద్యం అమ్మకాలు

- ఆబ్కారీ శాఖకు కలిసొచ్చిన కాలం
- నాలుగు నెలల్లో 6 వేల కోట్ల ఆదాయం



నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

శాసనసభ, పంచాయతీ ఎన్నికలు, నూతన సంవత్సర వేడుకలు, సంక్రాంతి పండుగ.. ఇవి ఆబ్కారీ శాఖ ఖజానాను నింపేశాయి. అమాంతం పెంచేశాయి. కేవలం నాలుగు నెలల వ్యవధిలోనే భారీగా ఆదాయం సమకూరింది. సుమారు 6వేల కోట్ల మద్యం అమ్మకాలు జరిగాయని అధికారిక లెక్కలు చెబుతున్నాయి. పెరుగుతున్న అమ్మకాల మూలంగా ప్రతి యేటా ఆశించినదాని కన్నా అధికంగా ఆదాయం వస్తున్నది. మద్యం విక్రయాలపై బడ్జెట్‌లో పేర్కొన్న దానికన్నా రెట్టింపుగా అమ్మకాలు చోటుచేసుకుంటున్నాయి. రాష్ట్ర ఖజానాకు సగం ఆదాయం మద్యం అమ్మకాల ద్వారానే వస్తుండటం గమనార్హం. ఆదాయం అధికమవుతున్న కొద్దీ ఆబ్కారీ శాఖకు ప్రతి సంవత్సరం టార్గెట్లు పెంచుతుండటం తెలిసిందే.

ఐదు నెలలు.. ఆరువేల కోట్లు

గత ఐదు నెలల్లో రాష్ట్రంలో సుమారు రూ. 6 వేల కోట్లకు పైగా మద్యం అమ్మకాలు జరిగాయి. ఈ ఐదు నెలల వ్యవధిలో శాసనసభ ఎన్నికలు, అనంతరం నూతన సంవత్సర వేడుకలు, సంక్రాతి సంబురాలు, పంచాయతీ ఎన్నికలు వరుసగా రావడంతో లిక్కర్ అమ్మకాలు గణనీయంగా పెరిగాయి. శాసనసభ ఎన్నికలు ముగిసి ఫలితాలు వెల్లడించేంతవరకు సుమారు రూ. 3,500 కోట్ల అమ్మకాలు జరిగినట్టు సమాచారం. కొత్త సంవత్సర వేడుకల సందర్భంగా మరో రూ.500 కోట్లు, సంక్రాంతి పండుగను పురస్కరించుకుని రూ. 150 కోట్లు, పంచాయతీ ఎన్నికల సందర్భంగా రూ. 2,500 కోట్ల మద్యం అమ్మకాలు జరిగినట్టు తెలిసింది. అన్ని పన్నులు పోను సర్కారుకు సుమారు ...9లో

హోంశాఖపై గరం

ఎన్‌ఆర్‌సీ ప్రక్రియను దెబ్బతీస్తున్నారు..

కేంద్ర హోంశాఖ కార్యదర్శికి సమన్లు పంపమంటారా?

- అనుకున్న గడువులోగా 'అస్సాం–జాతీయ పౌర జాబితా' పూర్తిచేయాల్సిందే
- కారణాలు వెతికే పని మానండి : సుప్రీం కోర్టు

న్యూఢిల్లీ : అస్సాం–జాతీయ పౌర జాబితా(ఎన్‌ఆర్‌సీ) విషయంలో కేంద్ర హోం శాఖ తీరుపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కేంద్రం తీరు జాతీయ పౌర జాబితా ప్రక్రియను దెబ్బతీసేవిధంగా ఉందనీ, సమన్లు జారీ చేయమంటారా? అంటూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి రంజన్ గొగోయ్ తీవ్రస్వరంతో హెచ్చరించారు. ఎన్‌ఆర్‌సీ ప్రక్రియను ఆలస్యం చేయడానికి కేంద్రం వెయ్యినొక్క మార్గాల్ని వెతుక్కుంటోందని ధర్మాసనం తప్పుబట్టింది. మార్చి మొదటివారంలో మరోసారి దీనిపై తుది ఉత్తర్వులు జారీ చేస్తామని న్యాయస్థానం తెలిపింది. కేసుకు సంబంధించి మంగళవారం వాదనలు విన్న సీజేఐ రంజన్ గొగోయ్, "అస్సాంలో జాతీయ పౌర జాబితా విడుదలకు సంబంధించి ...9లో





పండితులు, పీఈటీల కల సాకారం

- స్కూల్ అసిస్టెంట్లుగా ఉద్యోగోన్నతి : సీఎం కేసీఆర్ ఆమోదం
- ఇక గ్రేడ్–2 పండితుల పోస్టులు బంద్

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

రాష్ట్రంలోని గ్రేడ్–2 భాషా పండితులు, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ల (పీఈటీ)కు టీఆర్ఎస్ ప్రభుత్వం తీపికబురు అందించింది. సుదీర్ఘ కాలంగా ఎదురుచూస్తున్న వారి కల సాకారమైంది. భాషాపండితులు, పీఈటీల పోస్టులను స్కూల్ అసిస్టెంట్లుగా అప్‌గ్రేడ్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇందుకు సంబంధించి ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావు ఆమోదం తెలిపారు. ఆ ఫైలుపై ఆయన మంగళవారం సంతకం చేశారు. ఇక జీవో రావడమే తరువాయి. ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్ ...9లో

తోడు దొంగలే..

శారదా స్కాంలో తృణమూల్,బీజేపీకీ సమాన వాటా

- సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు పారదర్శకంగా విచారణ చేయాలి : సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి ఏచూరి

నవతెలంగాణ – న్యూ ఢిల్లీ బ్యూరో

తృణమూల్ కాంగ్రెస్, భారతీయ జనతా పార్టీ రెండూ తోడు దొంగలేనని సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి విమర్శించారు. దేశంలోని అతి పెద్ద చిట్‌ఫండ్ స్కాం(శారదా చిట్‌ఫండ్ కుంభకోణం)లో రెండు పార్టీలకు చెందిన నేతలకు సమాన వాటాలున్నాయని ఆరోపించారు. మంగళవారం పార్లమెంట్ ఆవరణలో ఏచూరి మీడియాతో మాట్లాడారు. శారదా స్కాం కేసును విచారించాలని భారత సర్వోన్నత న్యాయస్థానం కేంద్ర దర్యాప్తు సంస్థకు అప్పగించిన



విషయాన్ని ఆయన గుర్తు చేశారు. అదే కేసుకు సంబంధించి పురోగతిలో పశ్చిమ బెంగాల్ సీఎం అత్యుత్సాహం ప్రదర్శిస్తూ పక్కదారి పట్టించేందుకు యత్నిస్తున్నారని వ్యాఖ్యానించారు. సుప్రీం ఆదేశాల మేరకే కోల్‌కతా పోలీసు కమిషనర్‌కు సీబీఐ విచారణకై తాఖీదులు అందజేసిందని అన్నారు. అయితే, వాటికి ...9లో



ఉపాధి నిధులతో శ్మశాన వాటికలు

హరితహారం పనులకు ప్రాధాన్యమివ్వండి : సీఎం కేసీఆర్

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

జాతీయ ఉపాధి హామీ పథకం నిధులను సంపూర్ణంగా వినియోగించు కోవటం ద్వారా గ్రామాల్లో అభివృద్ధి చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి కేసీఆర్ ఉన్నతాధికారులను ఆదేశించారు. ఆయా నిధులతో వైకుంఠ ధామాలు (శ్మశాన వాటికలు) నిర్మించాలని, హరిత హారం కార్యక్రమానికి ప్రాధాన్యతనివ్వాలని ఆయన సూచించారు. పంచాయతీరాజ్– గ్రామీణాభివృద్ధిపై మంగళవారం ప్రగతి భవన్‌లో సీఎం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఉపాధి నిధులతోపాటు రాష్ట్ర బడ్జెట్, ఎంపీ, ఎమ్మెల్యేల నియోజవర్గ అభివృద్ధి నిధులను కూడా ఉపయోగించుకుని గ్రామాలను ...9లో



అరెస్టు వద్దు.. సహకరిస్తే చాలు

షిల్లాంగ్‌లో సీబీఐ ఎదుట సీపీ హాజరుకావాలి

- చిట్‌ఫండ్ కేసుల్లో సుప్రీంకోర్టు ఆదేశం

వివరాలు 2లో




ప్రపంచశాంతి పత్రంపై సంతకం

వివరాలు 9లో

అటవీశాఖలో ప్రక్షాళన

ఒకేసారి 200 మంది అధికారుల బదిలీ

- కలప అక్రమరవాణా, పులుల చంపివేతతో..
- బదిలీలకు సీఎం గ్రీన్‌సిగ్నల్



నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

అటవీశాఖ దిద్దుబాటు చర్యలకు పూనుకున్నది. ఒక నెల వ్యవధిలోనే కలప అక్రమరవాణా..2 పులుల చంపివేత..తెలంగాణ వీరప్పన్ బాగోతం వెలుగుచూడటంతో సమీక్షలు నిర్వహించిన ఉన్నతాధికారులు శాఖలో భారీ ప్రక్షాళనకు శ్రీకారం చుట్టారు. ఒకేసారి దాదాపు 200మంది అధికారులను బదిలీ చేశారు. అడవులు ఎక్కువగా ఉన్న ప్రాంతంలో కఠినంగా వ్యవహరించాలనే ఉద్దేశంతోనే భారీ మార్పులు చేపట్టారు. బదిలీ అయిన వారిలో చీఫ్ కన్సర్వేటర్ నుంచి బీట్ ఆఫీసర్ వరకు ఉన్నారు. సంబంధిత ఫైలుపై ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు మంగళవారం సంతకం చేశారు. జిల్లా అటవీ అధికారులుగా పనిచేస్తున్న చీఫ్ కన్సర్వేటర్లు, కన్సర్వేటర్లు, డిఎఫ్ఓ స్థాయి కలిగిన 21 మందికి ముఖ్యమైన జిల్లాల బాధ్యతలు అప్పగించారు. చీఫ్ కన్సర్వేటర్ ఎకె సిన్హాకు అచ్చంపేట బాధ్యతలు, కన్సర్వేటర్లు శర్వానంద్, వినోద్ ...9లో

కార్పొరేటు కొత్త రూటు

అడ్డదారిలో అడ్మిషన్లు

- ప్రవేశ పరీక్షల పేరుతో విద్యార్థులకు ముందస్తు గాలం
- రాయితీలు ఇస్తామంటూ ఆకర్షించే యత్నం
- కాలేజీ యాజమాన్యాల ఇష్టారాజ్యం
- నిబంధనలకు యథేచ్ఛగా తిలోదకాలు
- చోద్యం చూస్తున్న ఇంటర్ బోర్డు



నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

రాష్ట్రంలో కార్పొరేట్ జూనియర్ కాలేజీలు విద్యార్థులను ఆకర్షించేందుకు కొత్త పద్ధతులను అవలంబిస్తున్నాయి. ఎలాగైనా విద్యార్థులను చేర్చుకోవడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాయి. ప్రవేశ పరీక్షల పేరుతో విద్యార్థులకు ముందుగానే గాలం వేస్తున్నాయి. పదో తరగతి చదువుతున్న విద్యార్థులే టార్గెట్‌గా ప్రణాళికలు రచిస్తున్నాయి. అక్రమ మార్గంలో పయనిస్తున్నాయి. ఉన్నత పాఠశాలలకు ఇప్పటికే కార్పొరేట్ కాలేజీలకు చెందిన పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్స్ (పీఆర్వో)లు వెళ్లి విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ప్రవేశ పరీక్షల గురించి వివరిస్తున్నారు. ప్రవేశ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిస్తే ఫీజులో రాయితీలు కల్పిస్తామనీ ...9లో

ప్రచారానికే బేటీ బచావో..బేటీ పడావో

మోడీ సర్కారు తీరుపై మహిళా సంఘాల ఆగ్రహం

- జంతర్‌మంతర్ వద్ద ఐద్వా ఆధ్వర్యంలో భారీ ఆందోళన



నవతెలంగాణ - న్యూఢిల్లీ బ్యూరో:
మోడీ ప్రభుత్వం మహిళా సాధికారిత విషయంలో గొప్పలు చెప్పుకుంటున్నదని... ప్రచారానికే బేటీ బచావో, బేటీ పడావో పథకాన్ని వినియోగించుకుంటుందని మహిళా సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. బీజేపీ హయాంలో మహిళలపై దాడులు విపరీతంగా పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశాయి. దళిత, గిరిజన, అణగారినవర్గాల మహిళలపై వేధింపులు మోడీ పాలనలో మరింత అధికమయ్యాయని వెల్లడించాయి. మహిళలపై వేధింపులకు వ్యతిరేకంగా సంఘటితంగా పోరాడాలని తీర్మానించాయి. జనవరి 30 నుంచి ఫిబ్రవరి 7వరకు పలు సామాజిక, ప్రజాస్వామ్య సంఘాలు, రాజకీయ పార్టీలు సంయుక్తంగా తలపెట్టిన ఆందోళన కార్యక్రమాల్లో భాగంగా ఏడో రోజు మంగళవారం మహిళా సంఘాలు ఐక్యంగా ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద భారీ ధర్నా నిర్వహించాయి. మహిళా సంఘాల నేతలు పెద్ద ఎత్తున ఈ నిరసనలో పాల్గొని మోడీ సర్కారుకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ ధర్నాకు ముఖ్య అతిథిగా మాజీ ఎంపీ, ఏఐకేఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి హన్నన్ మొల్లా పాల్గొన్నారు. వ్యవసాయ రంగంలో మహిళా రైతులకు ప్రభుత్వం ప్రత్యేకంగా ఆదుకోవాలని హన్నన్ మొల్లా డిమాండ్ చేశారు. మహిళా రైతు కూలీలకు గుర్తింపునివ్వాలని సూచించారు.



ఐద్వా జాతీయ ప్రధాన కార్యదర్శి మరియం దావలే మాట్లాడుతూ 2014 ఎన్నికల సమయంలో మోడీ సర్కారు చట్టసభల్లో మహిళా రిజర్వేషన్ బిల్లును చట్టంగా రూపొందిస్తామని హామీనిచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత అసలు ఆ బిల్లుపై కనీసం చర్చ కూడా చేయడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళా సాధికారితపై మోడీ సర్కారుకు ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా వెంటనే బిల్లును చట్టం చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం జరుగుతున్న సమావేశాల్లోనే బిల్లు రూపకల్పనకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. మయూం మొల్లా మాట్లాడుతూ ఎన్నికల సమయంలో అచ్చేదిన్ కోసమే మహిళలంతా మోడీ ప్రభుత్వానికి ఓటేశారని అన్నారు. అయితే, అచ్చేదిన్ పేరుతో మోడీ సర్కారు మహిళలకు సచ్చేదిన్ తీసుకువచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బేటీ బచావో... బేటీ పడావో పథకం పూర్తిస్థాయిలో అమలు కావడం లేదని అన్నారు. సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యురాలు ఎస్ పుణ్యవతి మాట్లాడుతూ... ఏటా రెండు కోట్ల ఉద్యోగాలిస్తానన్న మోడీ సర్కారు... తన హామీని నిలుపుకోవడంలో పూర్తిగా విఫలమైందని చెప్పారు. విద్యా వ్యవస్థను పూర్తిగా చిన్నాభిన్నం చేస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. అసంఘటిత రంగంలో ఎంతోమంది మహిళలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఆ రంగంలోని మహిళల సమస్యలు ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రిటైర్డ్ జనరల్ సాబీర్ సింగ్, ఆశా శర్మ, ఢిల్లీ మహిళా సంఘం నేతలు పాల్గొన్నారు.

నేడు (ఫిబ్రవరి 6) విద్యా రంగ సమస్యలపై విద్యార్థులు, ఉపాధ్యాయ సంఘాల పోరు

యూపీలో ఎస్మా

- అన్ని ప్రభుత్వ శాఖల్లో సమ్మె నిషేధం

లక్నో : అన్ని రాష్ట్ర ప్రభుత్వ విభాగాల్లోనూ, కార్పొరేషన్లలోనూ 6 నెలల పాటు సమ్మెను నిషేధిస్తూ అత్యవసర సేవల నిర్వహణ చట్టాన్ని (ఎస్మా) ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ప్రయోగిం చింది. ఈ చట్టాన్ని అమలులోకి తెస్తూ సోమవారం నోటిఫికేష న్‌ను జారీ చేసింది. ఈ చట్టం ప్రకారం ప్రభుత్వ శాఖలు, కార్పొరేషన్లలో ఎవరూ సమ్మె చేయడానికి అవకాశం లేదు. చట్టాన్ని ఉల్లంఘించి సమ్మె చేసిన వారిని ఎటువంటి వారెంట్ జారీ చేయకుండానే పోలీసులు అరెస్టు చేస్తారు. పెన్షన్ పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం నుండి సమ్మె చేస్తామని పలు సంస్థలు హెచ్చరించిన నేపథ్యం లో యూపీ ప్రభుత్వం ఈ ఆదేశాలు జారీ చేసింది. పోస్టల్, టెలిగ్రాఫ్ శాఖలతో పాటు రైల్వేలు, విమానాశ్రయాలు కూడా ఎస్మా పరిధిలోకి వస్తాయి. కాగా 1973 నాటి ఉత్తరప్రదేశ్ రాష్ట్ర విశ్వవిద్యాలయాల చట్టం కింద ఇప్పటికే అన్ని విశ్వవిద్యాలయాలలోనూ బీజేపీ ప్రభుత్వం గత ఏడాది జూన్ 5 నుంచి ఎస్మాను అమలు చేస్తున్న సంగతి తెలిసిందే.

హజారే దీక్ష విరమణ



న్యూఢిల్లీ : ప్రముఖ సామాజిక కార్యకర్త , అవినీతి వ్యతిరేక ఉద్యమ కారుడు అన్నా హజారే (81) తన నిరవధిక దీక్షను మంగళవారం విరమించారు. ఆయన డిమాండ్ల నన్నింటినీ నెరవేరుస్తామని మహా రాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ఇచ్చిన హామీతో హజారే దీక్ష విరమించారు. దీక్ష విరమించిన తరువాత అక్కడ ప్రజలనుద్దేశించి ఆయన మాట్లాడుతూ, లోకాయుక్త ఏర్పాటుపై ఈ నెల 13న నిర్ణయం తీసుకుంటామని రాష్ట్ర ప్రభుత్వం చెప్పిందని, దీంతో తాను దీక్ష విరమిస్తున్నట్టు ప్రకటించారు. కాగా, లోక్ పాల్ నియామకం కోసం ఉమ్మడి ముసాయిదా కమిటీని ఏర్పాటు చేస్తామని ఫడ్నవీస్ అన్నారు. ఫడ్నవీస్ మంగళవారం హజారే సొంత గ్రామ మైన రాలేగావ్ సిద్ధి వెళ్ళి ఆయనతో మాట్లాడారు. లోక్‌పాల్ నియామక ప్రక్రియ త్వరలోనే పూర్తవుతుందని ఫడ్నవీస్ ఈ సందర్భంగా తెలిపారు.

అరెస్టు వద్దు.. సహకరిస్తే చాలు

షిల్లాంగ్‌లో సీబీఐ ఎదుట సీపీ హాజరుకావాలి

- చిట్‌ఫండ్ కేసుల్లో సుప్రీంకోర్టు ఆదేశం



న్యూఢిల్లీ : చిట్‌ఫండ్ కుంభకోణాల కేసుల్లో కోల్‌కతా పోలీస్ కమిషనర్ రాజీవ్‌కుమార్‌ను సీబీఐ అరెస్టు చేయొద్దని, మరే ఇతర బలవంతపు చర్యలూ తీసుకోవద్దని భారత సర్వోన్నత న్యాయస్థానం తీర్పునిచ్చింది. అయితే.. సీబీఐ విచారణకు రాజీవ్ కుమార్ పూర్తిగా సహకరించాలని సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ రంజన్ గోగోయ్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం మంగళవారం స్పష్టం చేసింది. మేఘాలయ రాజధాని షిల్లాంగ్‌లో సీబీఐ అధికారుల ఎదుట హాజరుకావాలని రాజీవ్‌కుమార్‌ను ఆదేశించింది. అంతేకాక.. పశ్చిమబెంగాల్ ప్రధాన కార్యదర్శి, ఆ రాష్ట్ర డీజీపీ, పోలీస్ కమిషనర్ రాజీవ్‌కుమార్‌లకు కోర్టు ధిక్కరణ నోటీసులు జారీ చేసింది. సీబీఐ అధికారులను అరెస్టు చేసిన విషయమై ఈనెల 18లోగా వివరణ ఇవ్వాలని వారిని ఆదేశించింది. తదుపరి విచారణను ధర్మాసనం ఈ నెల 20కి వాయిదా వేసింది. రాజీవ్‌కుమార్ నివాసానికి ఆదివారం సీబీఐ బృందం వెళ్లడంతో హైడ్రామాకు తెరలేచిన సంగతి తెలిసిందే. సీబీఐ అధికారులను పోలీసులు అడ్డుకుని అరెస్టు చేయడం దుమారం రేపింది. అంతలోనే అక్కడికి చేరుకున్న ముఖ్యమంత్రి మమతా బెనర్జీ రాత్రికి రాత్రే ధర్నాలో కూర్చున్నారు. కాగా.. రాష్ట్ర ప్రభుత్వ తీరును వ్యతిరేకిస్తూ సీబీఐ.. సుప్రీంకోర్టును సోమవారం ఆశ్రయించింది. ఈ క్రమంలోనే సీబీఐ దాఖలు చేసిన రెండు పిటిషన్లపై సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. చిట్‌ఫండ్ కేసులకు సంబంధించిన కీలక సాక్ష్యాధారాలను రాజీవ్‌కుమార్ ధ్వంసం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని సీబీఐ ఆరోపిస్తోంది.

ప్రజాస్వామ్య విజయం : మమతా బెనర్జీ

సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రజాస్వామ్య విజయమని మమతా బెనర్జీ అన్నారు. చిట్‌ఫండ్ కేసుల్లో ఎలాంటి సహకారాన్ని అందించడానికైనా తాము సిద్ధంగా ఉన్నామని ఆమె తెలిపారు. విచారణకు తాను అందుబాటులో ఉండనని రాజీవ్‌కుమార్ ఎన్నడూ చెప్పలేదన్నారు. కానీ, సీబీఐ అధికారులు సీక్రెట్ ఆపరేషన్ పేరుతో రాజీవ్‌కుమార్‌ను అరెస్టు చేయడానికి వచ్చారని ఆమె ఆరోపించారు. మరోవైపు.. కేంద్రప్రభుత్వ తీరును నిరసిస్తూ మమతా బెనర్జీ చేపట్టిన ధర్నాను మంగళవారం విరమించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సీబీఐ వివాదాన్ని వచ్చే వారం జాతీయ స్థాయిలో లేవనెత్తుతామన్నారు. ఒక పోలీసు అధికారి అంటే కేంద్రం ఎందుకు భయపడుతోందని ఆమె ప్రశ్నించారు.

మహా రైతుల మరో పోరాటం

ఈ నెలాఖరులో ముంబయిలో ఆందోళన..

- డిమాండ్లు నెరవేర్చని ఫడ్నవీస్ సర్కారు



ముంబయి : సుమారు ఏడాది క్రితం.. పంట చేలల్లో ఆరుగాలం శ్రమించే రైతన్నలు ముంబయి బాట పట్టారు. వేలాది మంది తరలిరావడంతో నగర వీధులు అన్నదాతలతో కిక్కిరిసిపోయాయి. డిమాండ్లను పరిష్కరించాలంటూ వారు చేపట్టిన ఆందోళన దేశవ్యాప్తంగా సంచలనం రేకెత్తించింది. ఈ దెబ్బకు దిగి వచ్చిన మహారాష్ట్ర సర్కారు.. రైతుల సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని హామీనిచ్చింది. కానీ, ఇప్పటికీ రైతుల డిమాండ్లు నెరవేరలేదు. దీంతో మరోసారి పోరాటానికి సిద్ధమవుతున్నారు ఆ రాష్ట్ర రైతులు. ఈ నెలాఖరులో ముంబయిలో చేపట్టబోయే ఆందోళనకు రైతులు వేలాది సంఖ్యలో తరలిరానున్నారని ఏఐకేఎస్ మహారాష్ట్ర ప్రధాన కార్యదర్శి అజిత్ నావలే మంగళవారం అన్నారు. గతసారి కంటే ఈసారి రెండింతలు ఎక్కువ మంది రైతులు ఆందోళనలో పాల్గొంటారని తెలిపారు. రైతుల డిమాండ్లను నెరవేర్చడంలో అటు కేంద్రం, ఇటు మహారాష్ట్ర సర్కారు పూర్తిగా విఫలమయ్యాయని విమర్శించారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేసేది పోయి రైతుకు రోజుకు రూ.3.28 ఇవ్వడమేంటని ప్రశ్నించారు. రైతు యాత్ర నాసిక్‌లో ఈనెల 20న ప్రారంభం అవుతుందని, ఈ ఆందోళనలో అన్ని జిల్లాల అన్నదాతలు పాల్గొననున్నట్టు చెప్పారు. యాత్ర ఈనెల 27న ముంబయికి చేరుకుంటుందని తెలిపారు. బీజేపీ సర్కారు ఉదాసీనత కారణంగా రైతులు ఎలా కష్టాలను ఎదుర్కొంటున్నారో ఈ యాత్ర ద్వారా తెలియజేస్తామని చెప్పారు. గతేడాది మార్చిలో మహారాష్ట్ర రైతులు ముంబయికి పాద యాత్రగా బయలుదేరారు. కాళ్లకు బొబ్బలెక్కి రక్తమోడుతున్నా అన్నదాతలు వెనుకడుగు వేయకుండా ఎట్టకేలకు ముంబయి చేరుకున్నారు. దాదాపు 40 వేల మంది ఈ ఆందోళనలో పాల్గొన్నా సామాన్యులకు ఎలాంటి సమస్య తలెత్తకపోవడం గమనార్హం. అంతేకాక..పరీక్షలకు వెళ్లే విద్యార్థులకు ఇబ్బంది కాకూడదన్న ఉద్దేశంతో ప్రధాన రహదారుల్లో కాకుండా.. చిన్న చిన్న వీధుల గుండా రైతుల పాదయాత్ర కొనసాగింది. ముంబయికి చేరుకున్న రైతులు అక్కడ భారీ ఆందోళనకు సిద్ధమౌతున్న తరుణంలో మహారాష్ట్ర సర్కారు దిగివచ్చి డిమాండ్లను నెరవేరుస్తామని హామీనిచ్చింది.

విజృంభిస్తున్న స్వైన్‌ఫ్లూ

దేశవ్యాప్తంగా 226 మంది మృతి


- 6వేల మందిలో వ్యాధి లక్షణాలు
- రాజస్థాన్‌లో అత్యధికం..రెండో స్థానంలో దేశ రాజధాని
- మోడల్ స్టేట్ గుజరాత్‌లోనూ స్వైర విహారం

న్యూఢిల్లీ: దేశంలో స్వైన్‌ఫ్లూ విజృంభిస్తోంది. ఈ మహమ్మారి బారిన పడి ఇప్పటికే దేశంలో సుమారు 226 మంది మరణించారు. కాగా ఈ వారంలోనే సుమారు 31 మందికి పైగా మృతి చెందారు. ఇప్పటివరకు సుమారు 6వేల మందిలో ఈ వ్యాధి లక్షణాలను వైద్యులు గుర్తించా రంటేనే స్వైన్‌ఫ్లూ తీవ్రత ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకో వచ్చు. రాజస్థాన్‌లో ఈ పరిస్థితి మరింత ప్రమాదకర స్థాయిలో ఉంది. దేశంలో సుమారు 34శాతం కేసులు రాజ స్థాన్ నుంచే నమోదవుతుండటం అధికారులను కలవర పెడుతోంది. స్వైన్‌ఫ్లూ సంబంధిత సమాచారాన్ని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ విడుదల చేసింది. ఈ నివేదిక ప్రకారం రాజస్థాన్‌లో 2263మందిలో వ్యాధిలక్షణాలను గుర్తించారు. వారిలో సుమారు 85మంది మరణించారు. దేశరాజధానిలోనూ స్వైన్‌ఫ్లూ మహమ్మారి వ్యాపిస్తోంది. రాజస్థాన్, తర్వాత అత్యధికంగా స్వైన్‌ఫ్లూ కేసులు ఢిల్లీలోనే నమోదవుతున్నాయి. ఈ విషయం అధికారులను ఆందో ళనకు గురిచేస్తున్నాయి. రాజధానిలో స్వైన్‌ఫ్లూ ప్రభావంతో సుమారు 15మంది మరణించారు. కాగా మోడల్ స్టేట్ గుజరాత్‌లోనూ స్వైన్‌ఫ్లూ స్వైరవిహారం చేస్తోంది. ఈ నివేదికలో గుజరాత్ మూడో స్థానంలో నిలవడం గమ నార్హం. ఈ రాష్ట్రంలో 43మంది మరణించగా, సుమారు 898 మందిలో ఈ వ్యాధిని గుర్తించారు. దేశ వ్యాప్తంగా స్వైన్ ఫ్లూ కేసులు విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఈ వ్యాధిని నియంత్రిచడంలో కేంద్రం విఫలమయిందని ప్రతిపక్షాలు మండిపడితున్నాయి. ప్రభుత్వం వీటిపై స్పంది ంచి వ్యాధిని అరికట్టేందుకు త్వరితగతిన చర్యలు తీసుకో వాలని డిమాండ్ చేస్తున్నాయి. ప్రభుత్వం మాటలు కోటలు దాటుతున్నా, చేతలు మాత్రం గడప దాటడంలేదంటూ ఎద్దేవా చేస్తున్నాయి. ప్రభుత్వం ప్రకటనలకు పరిమితం కాకుండా దేశ వ్యాప్తంగా ప్రత్యేక క్యాంపులను ఏర్పాటు చేసి వ్యాధిని అరికట్టడానికి నడుం బిగించాలాని కోరుతున్నాయి. కాగా దేశ వ్యాప్తంగా సుమారు 6,601మందిలో ఈ వ్యాధి లక్షణాలను కనుగొన్నారు. కాగా వారిలో 2030 మందికి ఈ వారంలోనే వ్యాధిలక్షణాలు బయటపడటం వైద్యాధికా రులను విస్మయానికి గురిచేస్తున్నది.

నమ్మిన సిద్ధాంతం కోసం వర్దెల్లి పోరాడారు

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

- కోదండరామ్, జగదీశ్‌రెడ్డి, బడుగుల నివాళి
- పలువురి సందర్శన
- అంత్యక్రియలు పూర్తి





బుచ్చిరాములు భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

నవతెలంగాణ- సూర్యాపేట

సామాజిక న్యాయం ఎజెండాగా పేదల పక్షాన కడవరకూ పోరాడిన వర్దెల్లి బుచ్చి రాములు శాశ్వతంగా ప్రజల గుండెల్లో నిలిచిపోతారని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. సోమవారం అనారోగ్యంతో మృతిచెందిన బుచ్చి రాములు భౌతికకాయాన్ని మంగళవారం సూర్యాపేటలోని ఎంవీఎన్ భవన్‌లో ప్రజల సందర్శనార్థం ఉంచారు. ఈ సందర్భంగా సంతాప సభలో తమ్మినేని మాట్లాడుతూ.. నాటి నుంచి నేటి వరకు పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొని నమ్మిన సిద్ధాంతం కోసం కడవరకూ నిలబడిన వ్యక్తి బుచ్చి రాములు అని కొనియాడారు. పార్టీ పరంగా ఎన్నో అంతర్గత చర్చలు, సమావేశాలు, నిర్ణయాలు, సిద్ధాంతాలను తమతో పంచుకునేవారని గుర్తు చేసుకున్నారు. ఆయన అనుభవాలను పార్టీ పరిగణలోకి తీసుకొని ముందుకెళ్లిందన్నారు. రాజకీయాల్లో డబ్బు, అధికారం కోసం విలువలు కోల్పోయి, పార్టీలు మారుతూ ఊసరవెల్లి రాజకీయాలు చేస్తున్న నేటి తరంలో బుచ్చి రాములు లాంటి నిబద్ధత కలిగిన నాయకులు పార్టీకి కొండలా నిలబడ్డారన్నారు. ఆయన జీవితాన్ని నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలని కోరారు.

సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వెంకట్, నంద్యాల నరసింహారెడ్డి, జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ.. బుచ్చి రాములు పార్టీకి చేసిన సేవలను కొనియాడారు. 85 సంవత్సరాల జీవితంలో 60 సంవత్సరాలు పార్టీకి అంకితం చేశారనీ, అలాంటి నాయకుడిని కోల్పోవడం పార్టీకి తీరనిలోటనీ అన్నారు.మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే జి.జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ.. నిజాయితీ, నిబద్ధత గల జీవితాన్ని గడిపిన ధన్యజీవి బుచ్చి రాములని కొనియాడారు. చివరి నిమిషం వరకు తన జీవితాన్ని పేద ప్రజలకు అంకితం చేసిన మహానేత అన్నారు. సిద్ధాంతాలతో రాజీ పడకుండా సామాజిక న్యాయం కోసం పాటు పడిన వ్యక్తి అన్నారు. టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షులు కోదండరామ్ మాట్లాడుతూ.. ప్రజల సమస్యలను తమ సమస్యలుగా చేసుకొని పోరాడేది కమ్యూనిస్టులు మాత్రమే అని స్పష్టం చేశారు. ఆ కోవకు చెందిన బుచ్చి రాములు తన జీవితం మొత్తాన్ని పార్టీకి ధారపోసిన ఆదర్శనీయుడు అన్నారు. కార్యదక్షత, నిబద్ధత కలిగిన ఇలాంటి నాయకులు మళ్లీ పుట్టరన్నారు.

రాజ్యసభ సభ్యులు బడుగుల లింగయ్య యాదవ్ మాట్లాడుతూ.. నీతి, నిజాయితీకి మారుపేరు బుచ్చి రాములు అన్నారు. నమ్మిన సిద్ధాంతానికి ప్రాణాలిచ్చే మనస్తత్వం ఆయనదని కొనియాడారు. ఆయన జ్ఞాపకార్థం నిర్మించనున్న గ్రంథాలయ భవన నిర్మాణానికి తన కోటా కింద నిధులు మంజూరు చేస్తానని ప్రకటించారు. సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ములకలపల్లి రాములు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో శాసనసభ్యులు నోముల నర్సింహ్మాయ్య, గాదరి కిషోర్ కుమార్, బొల్లం మల్లయ్య యాదవ్, చిరుమర్తి లింగయ్య, మాజీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, వైసీపీ రాష్ట్ర అధ్యక్షులు గట్టు శ్రీకాంత్‌రెడ్డి, బుచ్చిరాములు కుమారుడు, సాక్షి ఎడిటర్ వర్దెల్లి మురళి, చీఫ్ బ్యూరో రామచంద్ర మూర్తి, ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి, ఇంటి పార్టీ రాష్ట్ర అధ్యక్షులు చెరుకు సుధాకర్, కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి రమణ, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి కోటా రమేష్, సీపీఐ జిల్లా కార్యదర్శి గన్న చంద్రశేఖర్‌రెడ్డి, సీపీఐ(ఎం) నల్లగొండ జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు మల్లు నాగార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటయోధులు మల్లు స్వరాజ్యం, పార్టీ సీనియర్ నాయకులు అనంతరామశర్మ సంతాప సందేశాలు పంపించారు. కార్యక్రమానంతరం బుచ్చి రాములు భౌతికకాయంపై ఎర్రజెండా కప్పి, పూలతో అలంకరించిన ప్రత్యేక వాహనంలో కొత్త బస్టాండ్ సమీపంలో గల ఆయన నివాసానికి తీసుకెళ్లారు. అనంతరం సద్దల చెరువు వద్దగల హిందూ శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.

'నిరంతరంప్రజాఉద్యమాలే...'

సీపీఐ(ఎం) మాజీ రాష్ట్ర కమిటీ సభ్యులు బుచ్చిరాములు బ్రెయిన్‌స్ట్రోక్‌తో చనిపోవడం వట్ల ఆ పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శివర్గ సభ్యులు వి.శ్రీనివాసరావు సంతాపం తెలియజేశారు. పార్టీ, ప్రజా సంఘాల్లో చురుగ్గా పాల్గొన్నారని గుర్తు చేశారు. నిరంతరం ప్రజా ఉద్యమాలతో పెనవేసుకుని పని చేశారని అభిప్రాయపడ్డారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా ఉద్యమానికి బుచ్చిరాములు సేవలు ఎనలేనివని చెప్పారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుల చేశారు.

వాళ్లిద్దరిదీ ఉద్యమ నేపథ్యమే : జూలూరు గౌరీశంకర్

సీపీఐ(ఎం) సీనియర్ నేత బుచ్చిరాములు మృతికి తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యులు జూలూరు గౌరీశంకర్ సంతాపం ప్రకటించారు. వృద్ధాప్యంలో భార్య మరణం తట్టుకోలేక బుచ్చిరాములుకు బ్రెయిన్‌స్టోక్ వచ్చిందని తెలిపారు. కేవలం 44 రోజుల తేడాతోనే భార్యాభర్తలిద్దరూ మరణించడం దురదృష్టకరమని అభిప్రాయపడ్డారు. వాళ్ల జీవితం మొత్తం సమాజానికి అంకింతం చేశారని గుర్తు చేశారు.

8 గంటల పని విధానం తేవాలి



- కనీస వేతనం రూ.18 వేలివ్వాలి: సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎస్ రమ డిమాండ్
- హైదరాబాద్‌లో మోడల్ స్కూల్ సిబ్బంది ధర్నా

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని మోడల్ స్కూళ్లు, హాస్టళ్లలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సీఐటీ యూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎస్ రమ డిమాండ్ చేశారు. వారు 24 గంటలూ పనిలోనే ఉండాల్సి వస్తోందన్నారు. 24 గంటల పనివిధానం కార్మిక చట్టాలకు వ్యతిరేకమని విమర్శించారు. మోడల్ స్కూల్స్ సిబ్బందికి ఎనిమిది గంటల పనివిధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. మంగళవారం హైదరాబా ద్‌లోని ఇందిరాపార్క్ వద్ద తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. ఈ సందర్భంగా రమ మాట్లాడుతూ మోడల్ స్కూళ్లలో పనిచేస్తున్న సిబ్బందికి కనీస వేతనాలు ఇవ్వడం లేదన్నారు. వారికి కనీస వేతనం రూ.18 వేలు చెల్లించాలని కోరారు. ఉద్యోగ భద్రత లేకపోవడంతో ఉద్యోగులు మానసిక వేదనలో ఉన్నారని అన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. వారు రోజుకు 14,15 గంటలు పనిచేస్తున్నారని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు జె వెంకటేష్ మాట్లాడుతూ మోడల్ స్కూల్స్ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. అధికారుల వేధింపులు ఆపాలని కోరారు. జీవో నెంబర్ 14 ప్రకారం కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. మోడల్ స్కూల్స్ వర్కింగ్ కమిటీ ఫెడరేషన్ కన్వీనర్ రమేష్ మాట్లాడుతూ మోడల్ స్కూళ్లలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని కోరారు. తమ సమస్యలు పరిష్కరించకపోతే పాఠశాల విద్యాశాఖ సంచాలకుల కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. అనంతరం పాఠశాల విద్యాశాఖ సంచాలకుల కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు.

'అది బాబును ఉద్దేశించిన పాట కాదు'

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

చంద్రబాబునాయుడు వెన్నుపోటుదారుడని స్వయంగా ఆయన మామ, మాజీ సీఎం ఎన్టీరామారావే చెప్పారని లక్ష్మీస్ ఎన్టీఆర్ చిత్ర నిర్మాత రాకేష్‌రెడ్డి హైకోర్టుకు తెలిపారు. తమ చిత్రం మొత్తం ఎన్టీఆర్ జీవితచరిత్ర ఆధారంగా నిర్మిస్తున్నామని, ఈ చిత్రంలో చంద్రబాబు పాత్ర కోసం 'దగా..దగా.. కుట్ర..' అనే పాటను ప్రత్యేకించి రాయించిందని కాదని, ఈ పాటను మహాకవి శ్రీశ్రీ ఏనాడో రాశారని తెలిపారు. సీఎం పదవి నుంచి ఎన్టీఆర్‌ను చంద్రబాబు గద్దె దించడానికి ముందే ఆ పాట ఉందని రాకేష్‌రెడ్డి హైకోర్టుకువిన్నవించారు. ఈ పాటను ఏపీ సీఎం చంద్రబాబును లక్ష్యం చేసుకుని ఆయన కీర్తిని దెబ్బతీసేందుకే పెట్టారని, పాటను తొలగించేలా ఆదేశాలివ్వాలని ఏపీలోని పిఠాపురం టీడీపీ ఎమ్మెల్యే ఎస్‌వీఎస్ఎన్ వర్మ దాఖలు చేసిన వ్యాజ్యానికి రాకేష్‌రెడ్డి కౌంటర్ వ్యాజ్యం వేశారు. తమ పాటపైనగానీ చిత్రంపైగానీ ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే సినిమాటోగ్రఫీ చట్టం కింద ఫిర్యాదు చేసుకోవచ్చునని, లేదా సివిల్ కేసు/పరువు నష్టం దావాలు వేసుకోవచ్చునన్నారు. చంద్రబాబు మెప్పు కోసమే వర్మ ఈ పిల్ వేశా రని, దీనిని కొట్టేయ డమే కాకుండా జరిమానా విధిం చాలని రాకేష్‌రెడ్డి తన కౌంటర్ రిట్‌లో హైకోర్టును కోరారు.

'అడవుల రక్షణకు సమన్వయంగా పనిచేయాలి'

వన్య ప్రాణుల రక్షణకు ప్రభుత్వం అన్ని శాఖల సమన్వయంతో పనిచేస్తేనే ఫలితాలు ఉంటాయని హైకోర్టు వ్యాఖ్యానించింది. పూర్వపు ఆదిలాబాద్ జిల్లా విస్తరించిన కవ్వాల్ పులుల సంరక్షణ కేంద్రంలో పులుల సంరక్షణ పథకాన్ని అమలు చేయాలని కోరుతూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యం విచారణ సందర్భంగా మంగళవారం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ టీబీఎన్ రాధాకష్ణన్, న్యాయమూర్తి జస్టిస్ ఎ.రాజశేఖర్‌రెడ్డిలతో కూడిన ధర్మాసనం పైవిధంగా అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది.

సంపాదకీయం

ఓటమి పరిపూర్ణం!

గత 17ఏండ్లుగా అఫ్ఘానిస్తాన్‌లో అమెరికా పోరాడుతున్న తాలిబన్లతో శాంతి ఒప్పందం కొరకు అవసరమైన డ్రాఫ్ట్ తయారయిందని ట్రంప్ ప్రత్యేక దూత జల్‌మే ఖలీల్‌జాద్ ప్రకటించాడు. సోవియట్ల మద్దతుగల ప్రభుత్వాన్ని కూలదోయటానికి అమెరికా నేతృత్వంలో ఇస్లామిక్ మిలీషియాలకు కోట్లాది డాలర్ల ధన, ఆయుధ సహాయాన్ని అందించటంలో ఈ దూత కీలక పాత్రను పోషించాడు. ఈయన 1979లో అప్పటి అమెరికా అధ్యక్షుడు జిమ్మీ కార్టర్‌కు జాతీయ భద్రతా సలహాదారుగా వ్యవహరించిన బ్రెజెన్‌స్కీకి సహాయకుడిగా పనిచేశాడు. అలా అమెరికా సహకారంతో పుట్టిన వికృతి శిశువులే ఈ తాలిబన్, అల్ ఖాయిదాలు.

అమెరికా సామ్రాజ్యవాదం చేస్తున్న ఎడతెగని యుద్ధాలకు ముగింపు పలకాలంటే, వాటికి కారణమైన పెట్టుబడిదారీ వ్యవస్థకు వ్యతిరేకంగా అమెరికాలోను, అంతర్జాతీయంగాను కార్మికవర్గ రాజకీయ పోరాటాలు తీవ్రతరం కావాలి. అందుకు కావలసిన పరిస్థితులు వేగంగా ఆవిర్భవిస్తున్నాయని ఫ్రాన్స్‌లో జరుగుతున్న పోరాటాలు తెలియజేస్తున్నాయి.

ఖతార్‌లో తాలిబన్ల ప్రతినిధులతో ఖలీల్‌జాద్ జరిపిన చర్చల ఫలితంగా అఫ్ఘానిస్తాన్‌లో తిష్టవేసిన 14వేలమంది అమెరికా సైనికులను ఉపసంహరించటం జరుగుతుంది. అయితే 17ఏండ్ల సుదీర్ఘ కాలంపాటు అఫ్ఘానిస్తాన్‌ను ఆక్రమించిన తరువాత అమెరికా సైనిక, భౌగోళిక వ్యూహంలో మార్పు వచ్చింది. మారిన వ్యూహం ప్రకారం చైనా, రష్యావంటి అణ్వస్త్ర దేశాలతో అమెరికా సైనికంగా తలపడనుందనే విషయం తేటతెల్లమైంది. ఖతార్‌లో చర్చించిన ఒప్పందం ప్రకారం అమెరికా సైనిక దళాలను ఉపసంహరించు కునేందుకు ఉద్దేశింపబడిన 18నెలల కాలంలో తాలిబన్లు అంతర్జాతీయ టెర్రరిస్టు గ్రూపులకు ఆశ్రయం ఇవ్వకూడదు. ఈలోపు తాలిబన్లు అమెరికా మద్దతుతో నడుస్తున్న అఫ్ఘానిస్తాన్ ప్రభుత్వంతో కాల్పుల విరమణ ఒప్పందం చేసుకోవలసి ఉంటుంది.

ఇటువంటి పరిస్థితులలో గత 17ఏండ్లుగా అఫ్ఘానిస్తాన్‌ను దురాక్రమించి అమెరికా చేసిందేమిటి? అనే ప్రశ్న సహజంగానే ఉదయిస్తుంది. అమెరికా చేసిన యుద్ధం కారణంగా 175000మంది చనిపోయారు. పరోక్ష మరణాలను కూడా కలుపుకుంటే ఈ సంఖ్య దాదాపు పది లక్షలదాకా ఉంటుంది. ఒక పది లక్షలమంది తమ ఆవాసాలను విడిచి పారిపోవలసి వచ్చింది. అఫ్ఘాన్ ప్రజలేకాకుండా 2300మంది అమెరికా సైనికులు, 1100మంది ఇతర దేశాల సైనికులు, అనేకమంది ప్రయివేటు కాంట్రాక్టర్లు కూడా ఈ యుద్ధంలో చనిపోయారు. అలాగే ఈ యుద్ధంలో గాయపడిన వారి సంఖ్య పైన వివరించిన అంకెలకు పది రెట్లు ఉంటుంది.



అలాగే అఫ్ఘానిస్తాన్‌లో అమెరికా దురాక్రమణకు అయిన వ్యయం 1ట్రిల్లియన్ డాలర్లు(ఇది 70లక్షల కోట్ల రూపాయలకు సమానం). 'టెర్రరిజంపై యుద్ధం' అనే సాకుతో అమెరికన్ ప్రభుత్వం ప్రజల ప్రజాస్వామిక హక్కులపై దాడి చేస్తున్నది. 2001లో పాట్రియాట్ చట్టం చేసి పౌరులపై అడ్డూ అదుపులేని గూఢచర్యానికి పాల్పడుతోంది. అలాగే పౌరులను నిర్బంధించటం, హింసించటం, పోలీసు ఏజన్సీలను మిలిటరీకరించి ముస్లింలపైనా, వలస వచ్చినవారిపైనా జులుం చేస్తోంది. ఇతర దేశాలు కూడా అమెరికాను అనుకరిస్తూ ప్రజల హక్కులపై దాడి చేస్తున్నాయి.

క్షీణిస్తున్న అమెరికా సామ్రాజ్యవాద ప్రాభవాన్ని అరికట్టటానికి చమురు నిల్వలున్న ప్రాంతంలో మొదలు పెట్టిన ఈ యుద్ధం ఏ లక్ష్యాల కోసమైతే ప్రారంభించబడిందో ఆ లక్ష్యాలను సాధించటంలో విఫలమైంది. నియంతృత్వ ఆఫ్ఘాన్ ప్రభుత్వాన్ని ప్రజలు ద్వేషించారు. 2001 తరువాత అఫ్ఘానిస్తాన్‌లో తాలిబన్ల నియంత్రణలోనే ఎక్కువ భూభాగం ఉంది. మధ్య ఆసియాలో వ్యూహాత్మక చమురు, సహజవాయు వనరులకు సంబంధించి రష్యా, చైనాల ఆధిపత్యం రోజురోజుకూ పెరుగుతోంది. తన సైన్యాన్ని ఉపసంహరించుకున్న తరువాత కూడా అఫ్ఘానిస్తాన్‌లో అమెరికా సామ్రాజ్యవాదం తన ఆధిపత్యాన్ని కొనసాగించేందుకు నిస్సందేహంగా ప్రయత్నిస్తుంది. అందుకోసం బాగ్రామ్‌లోని వ్యూహాత్మక స్థావరాన్ని అమెరికా తన ఆధీనంలోనే ఉంచుకునే అవకాశం ఉంది.

అఫ్ఘానిస్తాన్ నుంచి సైనిక దళాల ఉపసంహరణ రష్యా, చైనాలతో సైనికంగా తలపడాలనే వ్యూహాత్మక మార్పుతో ముడిపడి ఉంది. దీనికి సంబంధించిన 'జాతీయ భద్రతావ్యూహం' డాక్యుమెంటును ప్రకటించి ఒక ఏడాది దాటింది. 'టెర్రరిజంపై యుద్ధం' స్థానంలో రష్యా, చైనాలతో తలపడటం అమెరికా వ్యూహంగా మారబోతున్నదని ఆ డాక్యుమెంట్ తెలియజేస్తున్నది. ప్రపంచ యుద్ధం దిశగా అమెరికా పయనించటాన్ని అమెరికా పాలక వర్గాలు వ్యతిరేకించటం లేదు. పైగా అందుకోసం పట్టుపడుతున్నాయి. రష్యాతో ట్రంప్ 'కుమ్మక్కు' అయ్యాడనీ, సిరియా, అఫ్ఘానిస్తాన్‌లలో అమెరికా తగినంత సైనిక శక్తిని వాడటంలేదని డెమొక్రాట్లు చేస్తున్న ఆరోపణలు దీనిలో భాగమే.

అయితే శత్రువు షరతులపై అఫ్ఘానిస్తాన్‌లో అమెరికా యుద్ధ విరమణ చేయటమంటే అమెరికా పరిపూర్ణంగా ఓటమి పాలయినట్టే. 17ఏండ్ల సుదీర్ఘ కాలంపాటు తన సాయుధ సంపత్తినంతా కూడదీసుకుని చేసిన యుద్ధంలో తాలిబాన్ సాయుధ దళాలను అమెరికా ఓడించలేకపోయింది. వియత్నాం యుద్ధం తరువాత అమెరికా ఇంత పరాజయాన్ని ఎక్కడా ఎదుర్కోలేదు. అయితే ఈ పరాజయాన్ని తాలిబన్లతో రాజీ పడటంద్వారా అమెరికా కప్పిపుచ్చుకుంటోంది. అమెరికా సామ్రాజ్యవాదం చేస్తున్న ఎడతెగని యుద్ధాలకు ముగింపు పలకాలంటే, వాటికి కారణమైన పెట్టుబడిదారీ వ్యవస్థకు వ్యతిరేకంగా అమెరికాలోను, అంతర్జాతీయంగాను కార్మికవర్గ రాజకీయ పోరాటాలు తీవ్రతరం కావాలి. అందుకు కావలసిన పరిస్థితులు వేగంగా ఆవిర్భవిస్తున్నాయని ఫ్రాన్స్‌లో జరుగుతున్న పోరాటాలు తెలియజేస్తున్నాయి.

మరో ఆయుధపోటీకి అమెరికా తహతహ



ఎం. కోటేశ్వరరావు

మూడు దశాబ్దాల క్రితం నాటి సోవియట్‌తో కుదుర్చుకున్న ఆయుధ నియంత్రణ ఒప్పందం నుంచి వైదొలగనున్నట్టు గతేడాది మధ్యంతర ఎన్నికల ప్రచారంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించినపుడు ఓట్ల కోసం అని అందరూ అనుకున్నారు. కానీ మరొక అడుగు ముందుకు వేస్తూ దాన్ని నిర్ధారిస్తూ ఒప్పందాన్ని పక్కన పెడుతున్నట్టు గత శుక్రవారంనాడు అమెరికా అన్నంత పనీ చేసింది. వెంటనే మేము మాత్రం తక్కువ తిన్నామా అంటూ తామూ వైదొలుగుతున్నట్టు రష్యా చెప్పేసింది. అంతేకాదు మరొక అడుగు ముందుకు వేసి నిషేధిత భూ ఉపరితలం నుంచి ప్రయోగించే క్షిపణుల తయారీకి పూనుకుంటున్నట్టు ప్రకటించింది. రెండు దేశాల మాటలు వాస్తవ రూపందాలిస్తే ఆరునెలల్లో పార్లమెంట్ల అనుమతితో ఆ ప్రక్రియ పూర్తి అవుతుంది. దీని మీద ఐరోపా వైఖరి బహిర్గతం కావాల్సి ఉంది. ఈ ఒప్పందం మీద ఉభయ దేశాలు ఆరోపణల, ప్రత్యారోపణల పూర్వరంగంలో 2014నుంచి అనేక దఫాలుగా జరిగిన చర్చలు ఎలాంటి ఫలితాలనివ్వలేదు. అయితే రెండు దేశాలకూ, ఐరోపాను, మొత్తంగా ప్రపంచాన్ని ప్రభావితం చేసే ఈ పరిణామం గురించి రెండు దేశాలకు వున్న సమస్యల కారణంగా పునరాలోచించే అవకాశాలు కూడా లేకపోలేదు. ఒప్పందాన్ని రష్యా ఉల్లంఘించిందని అమెరికా ఆరోపిస్తూ ఒప్పందం నుంచి తాము వైదొలనున్నట్టు చెబుతోంది. ఫిబ్రవరి రెండవ తేదీ వరకు తాము గడువిస్తున్నామని ఆ లోగా సానుకూలంగా స్పందించకపోతే తాము వైదొలుగుతామని డిసెంబరులోనే పాంపియో సూచన ప్రాయంగా చెప్పారు. నిషేధిత పరిధిలోని క్షిపణులను తాము పరీక్షించలేదని, తాము ఉల్లంఘించినట్టు ఆరోపణలు గాక రుజువులు చూపాలని రష్యా ప్రతిస్పందించింది. అమెరికాయే ఒప్పందానికి విరుద్ధంగా ఐరోపాలో క్షిపణులను మోహరించిందని పేర్కొన్నది.

మరోసారి ప్రపంచ యుద్ధమంటూ వస్తే మిగిలే దేశం ఒక్కటీ ఉండదు. ప్రచ్ఛన్న యుద్ధం 35వేల అణ్వాయుధాల తయారీకి దారితీసింది. వాటితో ప్రపంచాన్ని ఎన్నిసార్లు నాశనం చేయవచ్చో వూహించుకోవాల్సిందే. అలాంటి పోటీని మరింతగా పెంచేందుకు అమెరికా పూనుకుంది. ఇది అత్యంత దుర్మార్గం. నిజంగానే ఒప్పందం రద్దయితే ఆ చారిత్రాత్మక ఎదురుదెబ్బకు బాధ్యురాలు అమెరికానే అవుతుంది.

ఎందుకీ ఒప్పందం అవసరమైంది?

ప్రచ్ఛన్న యుద్ధంలో భాగంగా సోవియట్ యూనియన్‌కు వ్యతిరేకంగా ఐరోపా ధనిక దేశాలు అమెరికాతో చేతులు కలిపాయి. దాంతో తన వ్యూహంలో భాగంగా పశ్చిమ ఐరోపా దేశాల మీద దాడి చేయగల ఎస్-ఎస్20 మధ్యంతర శ్రేణి క్షిపణులను సోవియట్ తన గడ్డమీద మోహరించింది. దానికి ప్రతిగా అమెరికన్లు ఇటలీ, బ్రిటన్, జర్మనీలో తమ ఆయుధాలను ఎక్కుపెట్టారు. ఈ మోహరింపును అక్కడి జనం తీవ్రంగా వ్యతిరేకిస్తున్న పూర్వరంగంలో మధ్య, స్వల్ప శ్రేణి అణు బలాల ఒప్పందం(ఐఎన్ఎఫ్) పేరుతో తమ వద్ద వున్న మధ్య, లఘు శ్రేణి క్షిపణులను తొలగించుకొనేందుకు 1987డిసెంబరు 8న గోర్బచెవ్-రోనాల్డ్ రీగన్ మధ్య కాలపరిమితి లేని ఒప్పందం కుదిరింది. మరుసటి ఏడాది జూన్ ఒకటి నుంచి అమలులోకి వచ్చింది. తరువాత సోవియట్ రద్దు కావటంతో దాని వారసురాలిగా రష్యా ఒప్పందంలోకి వచ్చింది. ఆ మేరకు 500 నుంచి వెయ్యి కిలోమీటర్ల వరకు వున్న లఘు, వెయ్యి నుంచి 5,500కి.మీ. ఉండే మధ్య శ్రేణి అణు, సాంప్రదాయ క్షిపణులను రెండు దేశాలు తొలగించాల్సి వుంటుంది. సముద్రం నుంచి ప్రయోగించే క్షిపణులు ఈ ఒప్పంద పరిధిలో లేవు. ఒప్పందం ప్రకారం 1991నాటికి అమెరికా 846 సోవియట్ లేదా రష్యా 1,846 క్షిపణులను నాశనం చేశాయి.

అమెరికాను ప్రేరేపిస్తున్న అంశాలేమిటి?

గత ఐదేండ్ల పరిణామాలను చూసినప్పుడు ఒప్పందం రద్దు గురించి అమెరికన్ల గళమే ఎక్కువగా వినిపిస్తున్నది. రష్యా నుంచి అటువంటి ప్రకటనలు లేవు. తాజాగా ట్రంప్, విదేశాంగ మంత్రి పాంపియో ప్రకటనల వెనుక ఆంతర్యం గురించి కూడా పరిపరి విధాల ఆలోచనలు సాగుతున్నాయి. 1987 ఒప్పందం తరువాత అమెరికా తయారు చేస్తున్న లేదా ఇప్పటికే తయారు చేసిన అధునాతన అణ్వాయుధాలను ప్రపంచం ముందుంచాలంటే రష్యాతో కుదుర్చుకున్న ఒప్పందం ఆటంకంగా ఉంది. రష్యా, చైనా వంటి సుదూర లక్ష్యాలను చేరగల క్షిపణిని తయారు చేస్తున్నట్టు అమెరికా ఇంధనశాఖ సూచన ప్రాయంగా ఇటీవలనే వెల్లడించింది. 1987 ఒప్పందంలో చైనా లేని కారణంగా అది స్వంత అణ్వాయుధ, అన్ని శ్రేణుల సాంప్రదాయ క్షిపణులను తయారు చేసుకొనేందుకు అవకాశం ఇచ్చిందని, ఐఎన్ఎఫ్ ఒప్పందం ఐరోపా కేంద్రంగా చేసుకున్నదని అమెరికా-చైనా మిలిటరీ బలాబలాలను పరిగణనలోకి తీసుకోలేదని, ఆ అంశం ఇటీవలి కాలంలో అమెరికా వ్యూహాత్మక లెక్కల్లో కేంద్ర స్థానాన్ని ఆక్రమించిందని అమెరికాలో కొత్త వాదనలు లేవనెత్తారు. గత మూడు దశాబ్దాలలో అనేక దేశాలు అధునాతన అణ్వాయుధాలను తయారు చేశాయి. ఇది రెండు దేశాలకే పరిమితమైనందున వాటిని నియంత్రించే అవకాశం లేదు. అందువలన దానికి ఎందుకు కట్టుబడి ఉండాలని, గతంలో కుదిరిన ఒప్పందాలన్నీ అమెరికాను అదుపు చేసే లక్ష్యంతోనే జరిగాయని, అందువలన వాటికెందుకు కట్టుబడి ఉండాలని యుద్ధోన్మాదులు ప్రశ్నిస్తున్నారు. దీనికి అనుగుణ్యంగానే అధికారానికి వచ్చినప్పటి నుంచి ట్రంప్ వ్యాఖ్యలు చేస్తున్నాడు. మరోవైపు ఒబామా, ట్రంప్ ఎవరు అధికారంలో వున్నా ఏటేటా రక్షణ బడ్జెట్ పెంపుదల వెనుక నూతన ఆయుధాల తయారీ వుందన్నది స్పష్టం. ఒప్పందం నుంచి వైదొలుగుతామని ప్రకటించటంలో ముందుండటమే కాదు, దాని ప్రారంభంలోనే తూట్లు పొడిచింది. ఒప్పందం కుదిరిన నాలుగేండ్ల తరువాత 1991లో అమెరికా తన తొలి దీర్ఘశ్రేణి అణ్వాయుధాల తయారీకి పూనుకుంది. దాన్ని చూపి మిగతా దేశాలు కూడా తమ ప్రయత్నాల్లో తాము నిమగ్నమయ్యాయి.

ఒప్పంద రద్దు పర్యవసానాలేమిటి ?

ఒప్పందం రద్దు పర్యవసానాల గురించి కూడా చర్చ జరుగుతోంది. అమెరికా, రష్యా చర్యలు ప్రపంచంలో నూతన ఆయుధ పోటీకి తెరలేపుతాయని భయపడుతున్నారు. ఇప్పటి వరకు ఈ పోటీ రెండు దేశాలకే పరిమితం కాగా నూతన పరిస్థితుల్లో చైనా కూడా అనివార్యంగా రంగంలోకి దిగాల్సి ఉంటుంది. నిజంగా ఒప్పందాన్ని రద్దు చేసుకుంటే అమెరికా, రష్యా, చైనా మధ్య నూతన తరహా ప్రచ్ఛన్న యుద్ధం వంటి పరిస్థితి తలెత్తుతుందని, గతం కంటే ఇప్పుడు రష్యా, చైనాలు మరింత సన్నిహితంగా వున్న విషయాన్ని మరచిపోరాదని అమెరికా గూఢచార సంస్థలు హెచ్చరించినట్టు వార్తలు వచ్చాయి. నిజంగానే రద్దు చేసుకుంటే రష్యాతో ఎలా వ్యవహరించాలన్నది తక్షణం అమెరికా ముందున్న సమస్య.



2021లో నూతన వ్యూహాత్మక అణ్వాయుధ ఒప్పందం(న్యూ స్టార్ట్) కుదిరే అవకాశాలు లేవు. అది లేకుండా అణ్వస్త్రవ్యాప్తి నిరోధ అమలు సాధ్యం కాదు. అన్నింటికీ మించి అణ్వాయుధాలు అనేక దేశాల దగ్గర వున్నందున వాటన్నింటినీ కట్టడి చేయటానికి అవసరమైన పెద్ద సంఖ్యలో ఆయుధాలు తయారు చేయటానికి అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం, ఉత్పాదక శక్తి, ఆర్థిక సామర్థ్యం లేదన్నది ఒక అంచనా. వాటన్నింటినీ అధిగమించి అన్ని దేశాలకు వ్యతిరేకంగా అణ్వాయుధాలను మోహరిస్తే అమెరికా మరింతగా ఒంటరిపాటు కావటం ముఖ్య రాజకీయ పర్యవసానం అవుతుంది. ఆయుధాలను మోహరించటం తప్ప ప్రయోగించే పరిస్థితి లేనప్పుడు ఇలాంటి పరిస్థితిని కొని తెచ్చుకోవటం ఎందుకన్నది మౌలిక సమస్య. ఇప్పటికే అమెరికా తమమీద పెత్తనం చేస్తున్నదని, తమ భద్రత తాము చూసుకోగలమని ఐరోపా ధనిక దేశాలు అభిప్రాయపడుతున్నాయి. మరోవైపు నాటో ఖర్చు ఐరోపా దేశాలే ఎక్కువగా భరించాలని అమెరికా వత్తిడి తెస్తోంది. ఇప్పుడు నూతన ఆయుధాలను మోహరించాలంటే అది రష్యాతో వైరాన్ని పెంచటమే గాక తమ జనాన్ని ఒప్పించటం ఐరోపా దేశాలకు అంత తేలిక కాదు. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకున్నపుడు గత అనుభవాల రీత్యా అవసరమైన నూతన ఆయుధాలను తయారు చేసుకొనే వరకు వున్న ఒప్పందాలను కొనసాగించక తప్పని స్థితిలో అమెరికా ఉంటుందన్నది ఒక అభిప్రాయం. ఒప్పందం నుంచి వైదొలిగితే ట్రంప్ ఎప్పటి నుంచో చెబుతున్నట్టు ఐరోపాలో అమెరికా మరిన్ని కొత్త ఆయుధాలను మోహరించటం, దానికి ప్రతిగా రష్యా చర్యలు వుంటాయి. నిజంగా ఒప్పందం రద్దయితే జర్మనీ ఎక్కువగా ప్రభావితం అవుతుంది. ఐరోపా భద్రతకు, వ్యూహాత్మక సమతుల్యానికి ఒప్పందం కొనసాగటం అవసరమని ఫ్రెంచి అధ్యక్షుడు ఎమ్మాన్యుయెల్ మక్రాన్ వ్యాఖ్యానించగా, అమెరికా ఆయుధాల మోహరింపు బహుముఖ ప్రతికూల ప్రభావాలను కలిగిస్తాయని చైనా పేర్కొన్నది. మధ్యంతర ఎన్నికల సమయంలో ట్రంప్ చేసిన ప్రకటనతో నాటో కూటమి దేశాలలో ఆశ్చర్యంతో పాటు ఆందోళన కూడా వ్యక్తమైంది. తాజా పరిస్థితికి రష్యాదే పూర్తి బాధ్యత అని అమెరికా నాయకత్వంలోని నాటో తాజాగా వ్యాఖ్యానించటంలో ఆశ్చర్యం లేదు. డెమొక్రటిక్ పార్టీ సెనేటర్ ఎడ్వర్డ్ జె మార్కే మాట్లాడుతూ ప్రమాదకరమైన ఆయుధపోటీకి దారి కల్పిస్తూ ట్రంప్, అతని యుద్ధ క్యాబినెట్ నిర్ణయం తీసుకున్నదని విమర్శించారు.

ఇటీవలి కాలంలో అమెరికా అంతర్జాతీయ వ్యవస్థ నుంచి ఏకపక్షంగా వైదొలుగుతున్నది. వాతావరణ మార్పులు, భూతాపం తదితర అంశాలున్న పారిస్ ఒప్పందం నుంచి, ఇరాన్‌తో అణు ఒప్పందం, అంతర్జాతీయ పోస్టల్ యూనియన్ నుంచి అమెరికా ఏకపక్షంగా వైదొలిగింది. అవన్నీ ఒక ఎత్తయితే తాజా ప్రకటన అత్యంత ప్రమాదకర చర్యల, అంతర్జాతీయ భద్రత మీద ఎంతో ప్రభావం చూపనుంది. తమ వద్ద వున్న పాత తరం అణ్వాయుధాలను వదలించుకొనేందుకు ఒప్పందంలో అమెరికా భాగస్వామి అయిందనే ఒక అభిప్రాయం వుంది. ఇప్పుడు అంతకంటే అధునాతన ఆయుధాలున్నందున మరోసారి ప్రపంచాన్ని భయపెట్టేందుకు పూనుకుందని చెప్పాలి. రెండవ ప్రపంచ యుద్ధం దాదాపుగా ముగిసిన తరువాత ప్రపంచాన్ని భయపెట్టేందుకు అమెరికన్లు జపాన్‌లోని హిరోషిమా, నాగసాకి నగరాలపై ప్రయోగించిన 'లిటిల్ బోయ్, ఫాట్ మాన్' అణుబాంబులు ఇప్పటి వాటితో పోల్చితే చాలా చిన్నవి. అయినా అవెంత మారణకాండకు కారణమయ్యాయో ఇప్పటికీ ఆ ప్రాంతంలో అణుధార్మికత ఎలా వుందో చూస్తున్నాము. మరోసారి ప్రపంచ యుద్ధమంటూ వస్తే మిగిలే దేశం ఒక్కటీ ఉండదు. ప్రచ్ఛన్న యుద్ధం 35వేల అణ్వాయుధాల తయారీకి దారితీసింది. వాటితో ప్రపంచాన్ని ఎన్నిసార్లు నాశనం చేయవచ్చో వూహించుకోవాల్సిందే. అలాంటి పోటీని మరింతగా పెంచేందుకు అమెరికా పూనుకుంది. ఇది అత్యంత దుర్మార్గం. నిజంగానే ఒప్పందం రద్దయితే ఆ చారిత్రాత్మక ఎదురుదెబ్బకు బాధ్యురాలు అమెరికానే అవుతుంది. ■

'అయోధ్య రామజన్మభూమి బాబ్రీ మసీదు నిజం...'



అరుణ

అయోధ్యలో రామమందిర నిర్మాణం తమ లక్ష్యం కాదని, 31 ఏండ్ల క్రితం రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ స్పష్టం చేసింది. ఢిల్లీ పీఠాన్ని చేజిక్కించుకునేందుకు భారత దేశాన్ని హిందూరాజ్యంగా మార్చేందుకు 'రామ మందిర నిర్మాణ' అంశాన్ని ఉపయోగించుకోవాలని అనుకున్నది.


27 డిసెంబర్ 1987లో ఆశ్చర్యకరంగా దేశంలో ఆనాడు వున్నా మరే వార్తా పత్రికల్లో రాని వార్త ఆర్ఎస్ఎస్ పత్రికలు పాంచజన్య, ఆర్గనైజర్‌లో పబ్లిష్ అయ్యింది. వార్త వివరం ఇలా వుంది "రామ భక్తులు విజయం సాధించారు. రామమందిరం నిర్మాణం జరగనున్నది. కాంగ్రెస్ సర్కారు తప్పని పరిస్థితుల నేపథ్యంలో రామమందిర నిర్మాణం చేయనున్నది. రామమందిర నిర్మాణం కోసం ఒక ట్రస్ట్ ఏర్పాటు కానున్నది." ఈ వార్తను చదివిన రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ సర్వ సంఘ్ సంచాలకుడు బాలసాహబ్ దేవరస్ ఢిల్లీలోని ఆర్ఎస్ఎస్ కార్యాలయం కేశవ్ కుంజ్‌కు విశ్వ హిందూ పరిషత్ మహా మంత్రి అశోక్ సింగల్‌ను పిలిపించారు. దేవరస్ అశోక్ సింఘాల్‌తో కోపంగా అన్నారు."నువ్వు చాలా ఏండ్లుగా స్వయం సేవకుడిగా పనిచేస్తున్నావు.. అటువంటి నీవు రామ మందిర నిర్మాణానికి ఆమోద ముద్ర ఎలా వేశావు." అప్పుడు సింఘాల్ అన్నారు "మన ఆందోళన రామమందిర నిర్మాణం కోసమే కదా! మందిర నిర్మాణం జరుగుతుందని నా ముందుంచిన ఫార్ములాకి స్వాగతించా" అన్నారు. సింఘాల్ మాటవిన్న దేవరస్ కోపంతో "నీ తెలివి గడ్డి తినటానికి పోయిందా..?" అని మండిపడ్డారు. అటుపై దేవరస్, అశోక్ సింఘాల్‌తో ఇలా అన్నారు." దేశంలో ఎనిమిది వందల రామమందిరాలు ఉన్నాయి అయోధ్యలో రామమందిర నిర్మాణం జరిగితే.. అది దేశంలో ఎనిమిదివందల ఒకటవ రామమందిరం అవుతుంది. కాకపోతే ఈ మందిరం కోసం జరుగుతున్న ఆందోళన ప్రజలలో పాపులర్ అయితున్నది. మందిర నిర్మాణం కోసం ప్రజా మద్దతు పెరుగుతున్నది. ఈ ప్రజా మద్దతు మనం రాజకీయ రూపంలో వాడుకుని ఢిల్లీ గద్దె ఎక్కే అవకాశం ఉంది. ఇంత రాజకీయ లాభం ఇచ్చే రామమందిర నిర్మాణ అంశంలో ఒక పరిష్కారంపై సమ్మతి తెలిపి మొత్తం ఆందోళనకు వెన్నుపోటు పొడిచావు." 1987లో డిసెంబరు నెల గజగజ వణికించే చలిలో దేవరస్ పలికిన పలుకులు విని అశోక్ సింగల్ ఆశ్చర్యంతో అవాక్కయి నిలబడిపోయారు.

రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ సర్వసంఘ్ సంచాలకుడు దేవరస్, విశ్వ హిందూ పరిషత్ మహా మంత్రి అశోక్ సింగల్ మధ్య జరిగిన ఆనాటి మాటల సంవాద సమాచారం నా కల్పనతో నేను రాయటం లేదు. ఈ సమాచారం ఆసాంతం 1987లో అయోధ్య వివాదాన్ని పరిష్కరించటానికి ఏర్పాటుచేసిన "అయోధ్య ట్రస్ట్"లో కన్వీనర్‌గా పనిచేసిన శీతలాసింగ్ అందించారు. శీతలా సింగ్ ప్రఖ్యాత సీనియర్ జర్నలిస్ట్. ఈయన ఫైజాబాద్ నుంచి పబ్లిష్ అయ్యే 'జన మోర్చ' దిన పత్రిక సంపాదకులు. శీతలా సింగ్ ఫైజాబాద్ చుట్టుపక్కల ప్రాంతంలో గౌరవనీయుడైన పత్రిక సంపాదకుడు 'అయోధ్య రామ జన్మభూమి బాబ్రీ మజిద్ కా సచ్' (అయోధ్య రామజన్మ భూమి బాబ్రీ మసీదు నిజం) అన్న పేరుతో హిందీలో ఒక పుస్తకాన్ని రాసారు. 'అయోధ్య రామ జన్మభూమి బాబ్రీ మజిద్ కా సచ్' (అయోధ్య రామ జన్మ భూమి బాబ్రీ మసీదు నిజం) పుస్తకం నూట పదవ పేజీలో పై సమాచారాన్ని అందించారు. 1987లోనే రామమందిర నిర్మాణ వివాద పరిష్కారానికి "అయోధ్య ట్రస్ట్" ఒక ఫార్ములా తయారు చేసింది. దాని ప్రకారం విదేశీ టెక్నాలజీ ఉపయోగించి బాబ్రీ మజిద్‌కు ఎటువంటి హానిలేకుండా అది వున్న చోటు నుంచి స్థానభ్రంశం చేసి వేరొక చోటికి తరలించి అటుపై రామ్ చబుత్రా నుంచి రామమందిర నిర్మాణం మొదలుపెట్టాలని. దీనిపై అశోక్ సింఘాల్ సమ్మతి తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న బాలసాహబ్ దేవరస్, అశోక్ సింఘాల్‌పై ఆగ్రహాన్ని వ్యక్తపరిచారు. అంతేకాదు "అయోధ్య ట్రస్ట్" చూపిన పరిష్కారానికి ఇచ్చిన సమ్మతి వెనక్కి తీసుకోవాలని అశోక్ సింఘాల్‌కి స్పష్టం చేసారు. "అయోధ్య ట్రస్ట్" ఫార్ములాపై అప్పటి ముస్లిం నాయకుడు సయెద్ షాహబుద్దీన్ కూడా సమ్మతి తెలిపారు. మజిద్‌కు హానిలేకుండా స్థానభ్రంశం చేయటానికి జామా మజిద్ ఇమామ్‌తో కూడా సమ్మతి ఇప్పించారు. అంతేకాదు "అయోధ్య ట్రస్ట్" ఫార్ములాకి అప్పటి విశ్వహిందూ పరిషత్ ముఖ్య నాయకుడు మహంత్ అవైద్యనాథ్ కూడా తన సమ్మతి ప్రకటించారు. మహంత్ పరమహంస. నత్యగోపాల్ దాస్, జస్టిస్ దేవకీ నందన్ అగ్రవాల్, నారాయణచారి వంటి నాయకులూ ఆర్ఎస్ఎస్‌ని కాదని మహంత్ అవైద్యనాథ్ అనుచరులుగా వున్నారు. మహంత్ అవైద్యనాథ్ "అయోధ్య ట్రస్ట్"లో సభ్యులు కారు. అయితే విశ్వహిందూ పరిషత్ ముఖ్య నాయకుడు. "అయోధ్య ట్రస్ట్" ఫార్ములాపై ఆమోద ముద్ర వేశారు. రచయత శీతలాసింగ్ ప్రకారం ఓ సమావేశంలో మహంత్ అవైద్యనాథ్, శీతలా సింగ్‌తో బిడ్డా..! మందిర నిర్మాణం జరిగేలా చూడు విశ్వహిందూ పరిషత్‌లో ఉన్న అగ్రకుల ఆర్ఎస్ఎస్ నాయకులకు కేవలం ఓట్లు.. నోట్లకు రాజకీయం కావాలి."

దేవరస్ మాట విన్న విశ్వహిందూ పరిషత్ నాయకులు నెమ్మదిగా "అయోధ్య ట్రస్ట్" రామమందిర నిర్మాణానికి ఇచ్చిన పరిష్కార ఫార్ములా నుంచి బయటకి రావటంపై పూర్తి సమాచారాన్ని శీతలా సింగ్ రాసారు. అలాగే కాంగ్రెస్ రామమందిర వివాదాన్ని ఎన్నికల కోసం ఎలా వాడుకున్నదీ తెలిపారు. రామ మందిర వివాదం పుట్టుక పూర్వోత్తరాలు.. వివాదాలు.. మందిరం చుట్టూ వున్నా ఆధ్యాత్మిక భావాలను రాజకీయ పార్టీలు వాడుకున్న తీరుపై "అయోధ్య ట్రస్ట్" కన్వీనరుగా వ్యహరించిన శీతలసింగ్ ఎంతో విలువైన సమాచారాన్ని అందించారు." ఈ పుస్తకం రాయటానికి ప్రధాన కారణం భావితరాలు నిజం తెలుసుకోవాలనుకుంటే వారి ముందు ఒక నిజాయితీ రికార్డు ఉంచాలని అనుకుని ఈ పుస్తకం రాసానని" శీతలా సింగ్ అంటున్నారు. సుప్రీం కోర్టులో రామజన్మ భూమి కేసు నడుస్తున్నది. హిందువుల సహన పరీక్షా జరుగుతున్నదని బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లు అంటున్నాయి. అసలు హిందువుల సహనంతో ఆడుకున్నదెవరో తెలుసుకోవాలంటే శీతలా సింగ్ రాసిన 'అయోధ్య రామ జన్మ భూమి బాబ్రీ మజిద్ కా సచ్' (అయోధ్య రామ జన్మ భూమి బాబ్రీ మసీదు నిజం) పుస్తకం తప్పక చదువుకోవాల్సిందే.

\- ఢిల్లీ నుంచి

ఎన్నికల వేళ... ఓట్లకు వల




సంగిరెడ్డి హనుమంతరెడ్డి

రైతు రొక్కం మొదటి కంతు ఏప్రిల్‌లో చెల్లిస్తామన్న గోయల్ హామీ ఎన్నికల లంచమే. నెలకు 15,000లోపు జీతమొచ్చే అసంఘటిత కార్మికుల గణాంకాలే ప్రభుత్వం దగ్గర లేవు. పింఛన్ పేరు పెట్టిన పొదుపు పథకం ఎవరికి అమలు చేస్తారు? బడ్జెట్‌కు ముందే ప్రయివేటు కాలేజీల సీట్లు పెంచారు. కేంద్ర ఏడవ వేతన సంఘాన్ని రాష్ట్రాల ఉద్యోగులకూ అమలు చేశారు. విద్య, వైద్యాల నిధులు పెంచలేదు. బడ్జెట్ పేరుతో, గోయల్, పార్లమెంటులో వాక్చాతుర్య వాగ్దాన సూత్రాలతో ఎన్నికల ప్రచారం చేశారు.

ఎన్‌డీఏ బుద్ధిహీన జనాకర్షణకు వ్యతిరేకమని 2014లో బడ్జెట్ సమర్పిస్తూ జైట్లీ గొప్పలు చెప్పారు. ఐదేండ్ల విఫల పాలనతో మోడీకి జనాకర్షణ అవసరమైంది. 2014వాగ్దానాలు అమలు కాలేదు. గణాంకాల మోసం, అవకతవకల నివేదికలు, ప్రభుత్వ సంస్థల అణచివేత, విమర్శకుల నోళ్ల మూత, హింస, హత్యలు నిజాలను దాయలేకపోయాయి. ఉపాధీ ఉద్యోగ కల్పనా జరగలేదు. రైతుల బాధలు పెరిగాయి. ఆర్థిక వ్యవస్థ అధోగతి పాలయింది. అంతర్జాతీయ ధరలు తగ్గిన చమురు ఉత్పత్తులతో సహా ధరలన్నీ ఆకాశాన్నంటాయి. అవినీతి నిర్మూలన మాటలకే పరిమితం. విదేశాల్లోని నల్లధనం తెల్లగా మారి దేశీయ పెట్టుబడుల్లో పోగుపడింది. కశ్మీర్‌లో గందరగోళం చోటుచేసుకుంది. పాకిస్థాన్, చైనా, నేపాల్ సహా పొరుగు దేశాల సంబంధాలు క్షీణించాయి. అందిస్తామన్న సుపరిపాలన అటుంచి పరిపాలనా లోపాలు ప్రజాజీవితాన్ని అతలా కుతలం చేశాయి. మంచిరోజులు తమవారికే. ఈ నేపథ్యంలో మోడీ ఓట్ల వలల రాజ్యాంగ విరుద్ధ "మధ్యంతర" బడ్జెట్ ప్రవేశపెట్టారు.

రాజ్యాంగ అధికరణ 113 పూర్వకుండానే, 114 మేరకు ఆమోదించ కుండానే ఆర్థిక సంవత్సరంలో కొంత కాలానికి ఖర్చుల నిధులు మంజూరు చేసే అధికారం అధికరణ 116 (1) (ఎ) ప్రకారం ప్రతినిధుల సభకు ఉంది. కొత్త ప్రభుత్వం బడ్జెట్ సమర్పించే వరకు మధ్యంతర కాలానికి ప్రభుత్వ అత్యవసర ఖర్చుల పార్లమెంటు ఆమోదానికి దిగిపోయే ప్రభుత్వం సమర్పించే బడ్జెట్ తాత్కాలిక లేదా మధ్యంతర (Vote On Account) బడ్జెట్. ఇందులో విధానాలు, సంక్షేమ పథకాలు, పన్నుల మార్పులకు అవకాశం లేదు. ఆ బాధ్యతలు కొత్త ప్రభుత్వం చేపడుతుంది. కానీ మోడీ ప్రభుత్వం సాధారణ బడ్జెట్ ప్రవేశపెట్టింది. తాత్కాలిక బడ్జెట్ కొత్త ప్రభుత్వం అమలు చేస్తుంది. అమలు హామీ ఇవ్వలేని ప్రభుత్వానికి విధానాల ప్రకటన అధికారం లేదు. 70ఏండ్ల సంప్రదాయాన్ని మోడీ ప్రభుత్వం తుంగలో తొక్కింది. సాధారణ ఎన్నికల్లో ఓట్ల పంట కోతకు కొడవళ్ళు పదును పెట్టుకుంది. ప్రజాధనంతో ఓట్ల కొనుగోలు కుట్ర పన్నింది. బడ్జెట్ ముందు ఆర్థిక సర్వేను ఉద్దేశపూర్వకంగా మరిచారు. జాతీయ గణాంకాల కమిషన్ సభ్యులు బడ్జెట్‌కు ముందు రాజీనామా చేశారు. డిసెంబర్ 2018కి తయారయిన నిరుద్యోగ సర్వేలో 2017-18 సంవత్సర నిరుద్యోగం గత 45ఏండ్లలో లేనంత అధోగతికి చేరింది. మోడీ ఏకపక్ష నోట్లరద్దు ఉద్యోగాలను ఊడ గొట్టింది. బతుకు దెరువులను ధ్వంసం చేసింది.

తాత్కాలిక బడ్జెట్‌లో తక్షణ భవిష్యత్తు ఖర్చులనే చేర్చాలి. ఆర్థిక మంత్రి, బీజేపీ జాతీయ కోశాధికారి, నిధికర్త, చార్టర్డ్ అకౌంటెంట్ పియూష్ గోయల్ రాజకీయ బడ్జెట్‌లో పాత ఖర్చులు పెంచారు. 2018 డిసెంబర్ నుంచి కొత్త పథకాల రూపకల్పన చేశారు. కొత్త విధానాలు ప్రకటించారు. పన్నులు సవరించారు. 2030కి నవ భారతాన్ని నిర్మిస్తామని పది దార్శనిక కొలమానాలు సూచించారు. మోడీ పాలనకు 2030 దాకా ఆయుష్షు పోశారు. మోడీ తన నవ భారత నిర్మాణ కాల వ్యవధి 2022గా పేర్కొనటం గమనార్హం. ఇది రాజ్యాంగ విరుద్ధ అత్యధిక స్థాయి అహంకార ప్రక్రియ. 2018-19 ఆర్థిక సంవత్సరానికి సవరించిన ఆర్థికలోటు స్థూల జాతీయోత్పత్తిలో 3.4శాతం. 2019-20కి ప్రకటించిన ఆర్థికలోటు కూడా స్థూల జాతీయోత్పత్తిలో 3.4శాతమే. దీనర్థం కొత్త ప్రభుత్వం ఖర్చులు తగ్గించాలి. లేదా బడ్జెట్ నిబంధనలకే నీళ్లొదలాలి. ప్రజలను మోసం చేయాలి.



తనను ఎన్నుకుంటే మరిన్ని ప్రయోజనాలు కల్పిస్తానని మోడీ మర్మంగా సూచించారు. ఈ బడ్జెట్ లంచాల బహిరంగ పంపకం. గత ఐదేండ్లలో ఆర్థికం అత్యున్నత దశకు చేరినా ఉద్యోగ కల్పన జరగలేదని న్యూయార్క్‌లో రోగచికిత్స పొందుతున్న జైట్లీ వ్యాఖ్యానించారు.

ఆర్థిక బలహీనుల రిజర్వేషన్ వార్షిక ఆదాయ పరిమితి 8లక్షలు. 5లక్షల ఆదాయ పరిధి వారి ఆదాయ పన్ను తగ్గించారు. మినహాయించలేదు. 5లక్షల పైన ఆదాయమున్నవారు మొత్తానికి పన్ను చెల్లించాలి. దీన్ని ప్రస్తావిస్తూ జైట్లీ, ఈ పన్ను రాయితీ భారత మధ్య తరగతిని సమర్థవంతంగా బలోపేతం చేస్తుందన్నారు. ఏడాదికి రూ.10,920 వంతున 3కోట్లమందికి పన్ను తగ్గటంతోనే భారత మధ్యతరగతి మొత్తం బలపడుతుందా? వ్యవసాయ కూలీలు, కౌలు రైతులను వదిలేసి ఐదెకరాల లోపు భూమి కలిగిన రైతు కుంటుంబాలకు రోజుకు మనిషికి రూ1.09లిస్తే భారత రైతాంగం బతుకుతుందా? రైతు రొక్కం మొదటి కంతు ఏప్రిల్‌లో చెల్లిస్తామన్న గోయల్ హామీ ఎన్నికల లంచమే. నెలకు 15,000లోపు జీతమొచ్చే అసంఘటిత కార్మికుల గణాంకాలే ప్రభుత్వం దగ్గర లేవు. పింఛన్ పేరు పెట్టిన పొదుపు పథకం ఎవరికి అమలు చేస్తారు? బడ్జెట్‌కు ముందే ప్రయివేటు కాలేజీల సీట్లు పెంచారు. కేంద్ర ఏడవ వేతన సంఘాన్ని రాష్ట్రాల ఉద్యోగులకూ అమలు చేశారు. విద్య, వైద్యాల నిధులు పెంచలేదు. బడ్జెట్ పేరుతో, గోయల్, పార్లమెంటులో వాక్చాతుర్య వాగ్దాన సూత్రాలతో ఎన్నికల ప్రచారం చేశారు.

"కాంగ్రెస్ కనీస ఆదాయ హామీ పథకం తీసుకురావాలని నిర్ణయించింది. ఆకలి, పేదరికాల నిర్మూలనకు ప్రతి వ్యక్తికీ కనీస ఆదాయం చెల్లిస్తాం. ఇది మా దార్శనికత, వాగ్దానం." జనవరి 28న ఛత్తీస్‌ఘఢ్ రాజధాని రాయపుర్‌లో కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ప్రకటించారు. "మేము నిరుపేదలకు మౌలిక నెలవారీ ఆదాయం అందిస్తాం. అది 3శాతం ద్రవ్యలోటు పరిమితికి లోబడే ఉంటుంది" యూపీఏ ఆర్థిక మంత్రి చిదంబరం అన్నారు. మోడీ మధ్యంతర బడ్జెట్ తన బడ్జెట్‌కు నకలని ఈయన వ్యాఖ్యానించారు. ప్రజలను మభ్యపెట్టటంలో అందరూ ఒకటే.

ఉచితాలు వద్దు. ఉపాధులు కావాలని కార్మికులు, వీధి వ్యాపారులు, విద్యార్థులు, యువకులు వాపోయారు. మోడీ ప్రభుత్వం రాజ్యాంగవిరుద్ధంగా మధ్యంతర బడ్జెట్‌కు బదులు సాధారణ బడ్జెట్ సమర్పించిందని, రాష్ట్రపతిని కూడా తప్పుదారి పట్టించిందని న్యాయవాది మోహన్‌లాల్ శర్మ సుప్రీం కోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం వేశారు. "గత ఐదేండ్లలో దేశంలో చెప్పుకోతగ్గ సామాజిక, రాజకీయ ఆందోళనలు లేవు. మా పథకాల ఉద్యోగ కల్పనకిది నిదర్శనం." జైట్లీ న్యూయార్కులో సూత్రీకరించారు. దీనితో ఎవరేమి గుణపాఠం నేర్చుకుంటారో!?

సెల్: 9490204545

తల స్నానం చేస్తున్నారా?



షాంపూ అందరు వాడతారు. కానీ కొందరి జుట్టే అందంగా, మందంగా ఉం టుంది. అందుకు కారణా లేంటి? ఉన్నాయి... షాంపూ అప్లై చేయడం దగ్గరనుంచి... కండీషనర్ పెట్టి కడిగేదాకా... కొన్ని పద్ధతులున్నాయి. వాటి ప్రకారం చేస్తే జుట్టు బాగుంటుంది.

రకరకాల షాంపూ బ్రాండ్స్ మార్కెట్‌లో ఉన్నాయి. అందులో మీకు సరైనది ఏదనేది తెలుసుకోవడంలోనే అసలు కథ ఉంది. కాబట్టి మీ జుట్టుకు తగిన షాంపూని ఎంచుకోండి. అందుకోసం ట్రైకాలజిస్టును సంప్రదించండి. షాంపూ, కండీషనర్ రెండూ కలిసి కాంబో ప్యాక్స్ వస్తున్నాయి. ఎప్పుడూ అలా కొనకండి. షాంపూ విడిగా, కండీషనర్‌ను విడిగా తీసుకోండి.

షాంపూ పెట్టేముందు జుట్టును నీటితో జాగ్రత్తగా తడపండి. కచ్చితంగా రెండు నిమిషాలైనా జుట్టును తడపాలి. అప్పుడే జుట్టు షాంపూను గ్రహిస్తుంది.

చాలామంది షాంపూను జుట్టుకు అప్లై చేస్తుంటారు. అది తప్పు. షాంపూను కచ్చితంగా కుదుళ్లకు అప్లై చేయండి. ఇక కండీషనర్ అయితే కచ్చితంగా వెంట్రుకలకు అప్లై చేయండి. కుదుళ్లకు కాదు. ఈ రెండింటిని అర్థం చేసుకోవడంలోనే అసలు కిటుకు ఉంది.

షాంపూ పెట్టగానే కడిగేస్తుంటారు చాలా మంది. అలా చేయకూడదు. కనీసం రెండు నిమిషాలైనా షాంపూ మీ జుట్టు, కుదుళ్ల మీద ఉండాలి. అప్పుడే అది సరిగ్గా పనిచేస్తుంది. అంతేకాదు... తల స్నానానికి వేడి నీళ్లను వాడకూడదు. చన్నీళ్లను వాడటం వల్ల అది జుట్టు క్యూటికల్స్‌ను మూసేస్తుంది. క్యూటికల్స్ మూసుకుపోవడం వల్ల జుట్టు రాలడం తగ్గుతుంది.

వృత్తిరీత్యా చాలామంది రోజూ తలస్నానం చేస్తుంటారు. కానీ అది మీ జుట్టుకు చాలా డ్యామేజ్ చేస్తుంది. వారానికి మూడు లేదా నాలుగు సార్లు తలస్నాం చేయాలి. ఒకవేళ జుట్టు జిడ్డుగా అనిపిస్తే మధ్యలో డ్రై షాంపూ వాడండి. ❄

ఇ ట్ల చే ద్దాం



బంతి పూల మొక్కల కుండీలను ఇంటి వాకిట్లోనూ, కిటికీల దగ్గరా ఉంచితే, దోమలు పరారవుతాయి. బంతిపూలలోని పైరిత్రమ్ అనే రసాయనమంటే పురుగులకూ, దోమలకూ పడదు. అలాగే కాసిని పుదీనా ఆకులను నూరి, పేస్టులా చేసి, దానిని ఒక చిన్న కప్పులో వేసి, దోమలు ఎక్కువగా ఉన్నచోట పెడితే, ఆ వాసనకు దోమలు దరిచేరవు. వీలుంటే పుదీనా మొక్కలున్న కుండీలను కిటికీల్లోనూ, గుమ్మం ముందుంచినా మంచిదే.

సర్వరోగ నివారిణి




దానిమ్మ పండును ఒలుచుకుని తినడానికి ఓపిక ఉండాలే కానీ.. ఇక ఆరోగ్యానికి ఎటువంటి ఢోకా ఉండదు. దీన్లో ఉండే యాంటీ ఆక్సిడెంట్స్ రొమ్ము, పెద్దపేగు, ఊపిరితిత్తుల క్యాన్సర్లను రానివ్వదు. అధిక రక్తపోటును అదుపులో ఉంచి రక్త సరఫరా సాఫీగా జరిగేలా చూస్తుంది. మధుమేహం, ఎముకలు పెళుసుబారటం, కీళ్ల నొప్పులు, వాపులు, గుండె జబ్బులు రాకుండా అడ్డుకుంటుంది. గుప్పెడు గింజల్లోనే 83 కేలరీలని అందించి చెడుకొవ్వును కరిగించేస్తుంది. ఇందులో ఉండే పీచుపదార్థం జీర్ణశక్తిని పెంచి సన్నబడేలా చేస్తుంది. క్రమం తప్పకుండా తిన్నారనుకోండి చర్మం మీద ముడతలు రావు. ఆటలాడే వేళ తల్లిలా అలసట తీర్చేస్తుంది. ఇందులో విటమిన్ ఎ, సి, ఈ, బి6, ఫోలిక్ యాసిడ్, పొటాషియం ఫాస్ఫరస్, కాల్షియం, మెగ్నీషియం, కొవ్వు పదార్థాలు, మాంసకృత్తులు, నియాసిన్, రైబోఫ్లేవిన్, పీచు ఇవన్నీ .. నిద్రలేమి, దంత సమస్యలు, గొంతు నొప్పి, మతి మరుపు, నీరసం, అలసట, మూత్రపిండాల్లో రాళ్ల వంటి వాటిని నిరోధిస్తాయి. అందుకే వ్యాధి నిరోధక శక్తిని పెంచి సర్వరోగ నివారిణిగా పనిచేస్తుంది. ❄



పుస్తకాలు చాలామందికి కాలక్షేపం. కానీ ఆమెకు జ్ఞానతృష్ణ. డిగ్రీ పూర్తవ్వగానే పెండ్లయినా.. తరువాత ఎమ్మే చేసింది. ఏది నేర్చుకున్న పర్ఫెక్షన్ ఉండాలన్నది ఆమె అభిమతం. అందుకే చిన్నప్పుడెప్పుడో నేర్చుకున్న 'వీణ'ను మధ్యలో వదిలేయకుండా డిప్లొమా పూర్తి చేసింది. నాన్న స్ఫూర్తితో రచన మొదలుపెట్టి... నాలుగు పుస్తకాలు ప్రచురించే స్థాయికి ఎదిగింది. అవసరం కోసం కంప్యూటర్ నేర్చుకున్నా.. తరువాత టెకీ సావీగా మారింది. సాహిత్యం మీద ఉన్న ఆసక్తిని, టెక్నాలజీని లింక్ చేసి... బ్లాగ్ నిర్వహిస్తున్నది. ఆమె జి.ఎస్.లక్ష్మి. రచయిత, బ్లాగర్. సంగీతకారిణి. ఆమె పరిచయం ఆమె మాటల్లోనే...


'పుస్తకాలు..జ్ఞాననిధి'

నా పూర్తిపేరు గరిమెళ్ళ సుబ్బలక్ష్మి. మా అమ్మగారు శ్రీమతి పద్మావతి, నాన్నగారు శ్రీ పిడపర్తి సుబ్బయ్యశాస్త్రి. నేను పుట్టింది మా అమ్మమ్మగారి ఊరు కొత్తపేటలో. పెరిగింది మా నాన్నగారి బదిలీల దృష్ట్యా కొన్ని ఊళ్ళు తిరిగినా ఎక్కువగా ఉన్నది గౌతమీ తీరమైన రాజమహేంద్రవరంలో. నాన్న బాగా చదువుకున్నారు. ఉద్యోగం కూడా చేశారు. దాంతో ఆడపిల్లలు, మగపిల్లలు అని తేడా లేకుండా మమ్మల్నందరినీ చదివించారు. నాన్నగారి బదిలీలవల్ల హైస్కూలు చదువు నాలుగైదూళ్ళలో జరిగింది. రాజమండ్రి ఆర్ట్స్ కాలేజీలో పి.యూ.సి., బి.ఎ. మొదటిసంవత్సరం అయ్యక, మా నాన్నగారికి అక్కడినుంచి బదిలీ అవడం వలన తరవాతి రెండేళ్ళూ ప్రైవేటుగా చదివి డిగ్రీ పూర్తి చేసాను.



చదువుపై జిజ్ఞాస...

అయితే చదువు జ్ఞానం కోసమే కానీ... ఉద్యోగం తప్పనిసరి అన్న పరిస్థితులు కుటుంబంలో లేవు. అందుకే డిగ్రీ చేసినా... పెండ్లి కావడం తో ఉద్యోగ ప్రయత్నాలు చేయలేదు. కానీ... పెళ్ళయాక మావారు విశ్వనాథంగారి ప్రోత్సాహంతో ఎమ్.ఎ. చేసాను. ఆయన అప్పటికే ఉస్మానియా యూనివర్సిటీలో సోషియాలజీ ప్రొఫెసర్. నన్నెంతో ప్రోత్సహించారు. ఆయన ప్రోత్సాహం తోనే పెళ్ళికి ముందే నేర్చుకున్న కర్నాటక సంగీతం (వీణ)లో పెళ్ళయాక డిప్లొమా చేసాను. తరువాత పిల్లలతో బిజీ అయిపోయాను. పిల్లలు పెద్దయ్యి అమెరికాలో సెటిలవ్వడం వల్ల కంప్యూటర్ విద్య అవసరమనిపించి, ఎమ్.ఎస్.ఆఫీస్ కోర్సు చేసాను. పెళ్ళయ్యాక కూడా మావారు నా చదువుకీ, సంగీతానికీ మరింత ప్రోత్సాహాన్నందించారు.



సాహిత్యంపై అభిరుచి...

మా నాన్నగారికి సంగీతం, నృత్యం, సాహిత్యం అంటే చాలా ఇష్టం. ఆయనకు సంస్కృతం, తెలుగు, ఇంగ్లీషు భాషల్లో మంచి పట్టు ఉండేది. తెలుగు, ఇంగ్లీషుభాషల్లో రచనలు కూడా చేసేవారు. మాకు చిన్నప్పట్నించీ సంగీత, సాహిత్యాలమీద అభిరుచి కలిగించారు. ఆయనే చిన్నప్పుడు మాచేత పద్యాలు చెప్పించేవారు. పెద్దయాక చదువుతోపాటు సంగీతం కూడా నేర్పించారు. మంచి మంచి పుస్తకాలు చదవడం, వాటిగురించి మాట్లాడుకోవడం, మంచిపాటలు వినడం మా దినచర్యలో ఒక భాగంగా చేసేసారు. పెండ్లయ్యాక కూడా అదే కొనసాగింది.

నాన్న ప్రేరణతోనే...

ఇక రచనలు మొదలుపెట్టడానికి కూడా ప్రేరణ మా నాన్నగారే. నిత్యం చదువుతూ, ఏదో రాస్తూ ఉండేవారు. మనసులోని భావాన్ని కాగితంమీద పెట్టడం ఆయనను చూసే నేర్చుకున్నాను. భావోద్వేగాలకు మనసు స్పందించినప్పుడు ఆ భావానికి తగ్గ భాష మా నాన్నగారు చిన్నతనం నుంచీ మాకందించిన శిక్షణ వల్ల వచ్చింది. నా చిన్నప్పుడు కొందరు పెద్దమనుషులనబడేవాళ్ళు చిన్నపిల్లలను పనిపిల్లలుగా ముంబాయి,


కలకత్త, ఢిల్లీ లాంటి పట్టణాలకి తీసికెళ్ళడం చూసాను. అది నా మనసులో బాగా ముద్రపడిపోయింది.

దానినే ఇరవైయేళ్ళక్రితం "ఇది ఇలా సాగవలసిందేనా!" అనే పేరుతో రాసిన చిన్నకథ ఆంధ్రప్రభ వారపత్రికలో అచ్చయింది. తర్వాత చాలా సంవత్సరాలు యేమీ రాయలేదు. మళ్ళీ 2002 నుంచీ వరసగా రాయడం మొదలు పెట్టాను. ఈ పదిహేనేళ్ళలో వంద కథలు, ఒక నవల, ఒక మినీ నవల వివిధ పత్రికలలో అచ్చయ్యాయి. కొన్ని కథలు ఇంగ్లీషు, కన్నడ, తమిళ భాషలలోకి అనువదించబడి బహుమతులు అందుకున్నాయి. ఆకాశవాణిలో గత పాతికేళ్ళనుంచీ నేను ప్రసంగాలు చేసాను. నేను రాసిన కథలు, కవితలు, నాటికలు, పాటలు ఆకాశవాణిలో ప్రసారమయ్యాయి.



సాంకేతికత నేర్చుకుని...

పిల్లల చదువులు పూర్తయి... వాళ్లు సెటిలయిన తరువాత పెద్దగా ఆసక్తులుండవు. వాళ్ల అమెరికాలో ఉండటం వల్ల వాళ్లకోసం కంప్యూటర్ ఉపయోగించడం, మెయిల్స్ చేయడం, స్కైప్‌లో మాట్లాడటం వంటివన్నీ అలవాటయ్యాయి. ఆ క్రమంలోనే ఇంటర్నెట్‌లో ఉన్న తెలుగు పత్రికలన్నీ వరుసగా చదివేదాన్ని. కథలు, కవితలు.. ఒక్కటేమిటీ సాహిత్యాన్నంతా రెగ్యులర్‌గా ఫాలో అయ్యేదాన్ని. అయితే నేను రాసే రచనలేవో... ఇంటర్నెట్‌లోనూ రాయొచ్చు కదా! అన్న ఆలోచన వచ్చింది. అలా కంప్యూటర్ మీద తెలుగు రాయడం నేర్చుకుని 2009 లో అంతర్జాలంలో శ్రీలలిత అనే పేరుతో »srilalitaa.blogspot.in అనే బ్లాగ్ రాయడం మొదలుపెట్టాను. నేను రాసిన పోస్ట్ ఇష్టపడిన వారు ప్రపంచంలో ఏ మూలనున్నవాళ్ళైనా వెంటనే స్పందించేవారు. ఆ స్పందన నాకు మరింత ప్రోత్సాహాన్నందించింది. ఎక్కడెక్కడి వాళ్లమో ఒక్క వేదిక మీద చేరి సంగీత, సాహిత్యాల చర్చలు చేసుకోవడం ఎంతో సంతోషాన్నిచ్చేది. ఇప్పుడు కూడా ఫేస్ బుక్ లో రచయిత్రులమందరం కలిసి పెట్టుకున్న "ప్రమదాక్షరి" గ్రూప్‌లో ఎన్నో కథలమీద చర్చలు చేసుకుంటుంటాము. నా కథలు ఆడియోగా వచ్చాయి.



పుస్తకాల నేపథ్యం..

ప్రచురించబడిన కథలన్నీ ఒక రచయితకు మానస పుత్రికలే. అవన్నీ వివిధ పత్రికలలో వేరు వేరు చోట్ల ఉండడం వల్ల వాటిని జాగ్రత్త పెట్టడం కష్టం. వాటినన్నింటినీ ఒక పుస్తకంలా వేస్తే అన్నీ ఒకచోట భద్రంగా ఉంటాయనే ఉద్దేశమే పుస్తకం ప్రచురించడానికి కారణం. నవ్య, స్వాతి, ఆంధ్రప్రభ, ఆంధ్రభూమి, సుజనరంజని, కౌముది, సారంగ, వాకిలి మొదలైన ప్రింటు, అంతర్జాల పత్రికలలో నా కథలకు, కవితలకు బహుమతులు వచ్చాయి. కొన్ని కథలు కథావాహిని, ఆటా (అమెరికన్ తెలుగు అసోసియేషన్), జ్ఞాపకసంచిక, "ఆశాదీపం" ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీవారి సంకలనం 2014, కథాకేళి, ప్రమదాక్షరి కథాసంపుటాలలో చోటు చేసుకున్నాయి.

అమ్మ ప్రభావం ఎక్కువ...

నాపై ప్రభావం చూపిన మహిళల మా అమ్మగారే. ఆవిడ డిగ్రీలు చదవకపోయినా లోకాన్ని చదివారు. అప్పుడప్పుడూ ఒక్కొక్కటిగా ఆవిడ చెప్పిన మాటలు ఇప్పటికీ గుర్తు చేసుకుని, అలాగే నడుచుకుంటుంటాను.

ఇక సాహిత్యం అంటే అన్నీ ఇష్టమైనవే. ప్రత్యేకంగా చెప్పాలంటే మాలతీచందూర్, కె.రామలక్ష్మి, ముళ్ళపూడి వెంకటరమణగార్లవి కొంచెం ఎక్కువ ఇష్టం. పుస్తకాలు జ్ఞాననిధి. అందుకే ఈ సాహిత్యప్రపంచంలో వున్న మంచి రచనలు వీలయినన్ని చదవడమన్నది నాకు చాలా ఆనందం కలిగించే విషయం.

బహుమతులు, పురస్కారాలు...

"అతను – ఆమె – కాలం" కథల సంపుటికి 2017 సంవత్సరానికి గాను గోవిందరాజు సీతాదేవి సాహిత్య పురస్కారం వచ్చింది. "రచన"(ఇంటింటి పత్రిక)లో మూడుసార్లు కథాపీఠం పురస్కారం దక్కింది. "రచన" నిర్వహించిన కథలపోటీలలో ఆరుసార్లు బహుమతులు అందుకున్నాను. "వాకాటి పాండురంగారావు స్మారక కథలపోటీ" లలో రెండుసార్లు ప్రథమ, ప్రత్యేక బహుమతులు వచ్చాయి. "ఆటా" నిర్వహించిన కథలపోటీలలో రెండుసార్లు ప్రథమ, ప్రత్యేక బహుమతులు వచ్చాయి. "సారంగ" అంతర్జాలపత్రికవారు నిర్వహించిన కథలపోటీలో ప్రథమ బహుమతి దక్కింది. ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీవారు నిర్వహించిన కథలపోటీలో ఉత్తమకథగా ఎంపికయ్యింది. "లేఖిని" సంస్థ అందించిన వల్లూరి సత్యవాణిగారి "మాత దేవోభవ" పురస్కారం దక్కింది.



మాట్లాడేటప్పుడు జాగ్రత్త...

పిల్లలు మైనపు ముద్దలు. తల్లిదండ్రులను చూస్తూ, వారి మాటలనే వింటూ ఎదుగుతారు. కాబట్టి పిల్లలతో మాట్లాడటం, వారి ముందు మాట్లాడటం విషయంలో చాలా జాగ్రత్త అవసరం అంటున్నారు నిపుణులు. కచ్చితంగా పిల్లలతో మాట్లాడం ఓ కళ. అది తెలియకపోతే అనర్థమేనంటున్నారు. అయితే పిల్లలతో ఎట్లా మాట్లాడాలి? బిజీ లైఫ్. పోటీ ఎక్కువైంది. కాలంతో పోటీ పడాల్సి వస్తున్నది. ఇదంతా బయటికి పరిమితం చేయండి. చాలామంది అలా కాకుండా ఆఫీసు, ఇతరత్రా విషయాలను కూడా ఇంటికి తెచ్చి... ఇంట్లో పిల్లలకు కేటాయించాల్సిన సమయాన్ని కిల్ చేస్తారు. పిల్లలతో ఎక్కువ మాట్లాడరు. అది మంచిది కాదు. అలాగని ఇంట్లో ఉన్నంత సేపు మాట్లాడుతూనే ఉండక్కర్లేదు. కానీ ఏదో ఒక సమయం వాళ్లకు కేటాయించాలి. పూర్తిగా వాళ్లతోనే గడపాలి. కబుర్లు చెప్పాలి. రకరకాల విషయాలు పంచుకోవాలి. దానివల్ల వాళ్లు కూడా మీతో విషయాలను షేర్ చేసుకోవడం మొదలు పెడతారు. అయితే పిల్లలకు ఎంత సమయం కేటాయించామన్నది కాదు. ఎంత క్వాలిటీ టైమ్ కేటాయించమన్నది ముఖ్యం. అందుకే వారితో మాట్లాడుతున్నప్పుడు ఫోన్, ల్యాప్‌ట్యాప్, టీవీలాంటివన్నీ పక్కన పెట్టేసి... పూర్తిగా వాళ్లమీదే దృష్టి పెట్టండి. వేరే పని చేసుకుంటూ వాళ్లతో సంభాషించకండి. దానివల్ల వాళ్లు చెప్పేది వినే ఆసక్తి మీకు లేదని వాళ్లు అర్థం చేసుకుంటారు. తరువాత ఏ విషమైనా మీకు చెప్పాలన్న ఆసక్తి వాళ్లకే పోతుంది.

కొందరు పెద్దవాళ్లమే తప్పులు చేస్తుంటాం. పిల్లలు కచ్చితంగా తప్పులు చేస్తారు. అలాగని వాళ్ళ తప్పు చేస్తే అరవకండి. ఎందుకిలా చేశావ్? అని సౌమ్యంగా అడగండి. మీరు పిల్లల మీద అరిస్తే వాళ్లలో భయం పెరిగిపోతుంది. నిజం చెప్పే ధైర్యం సన్నగిల్లిపోతుంది. ఇక ఏది చేయాలన్నా భయపడతారు. కాబట్టి అరవకండి.

మనకు కొన్ని విషయాలు నచ్చుతాయి. కొన్ని నచ్చవు. నచ్చనివాటిపట్ల, అభ్యంతరమైన విషయాలపట్ల మనం వాదనలు చేస్తుంటాం. ఇవి పెద్దవాళ్లతో అయితే సరి! కానీ పిల్లలతో అస్సలు వాదనకు దిగకండి. లేదంటే వాదించే లక్షణం వాళ్లకి కూడా అలవడుతుంది. కాబట్టి అనవసర వాదనలు వద్దేవద్దు.

పిల్లలు చెప్పేది పూర్తిగా వినరు. ఏదైనా చెప్పబోతే ఇంకేం మాట్లాడకు, నోర్మూసుకో అంటూ అరిచేస్తుంటారు. మీకు ఆ అలవాటుంటే వెంటనే మానేయండి. లేదంటే వాళ్ల మాట మీరు వినరన్న భావం ఏర్పడి విషయాలు చెప్పడమే మానేస్తారు.

అన్నీ మీకే తెలిసినట్టు మాట్లాడకండి. పిల్లలకు తెలియకపోవచ్చు. కానీ నీకేం తెలుసు, నేను చెప్పేది విను అనకండి. కొన్నిసార్లు మనకు తెలియని విషయాలు పిల్లలకు తెలుస్తాయి. అందుకే వాళ్లు చెప్పేది వినండి. చాలా బాగా చెప్పావు నాన్నా అని మెచ్చుకుని, అందులో ఉండే తప్పొప్పులు సాధ్యాసాధ్యాల్ని చర్చించండి.

అయితే అన్నిటినీ ఆదేశిస్తున్నట్టు చెప్పకండి. ఇది చెయ్యి అని సౌమ్యంగా చెప్పండి. అవసరమైనప్పుడు రిక్వెస్టింగ్ గా కూడా చెప్పండి. వాళ్లు చేయడానికి ఇష్టపడకపోతే ఎందుకు చేయమంటున్నారో, చేయడం వల్ల ఉపయోగం ఏంటో, చేస్తే మీరెంత ఆనందపడతారో తెలిసేలా చేయండి. చేయకుండా ఉండరు. ❄

డార్క్ చాక్లెట్‌తో..

చాక్లెట్ అనగానే మనకు నెగెటివ్స్ మాత్రమే గుర్తుకొస్తాయి. కానీ... ఆరోగ్యానికి, అందానికి ఇదెంతో మేలు చేస్తుందంటు న్నారు పరిశోధకులు.



సూర్యరశ్మి నుంచి రక్షణ..

కోకోబీన్స్ నుంచి తయారు చేసే ఈ డార్క్ చాక్లెట్స్‌లో ఫ్లేవనాయిడ్స్, యాంటీ ఆక్సిడెంట్స్ ఎక్కువగా ఉంటాయి. అందుకే డార్క్ చాక్లెట్లు తిన్నవాళ్ల చర్మం మృదువుగా ఉంటుందట. కారణం ఇది తేమను నిలిపి ఉంచేందుకు ప్రయత్నిస్తుంది. చర్మం రంగు మారడంపైనా ఇది పోరాడుతుంది. గ్రీన్ టీ, రెడ్ వైన్‌లో ఉండేదాని కంటే ఎక్కువగా డార్క్ చాక్లెట్స్‌లో యాంటీ ఆక్సి డెంట్స్ ఉంటాయి. ఫ్లేవ నాయిడ్స్ చర్మం వయసుపైబడకుండా కాపాడతాయి. ముడతలు రాకుండా కాపాడతాయి. కొత్త కణాల సృష్టికి తోడ్పడతాయి.

ఒత్తిడిని మాయం చేసే మందు డార్క్ చాక్లెట్. స్ట్రెస్ హార్మోన్స్ తగ్గించి... కొల్లాజెన్ ఉత్పత్తిని ఆపుతాయి. దీనివల్ల ముఖం ముడతలు తగ్గిపోతాయి. స్కిన్ కాంతిమంతమవుతుంది. కోకో కంటెంట్ ఎక్కువగా ఉన్న చాక్లెట్ ఉత్పత్తులను ఎంచుకోవాలి. డార్క్ చాక్లెట్‌లో ఐరన్, కాల్షియమ్, ఫాస్ఫరస్, పొటాషియం, విటమిన్ ఎ, బి1, సి, డి, ఇలున్నాయి. చాక్లెట్ తింటే పండ్లు పాడవుతాయి అంటాం. కానీ డార్క్ చాక్లెట్ దంతాల ఎనామిల్‌ను కాపాడుతుంది.

డార్క్ చాక్లెట్ మెదడు పనితీరును వృద్ధి చేస్తుంది. అందుకు కారణం.. గుండెకు, మెదడుకు మధ్య రక్త ప్రసరణ పెరగడమే. దాంతో మెదడు ఎండార్ఫిన్‌ను విడుదల చేస్తుంది. ఇది సంతోషంగా ఉండేలా చేస్తుంది.

లావుగా ఉన్నవాళ్లు చాక్లెట్లు తినకూడదన్న అపోహ ఉంటుంది. కానీ... డార్క్ చాక్లెట్లు మంచివేంటన్నుఆరు నిపుణులు. జంక్, ఫ్రైడ్ ఫుడ్ కంటే.. డార్క్ చాక్లెట్లు బరువు తగ్గించడంలో మేలు చేస్తాయి. కడుపు నిండిన ఫీలింగ్ ఉండటం వల్ల అతిగా తినం. అలాగే చాక్లెట్‌లో ఉన్న మోనోశాచురేటెడ్ ఫ్యాటీ యాసిడ్స్ జీర్ణక్రియను వృద్ధి చేస్తాయి. కొవ్వు, క్యాలరీలను తగ్గిస్తాయి. వైట్ అండ్ మిల్క్ చాక్లెట్‌కంటే... కోకో చాక్లెట్‌లో చక్కెర తక్కువగా ఉంటుంది.

జుట్టు పెరగాలనుకునేవాళ్లు కచ్చితంగా డార్క్ చాక్లెట్ తినాల్సిందే. ఇది జుట్టును పెంచే హార్మోన్ ఎక్కువగా విడుదలయ్యేందుకు తోడ్పడుతుంది. దీంతో మాడులో రక్త ప్రసరణ, ఆక్సిజన్ సరఫరా పెరుగుతుంది. దీనివల్ల బలమైన, ఒత్తయిన జుట్టు మీ సొంతమవుతుంది. కంటిచూపును మెరుగుపరుస్తుంది. రక్తపోటును సమతులంగా ఉంచుతుంది. చాక్లెట్‌లో ఉండే కాపర్, మెగ్నీషియం రక్త ప్రసరణ సాఫీగా జరిగేట్లు చేస్తాయి. దీంతో రక్తపోటు సమతులంగా ఉంటుంది. ఇందులో ఉండే యాంటీఆక్సిడెంట్స్ రక్తపోటును తగ్గించి... గుండె పనితీరును మెరుగుగు పరుస్తాయి. ❄

మానవి మీ స్పందన

'మానవి' పేజీలు మీకెలా ఉన్నాయి? ఇంకా ఏం కావాలనుకుంటున్నారు? మీ కుటుంబ సభ్యుల, మిత్రుల స్పందన ఎలా ఉంది? 'నవతెలంగాణ' కార్యాలయానికి రాయండి. మీ సూచనలు, సలహాలు ఇ-మెయిల్ navamaanavi@gmail.com కు తెలియ జేయండి.


మా చిరునామా

మానవి, నవతెలంగాణ దినపత్రిక,

ఎం.హెచ్. భవన్, ప్లాట్ నెం. 21/1, 1-8-664, అజామాబాద్, ఆర్.టి.సి. కల్యాణ మండపం సందు, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 500 020. లేదా 94900 99016కు ఫోన్ చేయండి. ఇప్పటికే మా ప్రయత్నాలను అభినందిస్తూ స్పందిస్తున్న వారికి కృతజ్ఞతలు.

102 కోట్లు చెల్లించండి

- వరదల సమయంలో ఐఏఎఫ్‌ను ఉపయోగించుకోవడంపై కేరళ ప్రభుత్వానికి బిల్లు పంపిన కేంద్రం



న్యూఢిల్లీ: గతేడాది భారీ వర్షాలు, వరదలతో అతలాకుతలమైన కేరళకు తగిన ఆర్థిక సహాయం అందించడంలో మోడీ ప్రభుత్వం మొండిచేయి చూపించిన విషయం తెలిసిందే. అయితే ఆ సమయంలో రక్షణ, పునరావాస చర్యల్లో భాగంగా వైమానిక దళాన్ని(ఐఏఎఫ్) ఆ రాష్ట్రం ఉపయోగించుకోవడంపై కేంద్రం లెక్కలు కడుతున్నది. భారత వైమానిక దళాన్ని ఉపయోగించకున్నందుకు కేరళ ప్రభుత్వం 102 కోట్లు చెల్లించాలని కేంద్రం తెలిపింది. దీనికి సంబంధించి సమగ్ర వివరాలతో కూడిన బిల్లును కేరళ ప్రభుత్వానికి పంపించింది. ఈ విషయాన్ని కేంద్ర మంత్రి సుభాశ్ భామ్రే రాజ్యసభలో వెల్లడించారు. అలాగే కేరళ వరదల సమయంలో రక్షణ చర్యల్లో పాలుపంచుకున్న ఆర్మీ, నౌక దళాలు కూడా తమకైన వ్యయానికి సంబందించిన పూర్తి బిల్లులను తయారు చేసే పనిలో ఉన్నాయని కేంద్ర మంత్రి అన్నారు. ఈ బిల్లులను ఒక పద్ధతి ప్రకారం తయారు చేసి కేరళ ప్రభుత్వానికి పంపించామని తెలిపారు. దీనికి కేంద్ర హెూం మంత్రిత్వశాఖ ఆమోదం కూడా పొందనట్టు వెల్లడించారు.

ఆర్మీకి నిధుల కొరత

- అధికారులకు చెల్లించే అలవెన్సులు నిలుపుదల: కేంద్ర రక్షణ మంత్రిత్వశాఖ నోటీసులో వెల్లడి

న్యూఢిల్లీ: దేశానికి రక్షణగా నిలిచే ఆర్మీ విషయంలో మోడీ ప్రభుత్వం ఉదాసీనతగా వ్యవహరిస్తుందా? అంటే అవుననే సమాధానాలు వినబడుతున్నాయి. అందులో విధులు నిర్వర్తించే అధికారులకు చెల్లించే తాత్కాలిక అలవెన్సులకు సంబంధించి ఆర్మీ వద్ద సరిపడా నిధులు కూడా లేకపోవడమే దీనికి ఉదాహరణ. ఈ విషయాన్ని సాక్షాత్తు కేంద్ర రక్షణ మంత్రిత్వశాఖ వర్గాలు పేర్కొన్నాయి. దీనికి సంబంధించి ఒక నోటీసును ప్రిన్సిపాల్ కంట్రోలర్ ఆఫ్ డిఫెన్స్ అకౌంట్స్(పీసీడీఏ) వెబ్‌సైట్లో సోమవారం పోస్ట్ చేశారు. 'అధికారులకు టీఏ, డీఏ వంటి తాత్కాలిక అలవెన్సులు చెల్లించడానికి తగినన్ని నిధులు ఆర్మీ వద్ద లేవు. అందుకే వారికిచ్చే టీఏ, డీఏ వంటి అలవెన్సుల నిలుపుదల చేశాం' అని ఆ నోటీసులో ఉన్నది. 'ఆర్మీకి తగినన్ని నిధుల సమకూరే దాకా అధికారులకు ఎలాంటి అడ్వాన్సుల వంటి ఇతర చెల్లింపుల ప్రక్రియ జరగదు. కానీ, ఎల్‌టీసీ మాత్రం కొనసాగుతుంది' అని అందులో పేర్కొన్నది. అయితే తదనంతరం మంగళవారం ఉదయమే ఈ నోటీసును తొలగించడం గమనార్హం. ఆర్మీలో నిధుల కొరత అనేది అందులో విధులు నిర్వర్తించే వందలాది అధికారులపై తీవ్ర ప్రభావాన్ని చూపన్నుది. ప్రస్తుతం ఆర్మీలో 40వేల మంది అధికారులు ఉన్నారు. ఆర్మీకి నిధుల కొరత విషయంలో మోడీ ప్రభుత్వాన్ని కాంగ్రెస్ విమర్శించింది. మోడీ ప్రభుత్వం మనదేశ ఆర్మీని కూడా మోసం చేసిందని ట్విట్టర్‌లో ఆరోపించింది.

ఎస్పీ, బీఎస్పీ కూటమితో కలుస్తాం

- బీజేపీ మిత్రపక్షం ఎస్‌బీఎస్పీ నేత ఓంప్రకాశ్

బలియా : రానున్న సాధారణ ఎన్నికలకు సంబంధించి యూపీలో తాము ఎస్పీ-బీఎస్పీ కూటమితో కలిసి పోటీ చేసే అవకాశం ఉందని బీజేపీ మిత్రపక్షం సుహేల్‌దేవ్ భారతీయ సమాజ్ పార్టీ(ఎస్‌బీఎస్‌పీ) అధ్యక్షుడు, కేంద్రమంత్రి ఓంప్రకాశ్ రాజ్‌భర్ తెలిపారు. ఇటీవల ఆయన బీజేపీపై బహిరంగ విమర్శలు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సోమవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఎన్నికల్లో తాము బీజేపీతో కలిసి ముందుకుపోలేని పక్షంలో అఖిలేష్, మాయావతిల కూటమితో కలిసే అవకాశం తమకు ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. ఈ విషయంపై వారితో ఇంకా చర్చించలేదని విలేకరుల ప్రశ్నకు ఆయన సమాధానం ఇచ్చారు.

70 శాతం ఉద్యోగాలు స్థానికులకే..

- మధ్యప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయం

భోపాల్ : రాష్ట్ర ప్రభుత్వం అందించే వివిధ రకాల ప్రోత్సాహకాలు పొందాలంటే పారిశ్రామికవేత్తలు ఇకపై తమ పరిశ్రమల్లో 70 శాతం ఉద్యోగాలను స్థానికులకే ఇవ్వాలని మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి కమల్‌నాథ్ అన్నారు. తమ పార్టీ ఎన్నికల ప్రణాళికలో భాగంగా ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని ఆయన తెలిపారు. హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని ఆయన సోమవారం ట్విట్టర్ ద్వారా తెలిపారు. మోడీ ప్రభుత్వ హయాంలో నిరుద్యోగం పెరిగిపోతున్నదని విమర్శలు వస్తున్న నేపథ్యంలో ఈ నిర్ణయం వెలువడింది. బీహార్, యూపీ రాష్ట్రాల నుంచి వచ్చే వారి వలన తమ రాష్ట్ర యువకులు ఉద్యోగాలు కోల్పోతున్నారని కమల్‌నాథ్ గత డిసెంబర్‌లో వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. ఆ వ్యాఖ్యలు అప్పట్లో వివాదాస్ప దమయ్యాయి.

'లైంగిక దాడులను సహించేది లేదు'

కొచ్చి : లైంగిక దాడులను సహించేది లేదని కేరళలోని కాథలిక్ చర్చి మంగళవారం స్పష్టం చేసింది. ఇటీవల జలంధర్ చర్చి బిషప్ ఫ్రాంకో ములక్కల్ లైంగిక దాడికి పాల్పడ్డాడంటూ వచ్చిన ఆరోపణలపై పెద్దఎత్తున ఆందోళన కొనసాగిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇటువంటి ఆరోపణలు, విమర్శలు అరికట్టేందుకు కేరళ కాథలిక్ బిషప్స్ కౌన్సిల్ (కేసీబీసీ) కొన్ని మార్గదర్శకాలను రూపొందించి మంగళవారం విడుదల చేసింది. లైంగిక నేరాలకు సంబంధించిన కేసులను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్ళడం, దర్యాప్తుకు సహకరించడం, మైనర్ బాలికలలో లైంగిక సంబంధాలను నివారించడం వంటి కొన్ని మార్గదర్శకాలను కేసీబీసీ జారీ చేసింది.

కందుల కొనుగోలు కేంద్రాలను కొనసాగించాలి

- సీఎంకు తెలంగాణ రైతు సంఘం లేఖ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర వ్యాప్తంగా మార్క్‌ఫెడ్ ద్వారా కందులను కొనుగోలు చేస్తున్న కేంద్రాలను యథావిధిగా కొనసాగించాలని తెలంగాణ రైతు సంఘం ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు జి. వెంకట్రామిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి టి. సాగర్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కందుల కొనుగోలు కేంద్రాలను ఐదు రోజులుగా మూసివేయడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. మార్చి నెలాఖరు వరకు కందుల కొనుగోళ్లు కొనసాగించాలని కోరారు. క్వింటాల్‌కు రూ. 5,675 మద్దతు ధర ఉంటే రూ. 4,500 నుంచి రూ. 4,800కే కొనుగోలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటి వరకు మార్క్‌ఫెడ్ కొనుగోలు చేసింది కానీ రైతులకు ఇంకా డబ్బులు ఇవ్వలేదని తెలిపారు. మార్క్‌ఫెడ్ కొనుగోళ్ళు నిలిపివేయడంతో అవకాశంగా తీసుకున్న ప్రయివేటు వ్యాపారస్తులు ధరలు తగ్గిస్తున్నారని చెప్పారు. రైతుల వద్ద ఉన్న కందులను మొత్తం మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయించా లని, రైతులకు ఇవ్వాల్సిన బకాయిలు చెల్లించాలని లేఖలో పేర్కొన్నారు.

కిసాన్ సమ్మాన్ నిధిని అమలు చేస్తాం : సీఎస్ ఎస్‌కె జోషి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టనున్న ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధిని తెలంగాణ ప్రభుత్వం కచ్చితంగా అమలు చేస్తుందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కె జోషి అన్నారు. ఈ నిధి విజయవంతం అవుతుందనే నమ్మకం ఉందని కేంద్ర వ్యవసాయశాఖ అధికారి అన్నట్టు ఆయన తెలిపారు. మంగళవారం సచివాలయంలో కేంద్ర వ్యవసాయశాఖ అదనపు కార్యదర్శి వసుదామిశ్రా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కలిసారు. ఈ సమావేశంలో రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ తివారి, వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శి పార్థసారథి, కమిషనర్ రాహుల్ బొజ్జా, సీసీఎల్ఏ డైరెక్టర్ కరుణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం మొదటగా ఈ పథకాన్ని అమలు చేస్తుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

ఎన్నికల చిట్టా!



ఎన్నికల వేళ ఆర్థికశాఖ మంత్రి యనమల రామకృష్ణుడు మంగళవారంనాడు ఓట్‌ఆన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రతిపాదించారు. 'తల్లి గర్భంలో ఉన్నప్పటి నుంచి జీవితంలోని అన్ని దశల్లోనూ సంక్షేమ పథకాలు వర్తించే గొప్ప రాష్ట్రంలో ఉన్నాం' అంటూ రాష్ట్ర ప్రభుత్వం కొండంత సంక్షేమరాగాన్ని ఆలపించింది. ఆర్థిక మంత్రి తాజాగా మరో ఆరు కొత్త పథకాలతో ఓటర్లకు గాలం వేసే ప్రయత్నం చేశారు. రైతులకోసం అన్నదాత సుఖీభవ, డ్రైవర్లకోసం సాధికార సంస్థ, క్షత్రియుల సంక్షేమనిధి, ఇళ్ల నిర్మాణకోసం భూసేకరణకు ప్రత్యేక నిధితో పాటు మరో రెండు పథకాలను ప్రకటించిన ఆయన ఇప్పటికే ఉన్న పథకాలకూ భారీగా నిధులు పెంచుతున్నట్టు తెలిపారు. పేరుకు ఓట్ అన్‌అక్కౌంట్ అయినప్పటికీ 2.26 లక్షల కోట్ల రూపాయల బడ్జెట్‌ను ప్రతిపాదించిన రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ లెక్కలను ఎన్నికల చిట్టాగా మార్చివేసింది. అట్టహాసపు, ఆర్భాటాల భారీ బడ్జెట్‌కు ఆధారం అప్పులే! అందుబాటులో ఉన్న అన్ని సంస్థల నుంచి అప్పులు చేయడానికి సిద్ధమైన సర్కారు పొంతన లేని అంకెలతో చేసిన గారడీ వెనుక ఎన్నికల వ్యూహం స్పష్టంగా కనిపిస్తోంది. 2018-19లో 50వేల కోట్లుగా ఉన్న కేంద్ర గ్రాంట్లు తాజా బడ్జెట్‌లో రూ.60 వేల కోట్లకు, రూ.29 వేల కోట్లగా ఉన్న బహిరంగ మార్కెట్ రుణాలు రూ.39 వేల కోట్లకు, వెయ్యికోట్లగా ఉన్న కేంద్ర ప్రభుత్వ రుణాలు 2,500 కోట్లకు పెరగనున్నాయి. భారీగా తెచ్చే అప్పులను ఎన్నికల తాయిలాల కింద పందారం చేయనుంది. పోనీ, అదయినా సజావుగా, సక్రమంగా జరుగుతుందా... అంటే, అనుమానమే! నిరుద్యోగ భృతిని రెట్టింపు చేస్తున్నట్టు ప్రకటించినప్పటికీ కేటాయింపులు మాత్రం 20శాతమే పెరిగాయి. రాష్ట్రంలోని 93 లక్షల మంది మహిళలకు పసుపు కుంకుమ పథకం కింద 9,300 కోట్ల రూపాయలు అవసరం కాగా, కేటాయించింది మాత్రం 4వేల కోట్లే! భారీ అంకెలు చూపడంలో ప్రభుత్వ చిత్తం దేనిమీద ఉందో ఈ అంకెలే స్పష్టం చేస్తున్నాయి. 2018-19 బడ్జెట్‌లో వివిధ సంక్షేమ పథకాలకు రూ.23,613 కోట్ల రూపాయలను కేటాయించినప్పటికీ ఆచరణలో ఖర్చు చేసింది రూ.18,258 కోట్ల రూపాయలే! అంటే, దాదాపు 5 వేల కోట్ల రూపాయలు కోత పెట్టింది. అవే పథకాలకు మళ్లీ భారీ కేటాయింపులు చేసి కండ్లముందు కనపడుతున్న కోతలను పట్టించుకోకుండా కండ్లు మూసుకుని సంక్షేమ కలలు మాత్రమే కనాలని ఆర్థిక మంత్రి చెప్పకనే చెప్పారు.

- ఆరు కొత్త పథకాలు - అప్పులే సర్కారుకు ఆధారం
- కొండంత సంక్షేమ రాగం.. ఆచరణ అనుమానం!


ఓటమి భయం స్పష్టం



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఓటమి భయం స్పష్టమైంది. లెక్కల్లో ఎక్కడా జవాబుదారీతనం కనిపిచలేదు. సంక్షేమ రంగాలకు నిధులు నామమాత్రమే.

- పార్థసారథి, వైసీపీ అధికార ప్రతినిధి

ఓట్ల కోసం గారడీ



వాస్తవ విరుద్ధంగా కేటాయింపులు చేసి ప్రజలను మోసగించేలా బడ్జెట్ ఉంది. ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు సంక్షేమ పథకాల పేరుతో ప్రజలను మోసగించి ఎన్నికల్లో లబ్ధిపొందాలని చూస్తోంది. ఓట్ల కోసం ప్రభుత్వం చేసిన ఈ అంకెల గారడీని ప్రజలు విశ్వసించరు.

- పి మధు, సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి


మరో వంచన



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ మరో వంచనకు ప్రతిరూపం. చంద్రబాబును స్తుతించే స్తోత్రంలా బడ్జెట్ ప్రసంగం సాగింది. కేటాయింపులన్నీ కాగితాలకే పరిమితం కావడం తప్ప ఆచరణలో అమలయ్యే అవకాశం కనిపించడం లేదు.

- కె రామకృష్ణ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి

అప్పుల ఊబిలోకి..



రాష్ట్రాన్ని టీడీపీ ప్రభుత్వం అప్పుల ఊబిలోకి దించింది. ఉమ్మడి రాష్ట్రంలో గత ప్రభుత్వాలన్నీ కలిసి రూ.96 వేల కోట్లు అప్పు చేస్తే ఈ నాలుగున్నరేండ్లల్లో టీడీపీ ప్రభుత్వ మొక్కటే రూ.1,53,435 కోట్ల అప్పు మిగిల్చింది.

- ఎన్ రఘువీరారెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు

ఐదు నెలలుగా జీతాల్లేవు!

పస్తులు, అప్పులతో జీవనం

- సంచార (104) ఉద్యోగుల వెతలు
- నిలిచిపోయిన 9.80 కోట్ల బకాయిలు


నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



గ్రామీణ ప్రాంతాల్లో సంచార వైద్య సేవల్లో కీలక పాత్ర పోషించే 104 ఉద్యోగులకు వేతనాలు నిలిచిపోయాయి. గత ఐదు నెలలుగా వారికి వేతనాలు అందడం లేదు. చాలీచాలని వేతనంతో జీవనం సాగిస్తున్న ఉద్యోగులకు ఆ మొత్తం కూడా చెల్లించకపోవడంతో కుటుంబ పోషణ కోసం అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. సెప్టెంబర్ వరకు వేతనాలు అందించిన ప్రభుత్వం తరువాత నెల నుంచి బడ్జెట్ నిలిపివేసింది. 2018-19 ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో రావాల్సిన నిధులు ఇప్పటి వరకు విడుదల కాకపోగా, నాలుగో త్రైమాసికం వచ్చే నెల నాటికి ముసుస్తున్నా అతీగతిలేకపోవడం గమ నార్హం. దీంతో ఐదు నెలలుగా రాష్ట్రవ్యాప్తంగా సుమారు రూ.9.80 కోట్లపైగా బకాయిలు పేరుకుపోయినట్టు అంచనా. రాష్ట్రంలో సంచార వాహనాలు 200 ఉండగా, వాటిలో సగం వరకు మూలనపడ్డాయి. మిగిలిన సగం దీర్ఘకాలిక రోగులకు సేవలు అందిస్తున్నాయి. వాటిలో 1,300 మంది ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. వివిధ గ్రామాల్లో బీపీ, షుగర్, అస్తమా రోగులతోపాటు గర్భిణులు, చిన్నారులను పరీక్షించి అవసరమైన మందులు పంపిణీ చేస్తారు. ఉద్యోగుల్లో ఫార్మాసిస్టులు, ల్యాబ్ టెక్నీషియన్లు, డ్రైవర్లు, కంప్యూటర్ ఆపరేటర్‌లు, సెక్యూరిటీ గార్డులు ఉన్నారు. ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీల ద్వారా పనిచేస్తున్నారు. వారంతా నిరుపేదలే కావడంతో ప్రతి నెలా వేతనం వస్తే తప్ప పూటగడవని పరిస్థితి. నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఫార్మసిస్టులు, ల్యాబ్ టెక్నీషియన్లకు రూ.17,500, డ్రైవర్లకు రూ.15,000, కంప్యూటర్ ఆపరేటర్‌లకు రూ. 15,000, సెక్యూరిటీ గార్డులకు రూ.13,000 చొప్పున రాష్ట్ర ప్రభుత్వం వేతనాలు ఇస్తుంది. అయితే, గత ఐదు నెలలుగా జీతాలు చెల్లించడంలేదు.

పెరిగిన ధరల కార ణంగా నెలనెలా వేత నాలు వస్తేనే పూట గడవడం కష్టంగా ఉంటుం దని.. అలాంటిది ఐదు నెలలుగా వేతనాలు అందక పరిస్థితి దుర్భరంగా మారిందని ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమస్యపై కుటుంబ సంక్షేమశాఖ అధికారులను కలిసినా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇండెంట్ పెట్టాం : డీహెచ్ శ్రీనివాస్



సంచార ఉద్యోగులకు వేతనాలు అందని విషయం వాస్తవమేనని రాష్ట్ర ప్రజారోగ్య సంచా లకలు డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. ఇందుకు సంబంధించి ఆర్థిక శాఖకు ఇండెంట్ సమర్పించాం. ప్రభుత్వం నుంచి ఎలాంటి సమాచారం లేదు. బడ్జెట్ రాగానే పూర్తిగా వేతనాలు చెల్లిస్తాం. ఉద్యోగులు ఆందోళన చెందవద్దని సూచించారు.

వేతనాలు వెంటనే చెల్లించాలి : రచ్చ రవీందర్



ఐదు నెలలుగా వేతనాలు లేకపోవడంతో పస్తులు ఉద్యోగులు పస్తులు ఉంటున్నారని సంచార ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రచ్చ రవీందర్ తెలిపారు. 104 సర్వీసులను 2008 నుంచి గ్రామీణ పేదలకు సేవలు అందిస్తున్నాం. దీర్ఘకాలిక రోగులు, గర్భిణీలు, బాలింతలు, చిన్నపిల్లలకు తగిన వైద్య పరీక్షలు నిర్వహించి నెలకు సరిపడా మందులు ఇస్తున్నాం. కానీ గత కొంతకాలంగా 104 సర్వీసులు కనుమరుగవుతున్నాయి. సేవలపై అధికారుల చిన్న చూపు, సకాలంలో బడ్జెట్ విడుదల చేయ కపోవడం, సరిపడా మందులు అందుబాటులో ఉంచడంలేదు. పదేండ్ల క్రితం కొనుగోలు చేసిన వాహనాలు కావడంతో ఫిట్‌నెస్ తగ్గుతున్నదని, దీంతో అనేక వాహనాలు వివిధ రిపేర్లతో నిలిచిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి సమస్య లపై ప్రభుత్వానికి పలుమార్లు తెలియ జేసినా ఫలితంలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వేతనాలు చెల్లించి, కొత్త వాహనాలు కొనుగోలు చేయాలని సూచించారు.

ఉపాధ్యాయులకు ఇక పదోన్నతులే...

- సర్వీసు నిబంధనల అమలుకు కసరత్తు
- న్యాయ శాఖతో విద్యాశాఖ అధికారుల సంప్రదింపులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



రాష్ట్రంలో ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీసు నిబంధనల అమలుపై పాఠశాల విద్యాశాఖ అధికారులు కసరత్తు ప్రారంభించారు. ఏకీకృత సర్వీసు నిబంధనల అమలును హైకోర్టు కొట్టివేసిన విషయం తెలిసిందే. హైకోర్టు తీర్పును సుప్రీం కోర్టు నిలుపుదల చేసింది. దీంతో ఏకీకృత సర్వీసు నిబంధనల అమలుపై ఉన్న అడ్డంకి తొలగిపోయింది. సుప్రీం ఆదేశాలతో రాష్ట్రంలో ఉపాధ్యాయులకు ఇక పదోన్న తులు లభించనున్నాయి. సుప్రీం కోర్టు స్టే విధించడంతో పాఠశాల విద్యాశాఖ అధికారులు ఏం చేయాలనే దానిపై సమాలోచన చేస్తున్నారు. న్యాయ శాఖ అధికారులతో సంప్రదింపులు చేస్తున్నారు. భవిష్యత్తులో న్యాయపరమైన చిక్కులు తలెత్తకుండా ఉండేందుకు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. వచ్చేనెల 25న ఇదే కేసుపై సుప్రీం కోర్టులో విచారణ ఉన్నది. తుది తీర్పు వచ్చే వరకు ఆగాలా?, లేక ప్రస్తుతం పరిణామాలకు అనుగుణంగా ప్రభుత్వ, పంచాయతీరాజ్ ఉపాధ్యాయులకు పదోన్నతులు ఇవ్వాలా?అన్న అంశంపై విద్యాశాఖ అధికారులు సమాలోచన చేస్తున్నారు. ఉపాధ్యాయులకు గెజిటెడ్ హెడ్మాస్టర్, ఎంఈవో, డిప్యూటీ ఈవో, డైట్ లెక్చరర్లు, జూనియర్ లెక్చరర్లు, స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు లభించనున్న విషయం తెలిసిందే. ప్రభుత్వం తోనూ విద్యాశాఖ అధికారులు సంప్రదింపులు చేస్తున్నారు. న్యాయ శాఖ నుంచి అనుమతి రాగానే ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావు ఆమోదానికి దస్త్రం వెళ్ల నుంది. ఆ తర్వాత ఏకీకృత సర్వీసు నిబంధనల అమలుకు సంబంధించిన ఉత్తర్వులు వెలువడే అవకాశముంది. ఆ తర్వాత ఉపాధ్యాయులకు పదోన్నతులు లభిస్తాయి.

పదోన్నతులు ఇవ్వాలి : సీఎంకు ఎమ్మెల్సీల వినతి

ఉపాధ్యాయులకు పదోన్నతులు ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావును ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు పాతూరి సుధాకర్‌రెడ్డి, పూల రవీందర్, కె జనార్ధన్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. సర్వీసు నిబంధనలు రూపొందించి డిప్యూటీ ఈవో, ఎంఈవో, జీహెచ్‌ఎం, జేఎల్, డైట్ లెక్చరర్, స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతులు ఇచ్చేందుకు షెడ్యూల్ విడుదల చేయాలని కోరారు.

నేరగాళ్లతో ఖాకీ దోస్తీ..

నేరం జరిగితే దానిపై చట్టపరిధిలో దర్యాప్తు సాగించి, ఆధారాలు సేకరించి, శిక్ష నుంచి తప్పించుకోలేరంటూ నేరస్తుల గుండెల్లో నిద్రపోవలసిన ఖాకీలే చివరికి మిలాఖాత్ అయితే.. తమ శాఖపై ప్రజల్లో మరింత విశ్వసనీయతను పెంచాలనే పోలీసు ఉన్నతాధికారుల లక్ష్యం నెరవేరుతుందా? ఈ అనుమానాలు తాజాగా సంచలనం రేపిన పారిశ్రామికవేత్త జయరాం హత్య కేసులో వ్యక్తం అవుతున్నాయి...

పోలీసు ప్రతిష్టను దిగజారుస్తున్న 'మిలాఖాత్'

- జయరాం హంతకులతో సీఐ, ఏసీపీల జుగల్‌బందీపై తెలుగు రాష్ట్రాల్లో విస్మయం

నవ తెలంగాణ- ప్రత్యేక ప్రతినిధి

ఎన్‌ఆర్‌ఐ పారిశ్రామికవేత్త జయరాం హత్య కేసులో తెలంగాణకు చెందిన ఇద్దరు పోలీసు అధికారులు ఇబ్రహీంపట్నం ఏసీపీ మల్లారెడ్డి, హైదరాబాద్ నల్లకుంట పీఎస్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రావులకు కూడా సంబంధం ఉందని ఏపీలోని కృష్ణా జిల్లా ఎస్పీ సర్వశ్రేష్టి త్రిపాఠి మంగళవారం అధికారికంగా ప్రకటించడం రాష్ట్ర పోలీసు శాఖలో కలకలం రేపింది. దీంతో స్పందించిన రాష్ట్ర పోలీసు ఉన్నతాధికారులు.. సీఐని సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌కు బదిలీ చేసి ఏసీపీని డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశించారు.

రూ.6 కోట్లు ఇవ్వనందుకే..

హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ వ్యాపారంతో పాటు సెటిల్‌మెంట్లు చేసే రాకేష్‌రెడ్డి తనకు ఇవ్వాల్సిన 6 కోట్ల రూపాయలను ఇవ్వనందుకే జయరాంను హత్య చేసినట్టు కృష్ణా జిల్లా నందిగామ జిల్లా పోలీసులు తేల్చారు. గతనెల 30న జయరాంను జూబ్లీహిల్స్‌లోని తన నివాసానికి రాకేష్ అమ్మాయిని ఎరగా వేసి పిలిపించి హత్య చేయడం, తర్వాత ఈ విషయాన్ని సీఐ శ్రీనివాస్‌కు, ఏసీపీ మల్లారెడ్డికి తెలపడం, 31వ తేదీన జయరాం శవాన్ని కారులో నందిగామ పీఎస్ పరిధిలోని జాతీయ రహదారిపై రాత్రి తీసుకెళ్లి కారులోనే వదిలేసి రావడానికి సంబంధించిన పూర్తి ఆధారాలను దర్యాప్తు అధికారులు సేకరించారు. మొత్తానికి నిందితుడు రాకేష్ ఫోన్‌కాల్ డేటాను పరిశీలించిన పోలీసులకు అందులో ఏసీపీ మల్లారెడ్డి, సీఐ శ్రీనివాస్‌ల నెంబర్లు ఉండటం, ఆ సమయంలో వీరితో పలుమార్లు రాకేష్ మాట్లాడినట్టు తేలడంతో ఈ ఇద్దరు ఖాకీ అధికారుల పాత్ర గురించి వెలుగుచూసింది. ఈ సమాచారాన్ని ఏపీ పోలీసు అధికారులు వెంటనే రాష్ట్ర డీజీపీకి చేరవేయడంతో వెంటనే ఈ ఇద్దరు అధికారులకు స్థానచలనం జరిగింది. అంతేగాక హైదరాబాద్ నుంచి విజయవాడకు జయరాం శవాన్ని తరలించి, అక్కడ జాతీయ రహదారిపై యాక్సిడెంట్ సీన్‌ను సృష్టించేలా ఈ ఇద్దరు అధికారులు రాకేష్‌కు ప్లాన్ ఇచ్చారనే అనుమానాలను దర్యాప్తు అధికారులు వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ఏపీలో పరిచయం ఉన్న మరికొందరు పోలీసు అధికారుల సహాయంతో ఈ హత్య కేసు నుంచి బయటపడటానికి నిందితులు ప్రయత్నించారని కూడా భావిస్తున్నారు. నిజానికి జయరాం హత్య గురించి తమకు తెలియగానే ఆ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలిపి, ఇక్కడే కేసు నమోదయ్యేలా చూసి నిందితులను అరెస్టు చేసి ఉంటే రాష్ట్ర పోలీసుల పరువు పక్క రాష్ట్రంలో పోయేది కాదని పలువురు అధికారులు భావిస్తున్నారు.

పెద్ద ఎత్తున డబ్బు చేతులు మారిందా ?

నిందితుడికి వీరిద్దరు సపోర్టు చేయడం వెనుక భారీ ఎత్తున డబ్బుల చేతులు మారి ఉంటాయనే అనుమానాలు దర్యాప్తు అధికారులకు ఉన్నాయి. ఈ నేపథ్యంలో జయరాం హత్య జరగక ముందే రాకేష్ ప్లాన్ గురించి ఈ ఇద్దరు అధికారులకు తెలిసి ఉంటుందా లేక హత్య జరిగాకే వీరితో తనకున్న పరిచయంతో రాకేష్ సహాయాన్ని కోరి ఉంటాడా అనే కోణంలోనూ నందిగామ పోలీసుల దర్యాప్తు సాగుతున్నది. అదే సమయంలో ఘటనా స్థలం జూబ్లీహిల్స్‌లోని రాకేష్ ఇంటి నుంచి విజయవాడకు శవాన్ని



జయరాం హత్య కేసు వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ త్రిపాఠి

తరలించడం వీరిద్దరి సలహాలతో జరిగిందని అనుమానిస్తున్న దర్యాప్తు అధికారులు ఆ కోణంలో వీరిపై కేసులను కూడా నమోదు చేసే అవకాశాలు ఉన్నాయని తెలిసింది.

హత్య సీన్‌ను యాక్సిడెంట్‌గా..!

ముఖ్యంగా ఘటనా స్థలంలో ఆధారాలు ధ్వంసం చేయడం, శవాన్ని ఇక్కడి నుంచి తరలించేలా ప్లాన్ ఇవ్వడం, తర్వాత యాక్సిడెంట్‌గా సీన్‌ను మలచాలనే సూచనలు ఇవ్వడం వంటి కోణాలలో సీఐ, ఏసీపీలపై కేసులు నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని దర్యాప్తు అధికారవర్గాలు చెబుతున్నట్టు తెలిసింది. అంతేగాక సీఆర్‌పీసీలోని సెక్షన్ 41 కింద ఈ ఇద్దరు ఖాకీలకు నోటీసులు జారీ చేసి నందిగామ పీఎస్‌కు పిలిచి విచారించేందుకు అక్కడి అధికారులు సన్నాహాలు చేస్తున్నారని తెలిసింది.

ఈ విషయమై విలేకరుల సమావేశంలో మాట్లాడిన కృష్ణా ఎస్పీ త్రిపాఠి. హత్య చేశాక తాను సీఐ శ్రీనివాస్, ఏసీపీ మల్లారెడ్డిలతో మాట్లాడినట్టు నిందితుడు రాకేష్ విచారణలో తెలిపాడని, ఈ కోణంలో ఇంకా తదుపరి దర్యాప్తు జరుపుతున్నామని తెలిపారు. కాగా జయరాం హత్య కేసులో నిందితుడికి సహకరించారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇద్దరు అధికారులను లూప్ లైన్‌కు బదిలీ చేసిన రాష్ట్ర పోలీసు ఉన్నతాధికారులకు.. తాము ఇంతగా ప్రయత్నిస్తున్నా ఇలాంటి ఘటనలు చోటు చేసుకోవడం పట్ల అసంతృప్తిగా ఉన్నట్టు తెలిసింది. ఎక్కడ ఏం జరిగినా తమకు సమాచారం అందించి నేరస్తులను పట్టుకోవడానికి సహకరించాలని తరచుగా ప్రజలను కోరుతున్న పోలీసు ఉన్నతాధికారులకు ఏకంగా అధికార స్థాయిలోని ఇద్దరు అధికారులు తమకు సమాచారం ఉన్నా చెప్పక పోవడం జీర్ణించుకోలేకపోతున్నారు.

గతంలో నయీమ్ కేసు కలకలం

మూడేండ్ల క్రితం గ్యాంగ్‌స్టర్ నయీమ్ కేసులోను అతనికి సహకరించారనే ఆరోపణలు పలువురు పోలీసు అధికారులపై వచ్చాయి. ఈ దిశగా మొదట్లో విచారణ జరి పి చర్యలు తీసుకోవడానికి వెనుకాడిన ఉన్నతాధికా రులు తర్వాత ఒక అదనపు ఎస్పీ ఇద్దరు ఏసీపీలు, ఒక ఇన్ స్పెక్టర్ మరో ఎస్‌ఐలు నయీమ్‌తో అక్రమంగా అంటకాగా రంటూ సస్పెండ్ చేశారు. కానీ వారిపై ఎలాం టి కేసుల ను నమోదు చేయలేదు. ఆ దశలో మాజీ నక్సలై ట్ అయి న నయీమ్‌కు తాము సహకరించింది మావోయి స్టులను దెబ్బతీయడానికే అని అది కూడా పూర్తిగా తమ ఉన్నతాధి కారుల ఆదేశాలతోటే జరిగిందంటూ అదనపు ఎస్పీ మద్ది పాటి శ్రీనివాస్ బహిరంగ వ్యాఖ్యానాలు చేయడం ఇటు ప్రభుత్వాన్ని అటు పోలీసు ఉన్నతాధికారు లను ఇరకాటంలో పడేసింది.

తర్వాత సస్పెండ్ అయిన ఐదుగురు అధికా రులను తిరిగి విధుల్లోకి తీసుకున్నారు. కానీ ఎందుకు సస్పెండ్ చేశారు, ఎందుకు తిరిగి విధుల్లోకి తీసుకున్నారు, వారిపై వచ్చిన ఆరోపణలు నిరాధారాలా అని బయటికి మాత్రం ఉన్నతాధికారులు చెప్పకపోవడం విశేషం.

సోహ్రాబుద్దీన్ ఎన్‌కౌంటర్ కేసులోనూ..

అలాగే అప్పటి ఉమ్మడి ఏపీలో సోహ్రబుద్దీన్ అతని భార్య, స్నేహితుడిని గుజరాత్ పోలీసులు తీసుకెళ్లి బూటకపు ఎన్‌కౌంటర్‌లో హత్య చేయడం, వారిని హైదరాబాద్ నుంచి మహారాష్ట్రకు వెళ్తుండగా గుజరాత్ ఏటీఎస్ పోలీసులు పట్టుకునేలా సహకరించడంలో కొందరు రాష్ట్ర పోలీసులు సహకరించారనే ఆరోపణలు ఉన్నాయి.

నయీమ్‌తో అంటకాగిన పోలీసు అధికారుల నిగ్గు తేల్చడంలోనూ, సోహ్రబుద్దీన్ ఎన్‌కౌంటర్‌లో పాలుపంచుకున్న రాష్ట్ర పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవడంలోనూ ఉన్నతాధికారులు సరైన చర్యలు తీసుకోలేదనే అనుమానాలు ఇప్పటికి ప్రజల్లో ఉన్నాయి. పీపుల్స్ ఫ్రెండ్లీ పోలీసు వ్యవస్థను పటిష్టం చేయడానికి, పోలీసుల పట్ల ప్రజల్లో మరింతగా విశ్వాసాన్ని పాదుకొల్పడానికి రాష్ట్ర డీజీపీ మహేందర్‌రెడ్డి తీవ్రంగా కృషి చేస్తున్నారు. కానీ తమలోని కొందరు అధికారులు.. నేరస్తులకు స్నేహ హస్తం ఇవ్వడాన్ని ఏ విధంగా నియంత్రిస్తారనే ఆసక్తి పరిశీలకులలో నెలకొని ఉంది.

పారిస్‌లో భారీ అగ్ని ప్రమాదం

10 మంది మృతి, 31 మందికి గాయాలు





పారిస్: ఫ్రాన్స్ రాజధాని పారిస్‌లో భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో 8 మంది మృతిచెందగా, మరో 31 మంది తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశముంది. స్థానిక అధికారులు తెలిపిన వివరాల ప్రకారం...16వ అరోన్‌డీ సెమెంట్‌లోని ఎర్లాంగర్ ప్రాంతంలోని ఓ 8 అంతస్తుల భవనంలో మంటలు చెలరేగాయి. దీంతో, భవనంలోని 10 మంది మృతి చెందారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక బృందాలు ఘటనాస్థలికి చేరుకొని మంటలను ఆర్పేందుకు ప్రయత్నిస్తున్నారు. సహాయక చర్యల్లో పాల్గొన్న ఆరుగురు అగ్నిమాపక సిబ్బంది సహా 31 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఘటనాస్థలంలో మంటలు ఎగిసిపడుతున్నాయని అన్నారు. మంటల్లో చిక్కుకున్న వారిని రక్షించేందుకు సిబ్బంది ప్రయత్నిస్తున్నారు. ప్రయత్నం చేశారు. దాదాపు 200 మంది అగ్నిమాపక సిబ్బంది సహాయకచర్యల్లో పాల్గొన్నారు. 7, 8వ అంతస్తులో మంటలు ఇంకా చెలరేగుతున్నాయి. మంటల తాకిడి ఎక్కువగా ఉండటంతో పక్కనే ఉన్న భవనాలను కూడా అధికారులు ఖాళీ చేయించారు. ఈ ఘటనపై ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయేల్ మాక్రన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. సహాయక చర్యలు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. బాధిత కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.

పారిస్‌లో అగ్ని ప్రమాదం కేసులో ఓ అనుమానిత మహిళను అదుపులోకి తీసుకున్నట్టు ప్రాసిక్యూటర్ రెమీ హీట్జ్ తెలిపారు. ఘటనాస్థలంలో సహాయక చర్యలను ముమ్మరం చేసినట్టు అగ్నిమాపక సేవల అధికారి క్లెమెంట్ కాగ్‌నన్ తెలిపారు. కాగా, గతనెలలో పారిస్‌లోని ఓ బేకరీలో అగ్ని ప్రమాదం సంభవించింది. ఈఘటనలో నలుగురు మృతిచెందారు.

బ్రిటన్‌లో అగ్ని ప్రమాదం

- నలుగురు చిన్నారులు మృతి

లండన్ : బ్రిటన్‌లోని స్టఫోర్ట్ నగరంలో ఓ ఇంట్లో అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో నలుగురు చిన్నారులు మృతిచెందగా, తల్లిదండ్రులు గాయపడ్డారు. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు. ప్రమాదం జరిగిన సమయంలో చిన్నారులు నిద్రిస్తుండటంతో ప్రాణాపాయ స్థితి నుంచి తప్పించుకోలేకపోయారని పోలీస్ అధికారులు తెలిపారు. మంటలు దట్టంగా వ్యాపించడంతో చిన్నారులు చనిపోయినట్టు ప్రాథమిక విచారణలో వెల్లడైంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక బృందాలు ఘటనాస్థలికి చేరుకొని మంటలను ఆర్పేందుకు ప్రయత్నిస్తున్నాయి.

శాంతి చర్చలకు విఘాతం

- తాలిబన్ల మెరుపుదాడుల్లో 21 మంది మృతి

కాబూల్ : అఫ్ఘాన్ నేతలకు, తాలిబన్లకు మధ్య జరుగుతున్న శాంతి చర్చలు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. శాంతి చర్చలు కొనసాగుతుండగానే తాలిబన్లు జంట పేలుళ్లకు పాల్పడ్డారు. అఫ్ఘనిస్తాన్‌లోని బగ్లాన్ ప్రావిన్స్‌లోని పోలీస్ చెక్‌పాయింట్‌తో పాటు మరో రద్దీ ప్రాంతాన్ని లక్ష్యంగా చేసుకొని మెరుపుదాడులకు పాల్పడ్డారు. ఈ దాడుల్లో 21మంది మృతి చెందారు. మృతుల్లో 11 మంది పోలీసులు ఉన్నారు. మరికొందరు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అఫ్ఘాన్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం....రష్యా రాజధాని మాస్కోలో అఫ్ఘనిస్తాన్ మాజీ అధ్యక్షుడు హమీద్ కర్జాయ్, ప్రతిపక్ష నేతలు, గిరిజన నేతలు తాలిబన్ కమాండర్లతో భేటీ అయ్యారు. వీరంతా అఫ్ఘాన్‌లో శాంతి స్థాపన అంశంపై సుదీర్ఘ మంతనాలు జరిపారు. అయితే, ఈచర్చలకు అఫ్ఘాన్ కీలక అధికారులెవరూ హాజరు కాలేదు. తాలిబన్లు తమ డిమాండ్లను ప్రకటించే అవకాశం లభించలేదు. దీంతో,ఆగ్రహానికి గురైన తాలిబన్లు చర్చలు కొనసాగుతుండగానే వైదొలిగారు. ఓ పక్క చర్చలు జరుగుతుండగానే బగ్లాన్ ప్రావిన్స్‌లో రెండు వేర్వేరు చోట్ల దాడులకు పాల్పడ్డారు. ఈ దాడుల్లో 21 మంది మృతిచెందారు. అనంతరం తాలిబన్లు చెక్‌పాయింట్‌లోకి చొరబడి తుపాకులు, మందుగుండు సామాగ్రీ ఎత్తుకెళ్లారు. ఇదిలా ఉండగా, తాలిబన్లతో చర్చలు జరిపేందుకు అఫ్ఘాన్ అధ్యక్షుడు అష్రఫ్ ఘనీ సుముఖంగా లేరనే విమర్శలు వినిపిస్తున్నాయి. తాలిబన్లు, అఫ్ఘాన్ నేతల మధ్య జరుగుతున్న చర్చలకు కీలక అధికారులెవరూ హాజరు కాకపోవడంతో శాంతి చర్చలు విఫలమయ్యాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఆస్ట్రేలియాలో వరదలు

- రోడ్లపైకి మొసళ్ల సంచారంతో ఇబ్బందులు

సిడ్నీ : ఆస్ట్రేలియాలో వరదలు పోటెత్తాయి. దాదాపు 8రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. గత వందేండ్లలో ఎప్పుడు లేని విధంగా ఇక్కడ వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. దీనికి తోడు మొసళ్ల బీభత్సం భయభ్రాంతులకు గురిచేస్తోంది. ముఖ్యంగా టౌన్స్‌విల్లేలో వరదలతో పాటు ఒడ్డుకు చేరుతున్న సముద్ర మొసళ్లు, కొండచరియలు విరిగిపడి కరెంటు కోతలతో ప్రజలు అల్లాడుతున్నారు. దీంతో అధికారులు ప్రజలకు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. నీటి అడుగున అక్కడక్కడ మొసళ్లు, వాటితో పాటు పాములు, ఇంకా ఇతర హానికారక జీవులు ఉండొచ్చనే ఉద్దేశ్యంతో ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. వారి సహాయార్థం అత్యవసర సేవల సిబ్బంది విరామం లేకుండా సేవలందిస్తున్నారు. ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడానికి ప్రభుత్వం ఆర్మీ సేవలను తీసుకుంటుంది. ముందు జాగ్రత్తగా స్కూళ్లకు సెలవులు ప్రకటించారు. ఎయిర్‌పోర్టులు మూసివేశారు. వర్షాల కారణంగా 20వేల మంది నిరాశ్రయులయ్యారు. బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించడంలో ఆర్మీ, అధికారులు నిమగ్నమయ్యారు.

మా పొలాన్ని మాకిప్పించండి..

ఐదేండ్లుగా తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణాలు


- సమస్య పరిష్కరించని అధికారులు
- విసిగిపోయి దీక్షకు దిగిన రైతు దంపతులు



నవతెలంగాణ - గట్టు

'అనుమతి లేకుండా మా పొలాన్ని వేరే వారి పేరిట చేశారు. మా భూమి మాకిప్పించి న్యాయం చేయాలి' అని జోగులాంబ గద్వాల జిల్లా గట్టు మండలానికి చెందిన రైతు దేవేంద్రప్ప దంపతులు మంగళ వారం తహసీల్దార్ కార్యా లయం ఎదుట దీక్షకు దిగారు. ఐదేండ్లుగా కార్యాలయం చుట్టూ తిరిగినా అధికారులు పట్టించుకోలేదని వాపోయారు. ఈ సందర్భంగా దేవేంద్రప్ప మాట్లాడుతూ.. మాచర్ల గ్రామానికి చెందిన తాము 246 సర్వే నెంబరులో తమకున్న రెండెకరాల 23 గుంటల పొలాన్ని సాగు చేసుకుంటూ బతుకుతున్నామని చెప్పారు. ఇప్పటికీ ఆ పొలమే తమకు జీవనాధారమన్నారు. తమకు తెలియకుండా ఆ భూమి 2013లో తన వదిన పేరిట మార్పిడి జరిగిందని చెప్పారు. తమ అనుమతి లేకుండా భూమి వారి పేరు మీదకు ఎలా మారిందనే విషయమై ఐదేండ్లుగా తహసీల్దార్, ఇతర అధికారుల చుట్టూ తిరిగినా పట్టించు కోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా తమ భూమి ఇప్పించాలని బాధిత రైతు విన్నవించాడు. దీనిపై తహసీల్దార్ నాగేం దర్‌ను 'నవతెలంగాణ' వివరణ కోరగా, 2013లో రఘోత్తం అనే తహసీల్దార్ పని చేశారనీ, తనకు ఈ విషయం తెలియదనీ అన్నారు. వివరాల కోసం ఆర్డీఓను సంప్రదించాలని సూచించారు. మాచర్ల గ్రామానికి వెళ్లి విచారణ చేయాలని ఆర్ఐ, వీఆర్ఓను ఆదేశించినట్టు చెప్పారు.


మీ అంచనాలను అందుకోలేకపోయాం


రామ్‌చరణ్

'ప్రేక్షకులకు, అభిమానులకు వినోదాన్ని అందించే సినిమా అందించడానికి మేమంతా ఎంతో శ్రమించాం. కానీ దురదృష్టవశాత్తు మంచి సినిమాని అందించలేక మీ అంచనాలను అందు కోలేకపోయాం' అని రామ్ చరణ్ అన్నారు. ఆయన ఇటీవల 'వినయవిధేయ రామ' చిత్రంలో నటించిన విషయం విదితమే. బోయపాటి శ్రీను దర్శకత్వంలో డి.వి.వి. దానయ్య నిర్మించిన చిత్రమిది. సంక్రాంతి కానుకగా విడుదలై ఘోర పరాజయం చెందింది. ఈ నేపథ్యంలో ఫెయిల్యూర్‌పై రామ్‌చరణ్ స్పందించారు. అభిమానులు, ప్రేక్షకులను ఉద్దేశించి మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు.
'నా పట్ల, నా సినిమాల పట్ల మీరు చూపించిన ప్రేమాభిమానాలకి వినమ్ర పూర్వక ధన్యవాదాలు. 'వినయ విధేయ రామ' సినిమా కోసం రేయింబవళ్లు కష్టించిన సాంకేతిక నిపుణులు అందరికీ నా ధన్యవాదాలు. నిర్మాత దానయ్య అందించిన సహకారం మాటల్లో వర్ణించలేనిది. మా చిత్రాన్ని నమ్మిన పంపిణీదారులు, ప్రదర్శన దారులకు కృతజ్ఞుడినై ఉంటా. మా విషయంలో మీ అంచనాలను అందుకోలేకపోయాం. అయినప్పటికీ మీరు చూపించే ఈ ఆదరణ, అభిమానాన్ని ప్రేరణగా తీసుకుని భవిష్యత్‌లో మీకు నచ్చే, మీరు మెచ్చే సినిమాలు చేయడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తాను. అన్ని వేళల తమ మద్దతు అందించిన మీడియా మిత్రులకి ప్రత్యేక ధన్యవాదాలు. మీరు ఎల్లప్పుడు చూపించే ఈ ప్రేమ, అభిమానానికి థ్యాంక్స్' అని రామ్‌చరణ్ పేర్కొన్నారు.

నవచిత్రం

ఇసుక మాఫియా నేపథ్య సినిమా!


షారూఖ్‌ఖాన్, మధూర్ భండార్కర్

పలు జాతీయ అవార్డు చిత్రాలతో బాలీవుడ్‌లో అగ్ర దర్శకుడిగా రాణిస్తున్నారు మధూర్ భండార్కర్. తాజాగా ఆయన షారూఖ్ ఖాన్ హీరోగా ఓ సినిమా తెరకెక్కించేందుకు ప్లాన్ చేస్తున్నారు. దీనికి 'ఇన్‌స్పెక్టర్ గలీబ్' అనే టైటిల్ నిర్ణయించారు. ఉత్తర ప్రదేశ్‌లో చోటు చేసుకున్న యదార్థ సంఘటనల ఆధారంగా ఇసుక మాఫియా నేపథ్యంలో ఈ సినిమాని రూపొందించేందుకు మధూర్ ప్లాన్ చేస్తున్నారు. యదార్థ సంఘటనలకి తనదైన శైలిలో కమర్షియల్ ట్రీట్‌మెంట్ ఇచ్చి భారీ స్థాయిలో తెరకెక్కించాలనుకుంటున్నారు. దీనికి షారూఖ్ వంటి స్టార్ హీరో తోడైతే సినిమా మరో స్థాయికి చేరుతుందని దర్శకుడి ఆలోచన. దీనిపై షారూఖ్‌తో చర్చించగా, ఆయన కూడా సానుకూలంగా స్పందించారట. షారూఖ్ ప్రస్తుతం భారతీయ వ్యోమగామి రాకేష్ శర్మ బయోపిక్‌లో నటించేందుకు సన్నద్ధమవుతున్నారు.

నేటితరం ప్రేమ కథ 4 లెటర్స్


దొమ్మరాజు ఉదయ్‌కుమార్, వెంకటేష్, ఈశ్వర్ తదితరులు

ఈశ్వర్, టువ చక్రవర్తి, అంకిత మహారాణా హీరోహీరోయిన్లుగా ఆర్.రఘురాజ్ దర్శకత్వంలో ఓం శ్రీ చక్ర క్రియేషన్స్ పతాకంపై దొమ్మరాజు హేమలత, దొమ్మరాజు ఉదయ్ కుమార్ సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం '4లెటర్స్'. ఈ చిత్రం ఈ నెల 22న విడుదల కానుంది. హీరో వెంకటేష్ ఈ చిత్ర టీజర్, ట్రైలర్‌ని చూసి హీరోహీరోయిన్లు, దర్శక, నిర్మాతలని అభినందించారు. అలాగే సినిమా హిట్ కావాలని ఆకాంక్షించారు.
ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ, 'మా సినిమా టీజర్‌ని దర్శకేంద్రుడు కె.రాఘవేంద్రరావు విడుదల చేయడం ఆనందంగా ఉంది. హీరోగా పరిచయం అవుతున్న ఈశ్వర్ సత్యానంద్ వద్ద శిక్షణ తీసుకుని ఎంతో హార్డ్ వర్క్ చేసి నటించాడు. కొత్తవాడైనా అనుభవం కలిగిన నటుడిలా యాక్ట్ చేశాడు. కమర్షియల్ హంగులతో యూత్ సహా అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేలా వినోదాత్మకంగా సినిమా సాగుతుంది' అని అన్నారు. 'నేటి తరం ప్రేమ కథా చిత్రమిది. అందుకే 'కుర్రాళ్ళకి అర్థమవుతుందిలే' అనే ఉపశీర్షిక పెట్టాం. ప్రేమ, పెళ్ళి విషయాలలో ఇప్పటి యువత ఆలోచనలు, అభిప్రాయాలు, వాస్తవాలు ఏంటన్నది వాస్తవానికి అతి దగ్గరగా ఉండేలా చిత్రీకరించాం. కథ, కథనం, మాటలు అన్ని వర్గాలని ఆకట్టుకునేలా సాగటంతోపాటు ఆలోచన రేకెత్తించేలా ఉంటాయి. హీరో ఈశ్వర్ చక్కగా నటించాడు. తనకి మంచి భవిష్యత్ ఉంటుంది. నిర్మాతలు రాజీపడకుండా మంచి క్వాలిటీతో తెరకెక్కించారు. సినిమాని ఆదరించాలని కోరుతున్నాం' అని దర్శకుడు తెలిపారు. 'విక్టరీ వెంకటేష్ ఆశీస్సులు అందుకోవడం ఆనందంగా ఉంది. సినిమా ఆడియెన్స్‌కి నచ్చుతుందని భావిస్తున్నాం' అని హీరో ఈశ్వర్ తెలిపారు.

హుషారుగా 50 రోజుల వేడుక


'హుషారు' చిత్ర అర్ధశత దినోత్సవ వేడుక దృశ్యం

'ఈ రోజుల్లో సినిమా ఆడటమే కష్టంగా ఉంది. కానీ 'హుషారు' విజయవంతంగా యాభై రోజులు పూర్తి చేసుకోవడం అరుదైన విషయం' అని దిల్‌రాజు అన్నారు. తేజస్ కంచర్ల, తేజ్ కూరపాటి, అభినవ్ మంచు, దినేష్ తేజ్, దక్ష నగార్కర్, ప్రియా వడ్లమాని, హేమ ఇంగ్లే హీరోహీరోయిన్లుగా శ్రీ హర్ష కొనుగంటి దర్శకత్వంలో బెక్కెం వేణుగోపాల్ నిర్మించిన చిత్రం 'హుషారు'. ఈ చిత్రం విడుదలై 50 రోజులు పూర్తి చేసుకుంది.
ఈ సందర్భంగా సోమవారం యాభై రోజుల వేడుకని నిర్వహించారు. అతిథిగా విచ్చేసిన నిర్మాత దిల్‌రాజు చిత్ర బృందానికి షీల్డ్‌లను అందించారు. ఆయన మాట్లాడుతూ, 'ఫస్ట్ సాంగ్ రిలీజ్ రోజునే సినిమా బాగా ఉందని, బాగా ఆడుతుందని చెప్పా. అదే నిజమైంది' అని అన్నారు. 'సినిమా ఇంత పెద్ద హిట్ అవుతుందని ఊహించలేదు. హార్డ్ వర్క్‌కి మంచి పేరు వస్తుందనడానికి మా సినిమానే కారణం. సినిమా కోసం టీమ్ అంతా ఏడాదిన్నరగా కష్టపడ్డాం. నాక్కూడా గొప్ప ఎక్స్‌పీరియన్స్. దర్శకుడు శ్రీ హర్ష చాలా ఓపికగా, రాజీపడకుండా తెరకెక్కించాడు. ఈ సక్సెస్‌కి కారణమైన ప్రతి ఒక్కరికి థ్యాంక్స్' అని నిర్మాత బెక్కెం వేణుగోపాల్ తెలిపారు. దర్శకుడు శ్రీహర్ష చెబుతూ, 'నా జీవితంలో సినిమాకి పనిచేసిన ప్రతి రోజూ బెస్ట్ మెమొరీ. ఆడియెన్స్ సినిమాని రిపీటెడ్‌గా చూసి పెద్ద హిట్ చేశారు' అని చెప్పారు.
'వేణుగోపాల్ వద్ద అసిస్టెంట్‌గా పనిచేశాను. సినిమాలో నాపై నమ్మకంతో యాక్టర్‌ని చేశారు. ఆయనకి థ్యాంక్స్' అని హీరో తేజ్ కూరపాటి చెప్పారు. 'మా చిన్న సినిమా యాభై రోజులు ఆడటం గొప్ప విషయం' అని ప్రియా వడ్లమాని తెలిపారు. ఈ కార్యక్రమంలో దినేష్, తేజస్ కంచర్ల, దక్ష నగార్కర్ తదితరులు పాల్గొని తమ ఆనందాన్ని పంచుకున్నారు.

సినీ కార్మికులందరికీ ఆరోగ్య బీమా


కాదంబరి కిరణ్, దశరథ్, రామ్మోహనరావు, శ్వేతా లక్ష్మారెడ్డి, దీప్తి వాజ్‌పేయి

'కాదంబరి కిరణ్ మనంసైతం ద్వారా పేదలను ఆదుకోవడమే కాదు, ఆత్మీయతనూ పంచుతున్నారు. అవసరం ఉన్న వాళ్ళ ఇంటికి వెళ్ళి మరీ ఆదుకుంటున్నారు' అని తెలంగాణ ఎఫ్‌డీసీ ఛైర్మెన్ రామ్మోహన్‌రావు అన్నారు. 'మనంసైతం' ద్వారా నటుడు కాదంబరి కిరణ్ పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న విషయం విదితమే. సోమవారం మరో పది మందికి ఆర్థిక సాయం చేశారు.
అందులో ఆరోగ్య అవసరాల రీత్యా ఈశ్వరమ్మకి, కో డైరెక్టర్ ఉమా మహేశ్వరరావుకి, ప్రొడక్షన్ మెనేజర్ బత్తుల హరిబాబుకి, సినీ మేనేజర్ ఆర్ మురళీ కృష్ణకు 25వేలు, హెయిర్ డ్రెస్సర్ పి.జయకి 20వేల చొప్పున, విద్య అవసరాల రీత్యా బీఎన్ రేఖకి 20వేలు, లైట్‌మెన్ వేణుగోపాల్‌కి 10వేలు, క్రీడల కోసం చల్లా పవన్ కుమార్‌కి 25వేల రూపాయల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా రామ్మోహన్‌రావు మాట్లాడుతూ, 'చిత్ర పరిశ్రమలో కొన్ని విభాగాల కార్మికులకి ఆరోగ్య బీమా సౌకర్యం లేదు. వారికి తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నుంచి సగం ఖర్చు మినహాయింపుతో ఆరోగ్య బీమా అందజేస్తున్నాం. చిత్రపురి కాలనీలో ఒక వైద్యశాల నిర్మించే ప్రయత్నం చేస్తున్నాం' అని అన్నారు. 'మనంసైతం కార్యక్రమానికి వచ్చాక మానవత్వం ఇంకా మిగిలి ఉందనిపిస్తోంది' అని మాజీ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి లక్ష్మారెడ్డి సతీమణి శ్వేతా లక్ష్మారెడ్డి చెప్పారు.


కాజల్

నయా క్రైమ్ థ్రిల్లర్ అంజలి సీబీఐ


నయనతార

నయనతార తమిళంలో నటించిన హిట్ చిత్రం 'అమైక్క నోడిగల్'. ఆర్. అజయ్ జ్ఞానముత్తు దర్శకత్వం వహించారు. ఈ చిత్రాన్ని 'అంజలి సీబీఐ' పేరుతో విశ్వశాంతి క్రియేషన్స్ పతాకంపై సీహెచ్ రాంబాబు, ఆచంట గోపీనాథ్ సంయుక్తంగా తెలుగులో విడుదల చేయబోతున్నారు. ఈ సందర్భంగా చిత్ర బృందం తెలియజేస్తూ, 'లేడీ సూపర్ స్టార్ నయనతార నటించిన బ్లాక్ బస్టర్ చిత్రమిది. క్రైమ్ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ సినిమాలో నయనతార సీబీఐ ఆఫీసర్‌గా నటించారు. అథర్వ, రాశీఖన్నా ప్రధాన పాత్రలు పోషించారు. అనురాగ్ కశ్యప్ నెగటివ్ రోల్ పోషించారు. మరో హీరో విజయ్ సేతుపతి నయనతార భర్త విక్రమాదిత్యగా అతిథి పాత్రలో నటించారు. క్యామియో ఫిల్మ్స్ పతాకంపై సీజే జయకుమార్ నిర్మించిన ఈ సినిమాని తెలుగులో విడుదల చేయడం ఆనందంగా ఉంది. ప్రస్తుతం అనువాద కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈ నెల 22న సినిమాని విడుదల చేస్తాం' అని తెలిపింది.
ఈ చిత్రానికి సంగీతం: హిప్ హాప్ తమిళన్, సినిమాటోగ్రఫీ: ఆర్ డి రాజశేఖర్, ఎడిటర్: భువన్ శ్రీనివాసన్.

అందుకే ఒరిజినల్ సినిమా చూడలేదు

"పారిస్ పారిస్' చిత్రాన్ని చాలా రియలిస్టిక్‌గా, నిజాయితీగా తీశాం. మాతృక 'క్వీన్'కి, దీనికి పోలికే ఉండదు' అని కాజల్ తెలిపింది. కంగనా రనౌత్ నటించిన 'క్వీన్' సినిమాని తెలుగు, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో రీమేక్ చేస్తున్న విషయం విదితమే. 'పారిస్ పారిస్'గా తమిళంలో రూపొందుతున్న సినిమాలో కాజల్ మెయిన్ లీడ్‌గా నటించింది. ఈ సినిమా విడుదలకు సిద్ధమవుతున్న సందర్భంగా కాజల్ మాట్లాడుతూ, 'ఒరిజినల్ చిత్రంతో పోలిక లేకుండా నేటివిటీకి తగ్గట్టుగా, చాలా నిజాయితీగా సినిమాని తెరకెక్కించాం. నేను ప్రతి సినిమా షూటింగ్ టైమ్‌లో నా పాత్రకి సంబంధించి ముందస్తుగా ప్రిపేర్ అవుతాను. అలాగే ఈ సినిమాకి కూడా ప్రిపేర్ అయ్యాను. నా పాత్రని ఎలా అడాప్ట్ చేసుకోవాలనే అంశంలో దర్శకుడితో చర్చించాను. దానికి తగ్గట్టుగా ప్రిపేర్ అయ్యా. రీమేక్ అనుకున్నప్పుడు ఒరిజినల్ సినిమాని చూడలేదు. ఎందుకంటే కంగనా నటనా ప్రభావం నాపై పడే అవకాశం ఉంది. ఆ ప్రభావం పడితే నా మైండ్‌లోనుంచి ఆమెని తీసేయడం పెద్ద ఛాలెంజింగ్‌తో కూడిన అంశం' అని తెలిపింది. ప్రస్తుతం కాజల్ 'సీత', 'కోమలి', 'ఇండియన్ 2'తోపాటు రవితేజ సరసన ఓ సినిమా, సుధీర్ వర్మ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమాలో నటించేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది.

టైగర్ జిందా హై రీమేక్‌లో..!


గోపీచంద్, తమన్నా

ఏ భాషలోనైనా రీమేక్‌లు కొత్త కాదు. భారీ విజయాలు సాధించిన చిత్రాలను రీమేక్ చేయడం అన్ని భాషల్లోనూ జరుగుతుంటుంది. ప్రస్తుతం 'క్వీన్', '96' చిత్రాలు తెలుగులో రీమేక్ అవుతున్నాయి. తాజాగా బాలీవుడ్ బ్లాక్‌బస్టర్ 'టైగర్ జిందా హై' సైతం తెలుగులోకి రీమేక్ కాబోతోందని సమాచారం. గోపీచంద్ ఈ రీమేక్‌పై మరింత ఆసక్తి చూపుతున్నారట. ఇందులో గోపీచంద్, తమన్నా జంటగా నటించనున్నట్టు తెలుస్తోంది. సల్మాన్ ఖాన్, కత్రినా కైఫ్ జంటగా అలీ అబ్బాస్ జాఫర్ దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కిన విషయం విదితమే. స్పై నేపథ్యంలో యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రం తెరకెక్కింది. తాజా రీమేక్‌లో సల్మాన్ పాత్రలో గోపీచంద్, కత్రినాగా తమన్నా నటించనున్నారట. ఇదిలా ఉంటే, గోపీచంద్ ప్రస్తుతం తిరు దర్శకత్వంలో ఓ సినిమాలో నటిస్తున్నారు. ఇటీవలే ఈ సినిమా ప్రారంభమైంది. ఇందులో కూడా కథానాయికగా తమన్నా పేరు వినిపించడం విశేషం. మరి ఈ సినిమానే 'టైగర్ జిందా హై' రీమేకా లేక రీమేక్‌గా మరో చిత్రం ఉంటుందా? అనేది మాత్రం ప్రస్తుతానికి సస్పెన్స్‌గా ఉంది. తమన్నా ప్రస్తుతం తెలుగులో నరసింహారెడ్డి', 'దట్ ఈజ్ మహాలక్ష్మి', 'దేవి 2' చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉంది.

అందరిలా నేనెప్పుడూ చెప్పను


కైరా అద్వానీ

'అందరిలా నేను కూడా షాహిద్ కపూర్ సినిమాలను చూస్తూ పెరిగానని చెప్పను. ఎందుకంటే ఆయన పెద్ద వయస్కుడేమీ కాదు. కానీ 'కబీర్ సింగ్'లో ఆయనలా మరెవ్వరూ చేయలేరు' అని అంటోంది కైరా అద్వానీ. షాహిద్ కపూర్, కైరా అద్వానీ కలిసి నటిస్తున్న చిత్రం 'కబీర్ సింగ్'. తెలుగులో వచ్చిన 'అర్జున్‌రెడ్డి' చిత్రానికిది రీమేక్. తెలుగు చిత్రానికి దర్శకత్వం వహించిన సందీప్‌రెడ్డి ఈ చిత్రానికి కూడా దర్శకత్వం వహిస్తున్నారు. చిత్రీకరణ చివరి దశకు చేరుకుంది. ఈ సందర్భంగా కైరా మాట్లాడుతూ, 'షూటింగ్ ప్రారంభానికి ముందు 'అర్జున్‌రెడ్డి'లో కొన్ని సీన్లు చూసి మధ్యలోనే ఆపేశా. ఆ ప్రభావం నాపై ఉండకూడదని. ఇందులో షాహిద్‌తో నటించడం గొప్ప అనుభవం. ఆయనలా ఈ పాత్రలో మరెవ్వరూ చేయలేరని ఓ షెడ్యూల్ జరిగాక అర్థమైంది. తన నటనతో ప్రేక్షకుల్ని సర్‌ప్రైజ్ చేస్తారు. ఇందులో నేనెక్కువగా డీ గ్లామర్‌గా కనిపిస్తాను. కొన్ని సన్నివేశాలు అత్యంత సహజంగా ఉంటాయి. రియల్ లైఫ్‌లోనూ ఎక్కువగా మిర్రర్ వద్ద కూర్చోను' అని తెలిపింది. దీంతోపాటు కైరా 'గుడ్‌న్యూస్' చిత్రంలోనూ నటిస్తోంది. అక్షయ్ కుమార్, కరీనా కపూర్, దిల్జిత్ దోసాంజే ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. 'అక్షయ్ కుమార్ సినిమా 'ఫగ్లీ'తోనే నా సినీ ఎంట్రీ ప్రారంభమైంది. ఇప్పుడు ఆయనతో కలిసి మళ్ళీ పని చేయడం చాలా హ్యాపీగా ఉంది. అక్షయ్, కరీనా జోడీకి భిన్నంగా దిల్జిత్, నా పెయిర్ ఉంటుంది. ఈ షూటింగ్‌ని చాలా బాగా ఎంజాయ్ చేస్తున్నాను' అని కైరా తెలిపింది. 'కళంక్' చిత్రంలోని ఓ ప్రత్యేక పాటలోనూ కైరా మెరవబోతోంది.

హృతిక్ ప్లేస్‌లో సల్మాన్..!


సల్మాన్‌ఖాన్

హృతిక్ రోషన్ ప్రస్తుతం 'సూపర్ 30'లో నటిస్తున్నారు. ఆ తర్వాత ప్రముఖ దర్శకుడు డేవిడ్ ధావన్ తనయుడు రోహిత్ ధావన్ దర్శకత్వంలో ఓ సూపర్ హీరో సినిమా చేసేందుకు సిద్ధమయ్యారు. కానీ ఇప్పుడా ప్లేస్‌లోకి సల్మాన్‌ఖాన్ ఎంటరయ్యాడని సమాచారం. రోహిత్ ధావన్ ఈ స్క్రిప్ట్‌ని సల్మాన్‌కి వినిపించగా, కథ నచ్చి నటించేందుకు పచ్చ జెండా ఊపారట. డేవిడ్ ధావన్‌కి, సల్మాన్‌కి మంచి అనుబంధం ఉంది. ఈ నేపథ్యంలో ఈ చిత్రంలో సల్మాన్ నటించే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ప్రస్తుతం సల్మాన్ 'భారత్' చిత్రంలో నటిస్తున్నారు. కత్రినా కైఫ్, దిశా పటానీ కథానాయికలుగా నటిస్తున్న ఈ చిత్రానికి అలీ అబ్బాస్ జాఫర్ దర్శకత్వం వహిస్తున్నారు. అలాగే త్వరలో 'దబాంగ్ 3'లోనూ నటించబోతున్నారు. ప్రభుదేవా దర్శకత్వం వహించే ఈ చిత్రంలో సోనాక్షి సిన్హా కథానాయిక. హృతిక్ నటిస్తున్న 'సూపర్ 30' జులై 26న విడుదల కానుంది.

దోస్తానా సీక్వెల్‌కి పచ్చజెండా..!


అలియాభట్

అలియా భట్ కమర్షియల్ సినిమాలతోపాటు నటనకి స్కోప్ ఉన్న భిన్నమైన పాత్రలు పోషిస్తూ కెరీర్‌ని బ్యాలెన్స్ చేస్తుంది. ముఖ్యంగా ప్రేమ కథా చిత్రాల్లో, సంఘర్షణతో కూడిన పాత్రల్లో నటించి మెప్పించింది. ప్రస్తుతం పలు భారీ చిత్రాల్లో భాగమైంది. ఈ నేపథ్యంలో ఆమె మరో సూపర్ హిట్ సీక్వెల్‌లో నటించబోతున్నట్టు తెలుస్తుంది. కరణ్‌జోహార్ రూపొందించిన విజయవంతమైన రొమాంటిక్ కామెడీ 'దోస్తానా'. జాన్ అబ్రహం, అభిషేక్ బచ్చన్, ప్రియాంక చోప్రా హీరోహీరోయిన్లుగా నటించారు. ట్రయాంగిల్ లవ్ స్టోరీగా తెరకెక్కించిన ఈ సినిమా 2008లో విడుదలై ఘన విజయం సాధించింది. తాజాగా దీనికి పార్ట్ 2ని తెరకెక్కించాలని కరణ్ జోహార్ ప్లాన్ చేస్తున్నారు. ఇందులో హీరోయిన్‌గా అలియాభట్‌ని అనుకుంటున్నారట. దీనికి తరుణ్ మన్సుఖని దర్శకత్వం వహించనున్నారు. ప్రస్తుతం అలియా 'గల్లీబాయ్', 'కళంక్', 'బ్రహ్మాస్త్ర' చిత్రాల్లో నటిస్తోంది.

ప్రేమికుల రోజు కానుక..


ప్రియా ప్రకాష్ వారియర్


ప్రియా ప్రకాష్ వారియర్, రోషన్ జంటగా ఒమర్ లులు దర్శకత్వంలో రూపొందిన మలయాళ చిత్రాన్ని సుఖీభవ సినిమాస్ పతాకంపై ఏ.గురురాజ్, సి.హెచ్.వినోద్‌రెడ్డి తెలుగులో 'లవర్స్ డే' పేరుతో విడుదల చేస్తున్నారు. ఈ నెల 14న తెలుగు, మలయాళంతోపాటు కన్నడ, తమిళ భాషల్లో ఈ సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ, 'ఇటీవల అల్లు అర్జున్ అతిథిగా జరిగిన ప్రీ రిలీజ్ వేడుక సూపర్ హిట్ అయ్యింది. సినిమా జనాల్లోకి వెళ్ళడంతో క్రేజ్ పెరిగింది. అందుకు బన్నీకి థ్యాంక్స్ చెప్పుకుంటున్నాం. ఈ ఫంక్షన్ తర్వాత ప్రియా ప్రకాష్‌కి తెలుగులో క్రేజ్ మరింత పెరిగింది. ఇలాంటి పరిస్థితుల్లో సినిమాని తెలుగు ప్రేక్షకులకి దగ్గరగా చేసేందుకు, ప్రేక్షకులకు సంపూర్ణమైన వినోదాన్ని అందించేందుకు ప్రీ ప్రొడక్షన్ పనులను క్వాలిటీతో చేస్తున్నాం. ప్రియా ప్రకాష్‌కి ఉమ(దర్శకుడు రేలంగి నరసింహారావు తమ్ముడి కూతురు), మరో పాత్ర పోషించిన నూరిన్‌కి సింగర్ లిప్సిక డబ్బింగ్ చెప్పారు. సినిమాలో ఎనిమిది పాటలున్నాయి. గీత రచయితలు చంద్రబోస్, చైతన్య ప్రసాద్, శివ గణేష్, శ్రీజో, శ్రీ సాయికిరణ్ సాహిత్యాన్ని అందించారు. ఇందులో ఓ పాట థియేటర్‌లో ప్రేక్షకులకి సర్‌ప్రైజ్‌గా ఉంటుంది. ప్రియా ప్రకాష్ వారియర్ క్రేజ్, పాటలకి వచ్చిన స్పందనతో అంచనాలు పెరిగాయి. దానికి తగ్గట్టుగానే అన్ని ఏరియాల నుంచి బిజినెస్ పరంగా కూడా అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ప్రేమికుల రోజున విడుదల చేస్తున్నాం' అని అన్నారు.

నిరుద్యోగంపై ప్రణాళిక ఏది..?

ఏటా 2 కోట్ల ఉద్యోగాలన్న వాగ్దానం మరిచారా..?

- **యువతకు ఏ హామీ ఇవ్వని కేంద్ర బడ్జెట్**
- **45 ఏండ్ల గరిష్టానికి దేశ నిరుద్యోగ సమస్య**

ఎన్ఎస్ఎస్ఓ, సీఎంఐఈ నివేదికలు



న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం ఈ నెల 1న పార్లమెంట్కు సమర్పించిన మధ్యంతర బడ్జెట్లో దేశంలోని నిరుద్యోగ సమస్య, యువతకు ఉద్యోగ కల్పనకు స్పష్టమైన గణాంకాలుగానీ, దీర్ఘకాలిక ప్రణాళికగానీ లేకపోవడం పట్ల విమర్శలు వస్తున్నాయి. ఐదేండ్ల క్రితం 2014 సార్వత్రిక ఎన్నికలకు ముందు ప్రధాని మోడీ ఇచ్చిన వాగ్దానాల్లో యువకులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించడమనేది ప్రధానాంశం. కాంగ్రెస్ హయాంలో దేశంలో వేళ్లూనుకుపోయిన అవినీతిని పెకిలిస్తానని,అక్రమ సంపాదనాపరులు విదేశాల్లో దాచుకున్న లక్షల కోట్ల నల్లధనాన్ని వెనక్కి రప్పిస్తానని, ప్రతి ఒక్కరి ఖాతాలో రూ.15 లక్షల చొప్పున వేస్తానని, ఏటా 2 కోట్ల ఉద్యోగాలను సృష్టిస్తానని ప్రధాని మోడీ తన ఎన్నికల ప్రసంగాల్లో ప్రధానంగా ప్రస్తావించారు. మరోసారి సార్వత్రిక ఎన్నికలకు వెళ్తున్న వేళ తమ గత వాగ్దానాల గురించి దేశ ప్రజలు మరిచిపోయి ఉంటారని ప్రధాని మోడీగానీ, ఆయన మంత్రివర్గ సహచరులుగానీ భావిస్తారని అనుకోలేం. అయితే, ఆర్థికమంత్రి పీయూష్గోయల్ తన బడ్జెట్ ప్రసంగంలో యువత ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యపై అధికారిక డేటా ఇవ్వకుండా గత రెండేండ్లలో 2 కోట్ల ఉద్యోగావకాశాలు అదనంగా వచ్చాయన్నారు. ఆ ప్రసంగంలో దొర్లిన ఈ యథాలాప వ్యాఖ్యల్ని ఎవరూ అంతగా పట్టించుకున్నట్టు లేదు. ఆయన మాటలకు ఆధారమైన అధికారిక నివేదికలేమీ లేకపోవడమే అందుకు కారణం.

2016 నవంబర్ 8న పెద్దనోట్ల రద్దు తర్వాత నిరుద్యోగ సమస్యపై అధికారిక నివేదిక ఏదీ వెల్లడి కాలేదు. పెద్దనోట్ల రద్దు వల్ల మన ఆర్థిక వ్యవస్థకు 2 శాతం నష్టం వాటిల్లినట్టు ప్రముఖ ఆర్థికవేత్తల నుంచి ఏకాభిప్రాయం వ్యక్తమైంది. జీడీపీకి 2 శాతం నష్టమంటే దాదాపు రూ.3 లక్షల కోట్లు. ప్రస్తుతం మన దేశ జీడీపీ సుమారు రూ.150 లక్షల కోట్లు(2011-12 స్థిర ధరల ప్రకారం 2018-19లో దేశ జీడీపీ రూ.139 లక్షల 52 వేల కోట్లుగా అంచనా). ఆ తర్వాత హడావుడిగా తీసుకొచ్చిన జీఎస్టీ వల్ల కూడా ఆర్థిక లావాదేవీలు ఓమేరకు స్తంభించిపోయాయి. ముందుచూపు ప్రణాళిక లేకుండా మోడీ సర్కార్ తీసుకున్న ఈ రెండు నిర్ణయాలు దేశ ఆర్థిక వ్యవస్థను కుదిపేశాయని ఆర్థికవేత్తలు విశ్లేషించారు. ఈ నేపథ్యంలోనే నిరుద్యోగ సమస్యపై 2017-18లో జాతీయ గణాంక సంస్థ ఎన్ఎస్ఎస్ఓ నిర్వహించిన సర్వే నివేదికను మోడీ సర్కార్ తొక్కిపెట్టినట్టుగా తీవ్ర ఆరోపణలున్నాయి. కానీ, ఆ నివేదికలోని కీలకాంశాలు ఒకటొకటిగా మీడియాకు లీకయ్యాయి.

ఎన్ఎస్ఎస్ఓ నివేదిక ప్రకారం 2017 జులై నుంచి 2018 జూన్ వరకు దేశంలో నిరుద్యోగుల సంఖ్య 6.1 శాతం. పట్టణాల్లో 7.8 శాతం, గ్రామీణ ప్రాంతాల్లో 5.3 శాతం. గత 45 ఏండ్లలో ఇంతటి నిరుద్యోగ సమస్య ఎప్పుడూ ఎదురుకాలేదని ఆర్థికవేత్తలు చెబుతున్నారు. ఎన్ఎస్ఎస్ఓ 2011-12లో(యూపీఏ హయాంలో) నిర్వహించిన సర్వే ప్రకారం నిరుద్యోగుల సంఖ్య 2.2 శాతం మాత్రమే. అంటే..యూపీఏ పాలనతో పోల్చినా మోడీ హయాంలో నిరుద్యోగ సమస్య తీవ్రస్థాయికి చేరిందనే అర్థమవుతోంది. మరోవైపు ఇప్పుడు ఉద్యోగాలు,ఉపాధి పొందినవారిలోనూ 90 శాతంకుపైగా అసంఘటితరంగాల్లోనే ఉన్నట్టు గమనార్హం. దీనికితోడు ఏటా నిరుద్యోగుల జాబితాలో కోటి 20 లక్షలమంది కొత్తగా చేరుతున్నట్టు అంచనా. అయితే, లీకైన ఎన్ఎస్ఎస్ఓ నివేదిక తుది లెక్క కాదంటూ కేంద్ర ప్రభుత్వవర్గాలు సమర్థించుకొంటున్నాయి. గత నాలుగేండ్లలో ఉద్యోగాల కల్పనపై పలు సాక్ష్యాలున్నాయని నీతి ఆయోగ్ వైస్ఛైర్మన్ రాజీవ్కుమార్ అన్నారు. కానీ, ఏ సర్వేలోనూ కొత్తగా ఉద్యోగాలు వచ్చినట్టు రికార్డుల్లో తేలలేదు. క్రమం తప్పకుండా ఎప్పటికప్పుడు సర్వేలు నిర్వహించే భారత ఆర్థిక వ్యవస్థ పర్యవేక్షణ సంస్థ(సీఎంఐఈ) తన తాజా నివేదికలోనూ దేశంలో నిరుద్యోగ సమస్య తీవ్రస్థాయికి చేరినట్టే తెలిపింది. 2017 డిసెంబర్ నుంచి 2018 డిసెంబర్ వరకు ఏడాది కాలంలో కోటి 9 లక్షలమంది ఉద్యోగాలు కోల్పోయినట్టు సీఎంఐఈ సర్వేలో వెల్లడైంది. 2018లో దేశంలో నిరుద్యోగుల సంఖ్య 7.4 శాతంగా ఆ నివేదిక తేల్చింది.

ప్రపంచశాంతి పత్రంపై సంతకం

- **పోప్..ఇమామ్ల ఆలింగనం**



అబుదాబి: ప్రపంచశాంతి కోసం ఉగ్రవాదంపై పోరాడేందుకు అబుదాబిలోని అల్అజర్ మసీదు(గ్రాండ్ మాస్క్)కు చెందిన ఇమామ్ షేక్ అహ్మద్ అల్ తాయెబ్,పోప్ ఫ్రాన్సిస్ సోమవారం ఒక ఒప్పందపత్రంపై సంతకం చేశారు. ఇరువురు ముద్దుపెట్టుకోవటంతో పాటు ఆలింగనం చేసుకున్నారు. మూడు రోజులపాటు చరిత్రాత్మక పర్యటనలో భాగంగా పోప్ యూఏఈకి వచ్చారు. ప్రపంచశాంతి కోసం చేతులుకలపాలని ముస్లిం సమాజానికి పిలుపునిచ్చిన సంగతి విదితమే. మానవాళికి సంబంధించి ప్రపంచశాంతి కోసం ఈ ఒప్పందపత్రం క్రిస్టియన్లు,ముస్లింల మధ్య చర్చలకు ముఖ్యమైన ముందడుగుగా వాటికన్ అభిప్రాయపడింది. మత విశ్వాసాలలో స్వేచ్ఛ,సహన సంస్కృతి పెంపు,ప్రార్థనా స్థలాల రక్షణ,మైనార్టీలకు పూర్తిస్థాయి పౌరసత్వం వంటి ముఖ్యమైన అంశాలు ఈ ఒప్పందంలో ప్రస్తావించినట్టు అధికార వర్గాలు తెలిపాయి.

తోడు దొంగలే..

(మొదటిపేజీ తరువాయి)

ఆయన స్పందించకపోవడంతో ఈ విషయం ఇంతవరకు వచ్చిందని తెలిపారు. కాగా, ఈ విషయాన్ని సీఎం మమతా... కేంద్ర, రాష్ట్ర సంబంధాలకు చెందిన విషయంగా ప్రచారం చేసుకోవడం అనుమానాస్పదంగా ఉన్నదని వెల్లడించారు. ఆమె చర్యలు పూర్తిగా రాజ్యాంగ విరుద్ధమని చెప్పారు. సుప్రీం ఆదేశాలతో విచారణ చేపడుతున్న సంస్థకు చెందిన అధికారులను అడ్డగించడంపై ఏచూరి ఆగ్రహం వ్యక్తం చేశారు. స్కాంకు సంబంధించిన విషయం పక్కకు తప్పించి, దేశంలో రాజ్యాంగ సంక్షోభం తలెత్తినట్టుగా ఆమె చిత్రీకరించడం ఏంటని నిలదీశారు. శారదా స్కాంలో ప్రధానంగా ఆరోపణలు ఎదుర్కొంటున్న నిందితులు బీజేపీలో చేరారని వారిపై ఎటువంటి చర్యలు లేవని ప్రశ్నించారు. మోడీ సర్కారు హయాంలో ద్వంద వైఖరికి ఈ చర్యలే నిలువెత్తు నిదర్శమని అన్నారు. ఈ ఘటనతో దేశ ప్రజానీకానికి ఒక వ్యతిరేక సంకేతం వెళుతుందని అభిప్రాయపడ్డారు. మమతకు అండగా నిలిచిన ప్రతిపక్షాలన్నింటికీ అవినీతి మకిలీ అంటించే ప్రయత్నం మోడీ ప్రభుత్వం చేస్తుందని అన్నారు. అవినీతిపై తాము యుద్ధం చేస్తున్నట్టు మోడీ సర్కారు డాంభికాలు కొడుతున్నదని వివరించారు. అదే జోరు రాఫెల్ విషయంలో ఎందుకు ప్రదర్శించడం లేదని ప్రశ్నించారు. దాంతోపాటు జీఎస్పీసీఎల్, వ్యాపం, సహారా -బిర్లా, నీరవ్ మోడీ, బొగ్గు తదితర సంబంధించిన ఎన్నో అంశాల్లో బీజేపీ కుంభకోణాలు చేసిందని ఆరోపించారు. ఇటువంటి అంశాలపై ఎందుకు విచారణకు ఆదేశించరని నిలదీశారు. ఇప్పటికైనా శారదా స్కాంలో పారదర్శకంగా విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఆయనతో పాటు సీపీఐ(ఎం) ఎంపీలు సలీం, టీకే రంగరాజన్ తదితరులు ఉన్నారు.

పండితులు, పీఈటీల కల సాకారం

(మొదటిపేజీ తరువాయి)

భాషాపండితుల పోస్టులను అప్గ్రేడ్ చేస్తామని హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఇప్పుడు ఆ హామీని నిలబెట్టుకున్నారని ముఖ్యమంత్రి కార్యాలయం మంగళవారం ఓ ప్రకటనలో తెలిపింది. ఇకపై రాష్ట్రంలో గ్రేడ్-2 పండితుల పోస్టులుండబోవని ప్రకటించింది. ఈ నిర్ణయంతో రాష్ట్రంలోని వేలాది మంది భాషా పండితులకు మేలు జరుగుతుందని తెలిపింది.

10,344 మందికి పదోన్నతులు

రాష్ట్రంలో పండితులు, పీఈటీల పోస్టులను స్కూల్ అసిస్టెంట్లుగా అప్గ్రేడ్ చేయడంతో వారికి పదోన్నతులు దక్కనున్నాయి. రాష్ట్రంలో ప్రభుత్వ నిర్ణయం ద్వారా పండితులు, పీఈటీలు 10,344 మందికి పదోన్నతులు లభించనున్నాయి.పండితుల పదోన్నతులకు సంబంధించి 2,487 పోస్టులను స్కూల్ అసిస్టెంట్లుగా అప్గ్రేడ్ చేసింది. తాజాగా మరో 6,024 పోస్టులను అప్గ్రేడ్ చేయనుంది. దీనివల్ల ఇంతకాలం గ్రేడ్-2 భాషా పండితులుగా కొనసాగిన 8,511 మంది పండితులకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి లభించనుంది. పీఈటీలు గతంలో 1,047 పోస్టులను ఫిజికల్ డైరెక్టర్ (పీడీ)లుగా అప్గ్రేడ్ చేసింది. ఇప్పుడు మరో 786 పీఈటీ పోస్టులను అప్గ్రేడ్ చేయడం ద్వారా 1,833 పీఈటీలు పీడీలుగా అప్గ్రేడ్ కానున్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీల కృతజ్ఞతలు

భాషా పండితులు, పీఈటీలను స్కూల్ అసిస్టెంట్లుగా అప్గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం పట్ల ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు హర్షం వ్యక్తం చేశారు.

ముఖ్యమంత్రి చంద్రశేఖర్రావును ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు పాతూరి సుధాకర్రెడ్డి, పూల రవీందర్, కె జనార్ధన్రెడ్డి, రచయిత దేశపతి శ్రీనివాస్ మంగళవారం ప్రగతిభవన్లో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. భాషా పండితుల చిరకాల కోరికను సీఎం కేసీఆర్ నెరవేర్చారని పేర్కొన్నారు. విద్యారంగ చరిత్రలో ఇదొక అపూర్వ నిర్ణయంగా నిలిచిపోతుందని తెలిపారు. సీఎంకు తెలుగు భాషపై ఉన్న ప్రేమకు ఇది నిదర్శనమని పేర్కొన్నారు.

టీఎస్యూటీఎఫ్ హర్షం

భాషాపండితులు, పీఈటీలను స్కూల్ అసిస్టెంట్లుగా అప్గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల టీఎస్యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ రాములు, ప్రధాన కార్యదర్శి చావ రవి ఓ ప్రకటనలో హర్షం ప్రకటించారు. తక్షణమే ఈ ఆదేశాలను అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

స్వాగతించిన పీఆర్టీయూ

భాషాపండితులు, పీఈటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని పీఆర్టీయూటీఎస్ అధ్యక్షులు పి సరోత్తంరెడ్డి, ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమలాకర్రావు స్వాగతిస్తున్నామని ఓ ప్రకటనలో తెలిపారు. ఇది చారిత్రక నిర్ణయమని పేర్కొన్నారు.

ఆ సమాచారం లేదు

(మొదటిపేజీ తరువాయి)

ఉపాధిపై అది ఏవిధంగా ప్రభావం చూపిందని బిజూ జనతాదళ్(బీజేడీ) ఎంపీ రబీంద్ర కుమార్ జెనా అడిగిన ప్రశ్నకు గంగ్వార్ పైవిధంగా సమాధానమిచ్చారు. కాగా, నేషనల్ శాంపిల్ సర్వే ఆఫీస్(ఎన్ఎస్ఎస్ఓ) 2017-18కి సంబంధించి దేశంలోని నిరుద్యోగంపై వెల్లడించిన గణాంకాల కంటే పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ నిర్ణయాలే నిరుద్యోగంపై తీవ్ర ప్రభావం చూపినట్టు గతవారం విడుదలైన ఓ నివేదికలో తేలింది. ఎన్ఎస్ఎస్ఓ గణాంకాల మేరకు 2017-18లో దేశంలోని నిరుద్యోగం 6.1శాతంతో 45 ఏండ్ల గరిష్టానికి చేరిందని వెల్లడైంది. కాగా, 2011-12 మధ్య యూపీఏ-2 హయాంలో ఇది 2.2శాతంగా మాత్రమే ఉన్నట్టు పేర్కొన్నది. అలాగే 2015-16లో దేశంలో నిరుద్యోగరేటు 3.7శాతంగా ఉన్నదని కాంగ్రెస్ ఎంపీ ముల్లపల్లి రామచంద్రన్ అడిగిన ప్రశ్నకు గంగ్వార్ సమాధానమిచ్చారు.

కేంద్రం నిధులు కేటాయించాలి

మధ్యాహ్నభోజన కార్మికుల వేతనాల పెంపు కోసం..

- **8న రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు : కార్మిక సంఘాల నాయకులు**



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మధ్యాహ్నభోజన కార్మికుల వేతనాల పెంపు కోసం కేంద్రం మధ్యంతర బడ్జెట్లో నిధులను కేటాయించాలని మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్(సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.రమ, మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) రాష్ట్ర అధ్యక్షులు ప్రేమపావని, తెలంగాణ ప్రగతిశీల మధ్యాహ్నభోజన పథకం వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్టీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసాద్ డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలపై ఈ నెల ఎనిమిదో తేదీన దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్టు ప్రకటించారు. హైదరాబాద్లోని సీఐ టీయూ రాష్ట్ర కార్యాలయంలో మధ్యాహ్న భోజన కార్మిక సంఘాల సంయుక్త సమావేశం మంగ ళవారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పౌష్టికాహార లోపం బారిన పడకుండా మంచి భోజనం పెడుతూ పిల్లలను కాపాడుతున్న కార్మి కుల పట్ల కేంద్రం సానుకూలంగా స్పందించాలని కోరారు. 2019 మధ్యంతర బడ్జెట్లోనైనా కనీస వేతనం రూ.18వేలు చెల్లించాలని, పెన్షన్ సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్నభోజన కార్మికుల సమస్యల పై ఇప్పటికే కేంద్ర ఆర్థిక మంత్రి యు.పీయూష్ గోయల్కు కేంద్ర కార్మికసంఘాలు వినతిపత్రాన్ని అందజేసినా..ఇప్పటికీ స్పందించలేదన్నారు. ఈ నెల ఎనిమిదో తేదీన జరిగే ఆందోళనా కార్యక్రమాల్లో మధ్యాహ్న భోజన కార్మికులు పెద్దఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో వర్కింగ్ ఉమెన్ నాయకులు కరుణకుమారి, ఐఎఫ్టీయూ రాష్ట్ర నాయకులు అంబాదాస్, తదితరులు పాల్గొన్నారు.

పొంగిన 'గ్లాసులు'.. ఖజానాకు 'కాసులు'

(మొదటిపేజీ తరువాయి)

రూ.1680 కోట్ల ఆదాయం సమకూరినట్టు ఆబ్కారీ శాఖ అంచనాగా ఉంది. శాసనసభ, పంచాయతీ ఎన్నికల సందర్భంగానే అమ్మకాలు విపరీతంగా పెరిగాయి. ప్రధానంగా పంచాయతీ ఎన్నికల్లో అధికశాతం చీప్ లిక్కర్ అమ్మకాలే పెద్దమొత్తంలో కొనుగోలు చేసినట్టు తెలిసింది. పంచాయతీ ఎన్నికల సందర్భంగా గత నెల రోజుల పాటు మద్యం దుకాణాల్లో చీప్ లిక్కర్ కొరత ఏర్పడటం విశేషం.

రూ. 23వేల కోట్లకు చేరే అవకాశం

ఈ ఆర్థిక సంవత్సరం ముగిసే లోపు రాష్ట్రంలో మద్యం అమ్మకాలు రూ. 23వేల కోట్లకు చేరుతుందని, ఆ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. గత ఆరు నెలలుగా అమ్మకాలు భారీగా పెరగడం, ఇప్పటికే రూ. 18వేల కోట్ల అమ్మకాలు జరిగినందున ఈ రెండు నెలల్లో మరో రూ.5వేల కోట్ల అమ్మకాలు జరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు. మద్యం అమ్మకాలతో ప్రతి సంవత్సరం సర్కారుకు రూ. 10వేల కోట్ల ఆదాయం సమకూరుతున్నదని అధికారులు తెలిపారు. బ్రాండెడ్ మద్యం కన్నా చీప్ లిక్కర్, బీర్ల అమ్మకాలతోనే రూ.6వేల కోట్ల ఆదాయం సమకూరినట్టు తెలిసింది.

పేదల ద్వారానే అధిక ఆదాయం

ఎక్సైజ్ శాఖకు అంచనాలకు మించి వచ్చిన ఆదాయంలో సింహభాగం పేదల నుంచి వచ్చిందే. చీప్ లిక్కర్, బ్రాండెడ్ కంపెనీలు ఉత్పత్తి చేస్తున్న అగ్వ మద్యం ద్వారా సుమారు రూ. 5200 కోట్ల ఆదాయం వచ్చినట్టు సమకూరినట్టు తెలిసింది. గ్రామపంచాయతీలు, మున్సిపాల్టీ పరిధిలో చీప్ లిక్కర్, అగ్వ మద్యం అమ్మకాలు జోరుగాసాగుతున్నాయి. క్వార్టర్ చీప్ లిక్కర్ రూ.60 నుంచి రూ.85 వరకు విక్రయిస్తున్నారు. బ్రాండెడ్ కంపెనీలకు చెందిన చీప్ లిక్కర్ 120 ఎంఎల్ ధర రూ.90 నుంచి రూ.130 వరకు అమ్ముతున్నారు. గుడుంబాను అరికట్టడం వల్లనే మద్యం విక్రయాలు పెరిగాయని ప్రభుత్వం చెబుతున్నది. కానీ రూ.10 నుంచి రూ.20 వెచ్చించే మద్యం ప్రియులు ఇప్పుడు రోజుకు రూ.100 నుంచి 200 వరకు వెచ్చిస్తున్నారు. ఘాటైన గుడుంబాకు అలవాటు పడ్డ వ్యక్తికి సాధారణ మద్యం అంతగా 'కిక్కు' ఇవ్వదు. కిక్కు కోసం రోజుకు రెండు, మూడు సార్లు తాగడం వల్ల కూడా చీప్ లిక్కర్ విక్రయాలు పెరిగాయని కొందరు ఎక్సైజ్ శాఖ సిబ్బంది తెలిపారు. గుడుంబా తరహాలో చీప్ లిక్కర్ను కూడా పూర్తిగా నిషేధించి ప్రభుత్వమే కల్తీలేని 'కల్లు' విక్రయాలు చేపట్టాలని ఎక్సైజ్ అధికారులు సూచిస్తున్నారు. దీనివల్ల కల్లు గీత కార్మికులకు ఉపాధి పెరుగుతుందని, పేదల ఆరోగ్యం బాగుపడటమే కాకుండా డబ్బులు కూడా మిగులుతాయని పేరు రాయడానికి ఇష్టపడని ఒక సీనియర్ ఎక్సైజ్ శాఖ అధికారి అభిప్రాయపడ్డారు.

ఉపాధి నిధులతో శ్మశాన వాటికలు

(మొదటిపేజీ తరువాయి)

అభివృద్ధి చేయాలని ఆదేశించారు. ఉపాధి పథకం కింద కేంద్రం నుంచి రాష్ట్రానికి ఎంత డబ్బు వస్తుందో.. అంతే మొత్తంలో రాష్ట్ర ప్రభుత్వం కూడా బడ్జెట్లో నిధులు కేటాయిస్తుందని తెలిపారు. వీటిని వినియోగించటం ద్వారా గ్రామాల్లోని ప్రజలకు ఉపయోగపడే ఆస్తులను సృష్టించాలని కోరారు. పంచాయతీలన్నింటికీ కచ్చితంగా బీటీ రోడ్డు ఉండేలా రహదారుల వ్యవస్థను రూపొందించాలని సూచించారు. హరితహారంలో భాగంగా రాష్ట్రంలోని మొత్తం 12,751 గ్రామాల్లో నర్సరీలను ఏర్పాటు చేయాలని సీఎం ఈ సందర్భంగా ఆదేశించారు. అటవీశాఖ అధికారుల సలహాలు, వారి సాంకేతిక సహకారంతో నర్సరీలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఆరు నెలల్లోగా అన్ని గ్రామాల్లో శ్మశాన వాటికలు నిర్మించాలి, ప్రభుత్వ భూమి లేకుంటే పంచాయతీలు తమ నిధులతోనే స్థలాలను సమకూర్చుకోవాలని చెప్పారు. అవసరమైతే దాతల నుంచి కూడా స్వీకరించాలని సూచించారు. మూడు వేల లోపు జనాభా కలిగిన 11,412 గ్రామాల్లో ఒకటి చొప్పున, మూడు వేలకు పైగా జనాభా ఉన్న 1,300 గ్రామాల్లో రెండు చొప్పున మొత్తం 14,012 గ్రామాల్లో శ్మశాన వాటికలను నిర్మించాలని సీఎం ఆదేశించారు. వీటితోపాటు 859 గ్రామాలకు రహదారులను నిర్మించాలని సూచించారు. ఇందుకోసం ప్రతిపాదనలు తయారు చేసి పనులను ప్రారంభించాలని అన్నారు.

ఆకస్మిక తనిఖీలు...

ఉపాధితోపాటు ఇతరత్రా మార్గాల ద్వారా సమకూరిన నిధులతో గ్రామాల్లో జరుగుతున్న పనులను ఆకస్మికంగా తనిఖీ చేయాలని సీఎం ఆదేశించారు. నిధులు దుర్వినియోగం కాకుండా చూడాలని అన్నారు. పనులను నామమాత్రంగా చేసి, నిధులను కాజేసే పద్ధతి పోవాలని చెప్పారు. ఇలాంటి అంశాలను పర్యవేక్షించేందుకు వీలుగా అధికారులు 20 బృందాలుగా విడిపోయి ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని సీఎం ఆదేశించారు. సమీక్షా సమావేశంలో ప్రభుత్వ ముఖ్య సలహాదారు డాక్టర్ రాజీవ్శర్మ, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్కే జోషి, ఎంపీలు బి.వినోద్కుమార్, బండ ప్రకాశ్, ఎమ్మెల్యేలు ఈటల రాజేందర్, రెడ్యానాయక్తోపాటు పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

అవినీతి అధికారిని కాపాడే యత్నం: యోగి

- **ముందు నీ రాష్ట్రాన్ని చూసుకో : మమత**

కోల్కతా : పశ్చిమబెంగాల్ వేదికగా ఇద్దరు ముఖ్య మంత్రుల మధ్య మాటల యుద్ధం తారాస్థాయికి చేరిం ది. అవినీతి పోలీసు అధికారిని కాపాడేందుకు ముఖ్య మంత్రి మమతా బెనర్జీ ప్రయత్నిస్తున్నారని ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ముం దు మీరాష్ట్రంలో శాంతిభద్రతలను సరిగ్గా చూసుకోవాలంటూ యోగికి మమతా బెనర్జీ సూచించారు. పశ్చిమబెంగాల్లోని పురూలియాలో మంగళవారం జరిగిన ర్యాలీలో యోగి ఆదిత్యనాథ్ పాల్గొని మాట్లాడారు.

14శానిటరీ వర్కర్స్ పోస్టులు.. 4వేల మంది అభ్యర్థులు

చెన్నై: ఒకపక్క దేశంలో ఉపాధి కల్పనపై మోడీ ప్రభుత్వానికి, ప్రతిపక్షాలకు మధ్య తీవ్ర చర్చ నడుస్తున్న తరుణంలో నిరుద్యోగం ఏస్థాయిలో ఉన్నదనే అంశాన్ని ప్రతిబింబించే ఘటన తమిళనాడులో చోటుచేసుకున్నది. రాష్ట్ర అసెంబ్లీ, సెక్రెటేరియట్లలో కేవలం 14శానిటరీ పోస్టులకు నాలుగువేల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా అందులో ఎంబీఏ, ఇంజనీరింగ్, ఆర్ట్స్, కామర్స్కు చెందిన గ్రాడ్యుయేట్లు అధికంగా ఉండటం గమనార్హం. 10 స్వీపర్లు, 4శానిటరీ వర్కర్ పోస్టులకు సంబంధించి గతేడాది తమిళనాడు ప్రభుత్వం నోటిఫికేషన్ను విడుదల చేసింది. విద్యార్హతలు అవసరం లేకుండా కేవలం శారీరక దారుఢ్యమే అర్హతగా నిర్ణయించిన ఈ పోస్టులకు జీతాన్ని రూ.15,700 నుంచి 50వేలుగా నిర్ణయించారు. రోస్టర్ పద్ధతిలో జనరల్ కేటగిరికి నాలుగు, ఓబీసీకి నాలుగు, ఎంబీసీలు, డీనోటిఫైడ్ ట్రైబ్స్కు మూడు, ఎస్సీలకు2, ఎస్టీలకు ఒకటిగా కేటాయించారు. ఇందులో భాగంగా ఇంటర్వ్యూ కోసం 3930 మంది అభ్యర్థులకు కాల్లెటర్లు అందాయి. అభ్యర్థుల సమగ్రవివరాలకు సంబంధించి తమిళనాడు ప్రభుత్వం తన వెబ్సైట్లో అప్లోడ్ చేసింది. అయితే కేవలం 14శానిటరీ పోస్టులకు వివిధ విభాగాల్లో డిగ్రీలు, పీజీలు చేసిన వారు ఎలాంటి విద్య కూడా అభ్యసించని వారితో పోటీపడుతుండటం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

ఇటీవల యూపీలో కేవలం 62 ప్యూన్పోస్టుల కోసం పీహెచ్డీ హోల్డర్లతో పాటు మొత్తం 93వేల మంది దరఖాస్తు చేసుకున్న విషయం తెలిసిందే. అలాగే మహారాష్ట్రలోని మంత్రాలయలో కేవలం 4,5 తరగతి అర్హతగా ఉన్న 13 వెయిటర్ పోస్టులకు ఏడువేల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా అందులోనూ అత్యధికులు ఉన్నత విద్యనభ్యసించినవారే ఉండటం గమనార్హం.

కార్పొ'రేటు' కొత్త 'రూటు'

(మొదటిపేజీ తరువాయి)

ప్రకటిస్తున్నారు. ముందే సీటును రిజర్వు చేసుకుంటే ఫీజులో 20 శాతం నుంచి 30 శాతం వరకు రాయితీ ఉంటుందని విద్యార్థులు, వారి తల్లిదండ్రులను ఆకర్షించే పనిలో నిమగ్నమయ్యాయి. ఈ ప్రకటనలను చూసి ఆశపడిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ప్రవేశ పరీక్షలు రాసేందుకు మొగ్గుచూపుతున్నారు. రాష్ట్రంలో ప్రముఖంగా గుర్తింపు పొందిన కార్పొరేట్ కాలేజీలు ఈ ప్రవేశ పరీక్షలను నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్నాయి. ఇంటర్+జేఈఈ, ఇంటర్+నీట్, ఏసీ క్యాంపస్, డిజిటల్ తరగతి గదులు ఇలా పలు రకాల పేర్లతో విద్యార్థులను ఆకట్టుకుంటున్నాయి. కోర్సును బట్టి ఫీజులను నిర్ణయిస్తున్నాయి. అడ్డదారిలో ప్రవేశాల ప్రక్రియను చేపడుతున్నాయి. రాష్ట్రంలో ఇంటర్ ప్రవేశాలకు ప్రభుత్వం షెడ్యూల్ విడుదల చేయలేదు. చట్ట విరుద్ధంగా ప్రవేశాలు కల్పిస్తున్నాయి. కార్పొరేట్ కాలేజీల్లో చదవాలన్న విద్యార్థులు, చదివించాలన్న తల్లిదండ్రుల కోరికను ఆసరాగా చేసుకొని విద్యావ్యాపారానికి తెరతీస్తున్నాయి. కార్పొరేట్ కాలేజీ యాజమాన్యాలు నిబంధనలకు తిలోదకాలు ఇస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. ఇంత జరుగుతున్నా ఇంటర్మీడియెట్ బోర్డు అధికారులు పట్టించుకోవడం లేదు. వక్రమార్గంలో అడ్మిషన్లు జరుగుతున్నా అధికారులు చోద్యం చూస్తున్నారని విద్యార్థి సంఘాల నేతలు విమర్శిస్తున్నారు. మార్గదర్శకాలకు విరుద్ధంగా అడ్మిషన్లు చేపట్టే కాలేజీ యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలనీ, గుర్తింపు రద్దు చేయాలనీ డిమాండ్ చేస్తున్నారు.

విద్యావ్యాపారమే లక్ష్యం...

రాష్ట్రంలో మొత్తం 3 వేల వరకు జూనియర్ కాలేజీలున్నాయి. ప్రయివేటు జూనియర్ కాలేజీలు 2,200 ఉండగా, కార్పొరేట్ జూనియర్ కాలేజీలు 300 వరకు నడుస్తున్నాయి. రాష్ట్రంలో ఇంటర్ విద్యలో 8 లక్షల మంది వరకు విద్యార్థులు చదువుతుంటే, కార్పొరేట్ కాలేజీల్లోనే సుమారు 3 లక్షల మంది విద్యనభ్యసిస్తున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి కార్పొరేట్ కాలేజీలు విద్యావ్యాపారం చేస్తున్న సంగతి తెలిసిందే. తెలంగాణ వస్తే కార్పొరేట్ కాలేజీలను కట్టడి చేస్తామనీ, ఫీజులను నియంత్రిస్తామనీ నాటి ఉద్యమ నేతలు, నేటి పాలకులు అనేక సార్లు ఉద్ఘాటించారు. తెలంగాణ వచ్చినా టీఆర్ఎస్ రెండోసారి అధికారం చేపట్టినా ప్రజల ఆకాంక్షలు నెరవేరలేదు. కార్పొరేట్ కాలేజీలను కట్టడి చేయకపోగా, కనీసం ఫీజులనూ నియంత్రించడం లేదన్న ఆందోళన వ్యక్తమవుతున్నది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇంటర్ ప్రథమ సంవత్సరానికి ఏటా రూ.1,760, ద్వితీయ సంవత్సరానికి రూ.1,940 ఫీజు వసూలు చేయాలి. కానీ కార్పొరేట్ కాలేజీల్లో ఒక్కో విద్యార్థికి ఏటా రూ.రూ.1.50 లక్షల నుంచి రూ.3.50 లక్షల వరకు ఫీజులు వసూలు చేస్తున్నట్టు సమాచారం. రెసిడెన్షియల్, జేఈఈ, నీట్, ఎంసెట్, సీఏ సీపీటీ వంటి కోచింగ్ పేరుతో ఇష్టానుసారం ఫీజులు తీసుకుంటున్నాయి. ఫీజుల వసూలుకు అడ్డూఅదుపు లేకుండా పోతున్నది. విద్యార్థులు వారి తల్లిదండ్రుల నుంచి వ్యతిరేకత వస్తున్నా ప్రభుత్వం, ఇంటర్ బోర్డు పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి. ట్యూషన్ ఫీజులు 2014-15 విద్యాసంవత్సరం నుంచి పెంచలేదు. ఏటా 10 శాతం ఫీజులు పెంచాలని ప్రభుత్వ ఆదేశాలున్నాయి. ఎన్నికల ముందు ఏటా పది శాతం చొప్పున ట్యూషన్ ఫీజులు పెంచేందుకు టీఆర్ఎస్ ప్రభుత్వం సుముఖత వ్యక్తం చేసింది. కానీ ముందస్తు ఎన్నికలు రావడంతో ఆ నిర్ణయం వాయిదా పడింది. టీఆర్ఎస్ రెండోసారి అధికారంలోకి రావడంతో ట్యూషన్ ఫీజులు పెంచుతుందని ప్రయివేటు కాలేజీ యాజమాన్యాలు ఎదురుచూస్తున్నాయి. కార్పొరేట్ కాలేజీల ఆగడాలను కట్టడి చేయాలనీ, ఫీజులు నియంత్రించాలనీ విద్యార్థి సంఘాలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాయి.

హోంశాఖపై 'గరం'

(మొదటిపేజీ తరువాయి)

ప్రక్రియను కావాలనే ఆలస్యం చేస్తున్నారు. అందుకు వివిధ కారణాల్ని వెతుకుంటున్నారు. ఈ విషయంలో కేంద్ర హోం శాఖ మొత్తం ప్రక్రియనే దెబ్బతీసేవిధంగా వ్యవహరించింది. అటార్నీ జనరల్, సొలిసిటర్ జనరల్ ఇచ్చిన సమాచారం సరిగా లేదు. కేంద్ర హోం కార్యదర్శికి సమన్లు పంపమంటారా?"అని ఆగ్రహం వ్యక్తం చేశారు. మొత్తం ఈ ప్రక్రియనంతా పూర్తి చేసి తుది జాబితాను ఈ ఏడాది జులై 31 కల్లా విడుదల చేయాల్సిందేనని గతనెలలో సుప్రీంకోర్టు కేంద్రాన్ని ఆదేశించింది. అయితే సార్వత్రిక ఎన్నికలున్నాయన్న కారణం చూపుతూ తుది జాబితా విడుదలలో ఆలస్యమవుతుందనీ, గడువు పెంచాలనీ కేంద్ర హోంశాఖ తరపున ఏజీ కె.కె.వేణుగోపాల్ సుప్రీంను కోరారు.

ఇష్టానుసారం చేస్తున్నారు...

కేంద్ర హోం శాఖ వాదనను సుప్రీంకోర్టు పూర్తిగా తోసిపుచ్చింది. సార్వత్రిక ఎన్నికలున్నాయన్న నెపంతో తుది జాబితా ప్రక్రియను ఆపలేమని న్యాయస్థానం అభిప్రాయపడింది. ఒక పద్ధతి ప్రకారం కాకుండా ఇష్టానుసారంగా కేంద్రం ముందుకువెళ్తోందని ఆగ్రహం వ్యక్తం చేసింది. ఎన్నికల నామినేషన్, పోలింగ్ సందర్భంగా ఎన్ఆర్సీ ప్రక్రియను ఆపవచ్చుననీ, అయితే ఎన్నికలున్నాయన్న కారణంతో మూడు వారాలు ప్రక్రియను ఆపేస్తామనటం సరైంది కాదనీ కోర్టు తెలిపింది.

అస్సాంలో నివసిస్తున్న నిజమైన భారత పౌరులు ఎవరు? బంగ్లాదేశ్ నుంచి అక్రమంగా చొరబడ్డవారెవరు ? అన్నది తేల్చడానికి తీసుకొచ్చిందే 'జాతీయ పౌర జాబితా'. ఎన్ఆర్సీపై గత ఏడాది జులై 30న మోడీ సర్కార్ విడుదలచేసిన ముసాయిదా జాబితా వివాదాస్పదమైంది. దాదాపు 40లక్షలమంది భారతీయులకు ఈ జాబితాలో చోటు కల్పించకపోవటం విమర్శలకు దారితీసింది. ఈ నేపథ్యంలో వీరందరి నుంచి అభ్యంతరాలు, ఫిర్యాదులు స్వీకరించాలని సుప్రీంకోర్టు కేంద్ర హోం శాఖను ఆదేశించాల్సి వచ్చింది.

గడువులోగానే పూర్తిచేస్తాం : రాజ్నాథ్ సింగ్

చెప్పిన గడువులోగా అస్సాం-జాతీయ పౌర జాబితా తుది ప్రతి విడుదల చేస్తామని కేంద్ర హోం మంత్రి రాజ్నాథ్ సింగ్ ప్రకటించారు. అక్రమంగా చొరబడిన విదేశీయులకు జాబితాలో చోటు ఉండదనీ, అదే సమయంలో భారతీయులందరికీ ఇందులో స్థానముంటుందనీ ఆయన అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన సహకారంతో జాబితా రూపకల్పన ప్రక్రియ అంతా పూర్తి పారదర్శకతతో జరిగిందన్నారు.

అటవీశాఖలో ప్రక్షాళన

(మొదటిపేజీ తరువాయి)

కుమార్లకు మెదక్, కవ్వాల్ బాధ్యతలు అప్పగించారు. మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జనగామ, భూపాలపల్లి, ఖమ్మం, మంచిర్యాల, పాల్వంచ, కిన్నెరసాని, వరంగల్, ఖానాపూర్, నిజామాబాద్, అమ్రాబాద్, బాన్సువాడ, ఇల్లందు, కాగజ్ నగర్, ఇచ్చోడకు కొత్త డిఎఫ్ఓలను నియమించారు. 19 మంది రేంజ్ ఆఫీసర్లను సైతం మార్చారు. మహబూబాబాద్, గూడూరు, గంగారం, బయ్యారం, ఆజంనగర్, పెద్దపల్లి, నర్సంపేట, మంచిర్యాల, డోర్నకల్, కరీంనగర్, కొత్తగూడెం, కెరమెరి, బెల్లంపల్లి, తిర్యాని, గాంధారి, బాన్సువాడ, పిట్లం, నాగిరెడ్డిపేట, దూలపల్లికి కొత్త రేంజ్ అధికారులను నియమించారు. 160 మంది ఫారెస్టర్లు, బీట్ ఆఫీసర్లను బదిలీ చేశారు. 'జంగిల్ బచావో జంగిల్ బడావో' నినాదంతో అటవీ భూముల్లో అడవి పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని, చెట్ల పెంపకంపై చిత్తశుద్ధి చూపించే అధికారులను కీలక ప్రాంతాలకు బదిలీ చేయాలన్న సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు ఈ బదిలీలు చేసినట్టు అటవీశాఖ అధికారులు ధృవీకరించారు.



ఇప్పటి దాకా ఉన్న అటవీ అధికారుల్లో ఎక్కువ మంది హైదరాబాద్లో ఉండి విధులను నిర్వర్తిస్తున్న విషయం అందరికీ తెలిసిందే. క్షేత్రస్థాయిలో అధికారులు ఉండటం లేదన్న విషయం సీఎం దృష్టికి వెళ్లటంతోనే అటవీశాఖ ఈ సంస్కరణలు ప్రారంభించింది. ముఖ్యమైన ప్రాంతాల్లో మంచి అధికారులను నియమించడం, స్మగ్లర్లకు సహకరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవడం, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వారికి మెమోలు ఇవ్వడం లాంటి చర్యలు చేపట్టింది. స్మగ్లర్లకు సహకరిస్తున్నారనే అభియోగాలతో ఇటీవల కాలంలో 11 మంది అధికారులను అటవీశాఖ సస్పెండ్ చేసింది. సస్పెండైన వారిలో అటవీ అభివృద్ధి అధికారి స్థాయి నుంచి గార్డుల వరకున్నారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారికి మెమోలు జారీ చేశారు.

అధికారి పేరు	హోదా	బదిలీ అయిన స్థానం
ఎస్కె సిన్హా	సీసీఎఫ్/ఎఫ్డీపీటీ	అమ్రాబాద్ టైగర రిజర్వ్, అచ్చంపేట
శర్వానంద్	సీఎఫ్	మెదక్
సీపీ వినోద్ కుమార్	సీఎఫ్/ఎఫ్డీపీటీ	కవ్వాల్ టైగర్ రిజర్వ్, నిర్మల్
శివాని డోగ్రా	డీఎఫ్ఓ	మంచిర్యాల
వీఎస్ఎన్వీ ప్రసాద్	డీఎఫ్ఓ	నిర్మల్
సునిల్ ఎస్ హిరామత్	డీఎఫ్ఓ	నిజామాబాద్
జి.రామలింగం	డీఎఫ్ఓ	వరంగల్ అర్బన్, జనగామ
ఎస్.వి ప్రదీప్ కుమార్శెట్టి	డీఎఫ్ఓ	జయశంకర్ భూపాలపల్లి
బి.ప్రవీణ	డీఎఫ్ఓ	ఖమ్మం
నాగభూషణం	ఎఫ్డీఓ	మంచిర్యాల
ఎస్.సుజాత	ఎఫ్డీఓ	పాల్వంచ
కె.దామోదర్రెడ్డి	ఎఫ్డీఓ	డబ్ల్యూఎల్ఎమ్, కిన్నెరసాని
వెంకటేశ్వర్రావు	ఎఫ్డీఓ	వరంగల్
తిరుమలరావు	ఎఫ్డీఓ	ఖానాపూర్
ఎస్.వెంకటేశ్వర్లు	ఎఫ్డీఓ	నిజామాబాద్
కె.సుధాకర్	ఎఫ్డీఓ	అమ్రాబాద్
పి.సాగర్	ఎఫ్డీఓ	బాన్సువాడ
పి.అనిల్కుమార్	ఎఫ్డీఓ	ఇల్లందు
ఎమ్.రాజా రమణారెడ్డి	ఎఫ్డీఓ	కాగజ్నగర్

సెన్సెక్స్ ▲34	నిఫ్టీ ▲22	డాలరుకు రూపాయి విలువ	బంగారం(10.గ్రా)	వెండి (కేజీ)	కోడిగుడ్లు (వందకి)	
36,616	10,934	71.56	రూ. 33,230	రూ. 40,480	హైదరాబాద్ 400	విజయవాడ 397
					ఒక్కగుడ్డుకు 4.50	చెన్నై 435
					వరంగల్ 399	ముంబయి 450

పీఎన్‌బీ ఆశ్చర్యకర ఫలితాలు

- క్యూ3లో రూ.247 కోట్ల లాభాలు
- నీరవ్ మోసం తర్వాత తొలిసారి..
- పెరిగిన షేర్ విలువ

న్యూఢిల్లీ : దేశంలో రెండో అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకు పీఎన్‌బీ క్రితం త్రైమాసికంలో అంచనాలకు భిన్నంగా ఫలితాలు ప్రకటించింది. మొండిబాకీలకు కేటాయింపులు భారం తగ్గడంతో లాభాలను నమోదు చేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం అక్టోబర్ నుంచి డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో పంజాబ్ నేషనల్ బ్యాంకు (పిఎన్‌బి) 7.12 శాతం వృద్ధితో రూ.246.51 కోట్ల లాభాలు సాధించింది. గతేడాది ఫిబ్రవరిలో ఈ బ్యాంకుకు నీరవ్ మోడీ రూ.13,000 కోట్ల పైగా ఎగ్గొట్టిన తర్వాత తొలిసారి లాభపడినట్టయ్యింది. 2017-18 ఇదే క్యూ3లో రూ.230.11 కోట్ల లాభాలు నమోదు చేసింది. కాగా 2018-19 సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో ఏకంగా రూ.4,532.35 కోట్ల నష్టాలు చవి చూసింది. 2018-19 క్యూ3లో మొండి బాకీల కోసం కేటాయింపులు ఏడాదికే డాదికి 38.35 శాతం.. త్రైమాసికానికి త్రైమాసికానికి 71.78 శాతం చొప్పున తగ్గి రూ.2,753.84 కోట్లుగా నమోదయ్యాయి. ఇదే సమయం లో బ్యాంకు స్థూల నిరర్ధక ఆస్తులు 16.33 శాతానికి తగ్గాయి. 2017- 18 ఇదే క్యూ3లో 12.11 శాతంగా జీఎన్‌పీఏ నమోదయ్యింది. ఈ సమయంలో 8.90 శాతంగా ఉన్న నికర నిరర్ధక ఆస్తులు.. క్రితం క్యూ3లో 8.22 శాతానికి తగ్గాయి. మంగళవారం బీఎస్ఈలో పీఎన్‌బీ షేర్ ఇంట్రా ట్రేడింగ్‌లో కొనుగోళ్ల మద్దతుతో ఏకంగా రూ.76.50 గరిష్ట స్థాయిని తాకింది. తుదకు 0.55 శాతం పెరిగి రూ.73.55 వద్ద ముగిసింది.

క్రితం క్యూ3లో బ్యాంకు మొత్తం ఆదాయం రూ.14,854.24 కోట్లకు తగ్గింది. 2017-18 ఇదే క్యూ3లో రూ.15,257.5 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సాధ్యమైనంత వరకు రికవరీ పెంచడంతో తిరిగి పుంజుకున్నామని పీఎన్‌బీ సీఈఓ, ఎండీ సునీల్ మెహతా పేర్కొన్నారు. క్రితం మూడు త్రైమాసికాల్లో రూ.16,608 కోట్లు రికవరీ చేయగలిగామన్నారు. క్రితం ఆర్థిక సంవత్సరం రికవరీలతో పోల్చితే మూడు రెట్లు ఎక్కువని అన్నారు. నీరవ్ మోడీ మోసంలో 100 శాతం కేటాయింపులు పూర్తి అయ్యాయన్నారు. గతేడాది ఫిబ్రవరిలో నీరవ్ మోడీ కుంభకోణం బయటికి రావడంతో ఈ బ్యాంకు లాభాలకు భారీగా గండి కొట్టిన విషయం తెలిసిందే.

బీమా తప్పుడు హామీలపై క్యాంపెయిన్

- భారతీ ఆక్సా సీఈఓ

న్యూఢిల్లీ: వినియోగదారుల ను తప్పుదోవ పట్టించి అనవసర బీమా పాలసీలను అంటగడితే మోసం చేసినట్లేనని భారతీ ఆక్సా లైఫ్ ఇన్సూరెన్స్ పేర్కొంది. తప్పుడు విక్రయాలు, మోసపూరిత కాలర్స్, మోసగాళ్లకు వ్యతిరేకంగా తమ సంస్థ దేశ వ్యాప్త క్యాంపెయిన్ ప్రారంభించినట్టు ఆ సంస్థ సీఈఓ వికాస్ సేత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో మోసగాళ్ల తప్పుడు హామీలు, బోగస్ ఆఫర్లపై బీమా కొనుగోలుదారులను అప్రమత్తం చేయనున్నామన్నారు. అదే విధంగా మోసం చేసిన వారిపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నామన్నారు. బీమా నియమ, నిబంధనలను తక్షణమే సమీక్షించుకోవడంతో పాలసీదారులకు సాయపడనున్నామన్నారు. బీమా కొనుగోలుదారుల ప్రయోజనార్థం పని చేసేలా విక్రయ సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు.

కార్పొరేట్ల ఖాతాలో..
అప్పులు మరో 3.5 లక్షల కోట్లు

2020 సెప్టెంబర్ నాటికి అదనం

- ఇది వరకే రూ.14 లక్షల కోట్ల కుప్ప
- బ్యాంకులపై తీవ్ర ఒత్తిడి
- ఇండియా రేటింగ్స్ రిపోర్టు..



న్యూఢిల్లీ : భారత బ్యాంకింగ్ రంగానికి కార్పొరేట్ల మొండి బాకీలు ఉరితాళ్లలా మారుతున్నాయి. బడా పారిశ్రామిక వర్గాలకు ఇచ్చిన అప్పుల్లో మరో రూ.3.5 లక్షల కోట్లు నిరర్ధక ఆస్తులుగా మారనున్నాయని ఓ రిపోర్టు హెచ్చరించింది. కార్పొరేట్లకు ఇచ్చిన మొత్తం అప్పుల్లో 40 శాతం రాని బాకీలుగా మారొచ్చని అంచనా వేసింది. బడా బాబులకు ఇచ్చిన మొత్తం 19.3 శాతం అప్పుల్లో మరో 3.9 శాతం రుణాలు రాని బాకీల ఖాతాల్లోకి చేరొచ్చని ఇండియా రేటింగ్స్ ఫైనాన్సియల్ ఇన్స్‌ట్యూషన్స్ అండ్ బ్యాంకింగ్ అసోసియేట్ డైరెక్టర్ జిందాల్ హరినా విశ్లేషించారు. బ్యాంకు రుణ పుస్తకాల్లో ఇప్పటికీ వీటిని గుర్తించలేదన్నారు. 2019-20 ద్వితీయార్థంలో కొత్తగా రూ.1.5-2 లక్షల కోట్లు మొండి బాకీలుగా మారొచ్చన్నారు. సెప్టెంబర్ 2018 నాటికి రూ.13.5-14 లక్షల కోట్ల కార్పొరేట్ల నుంచి రాని బాకీలు ఉన్నాయని, అయితే ఇందులో రూ.10 లక్షల కోట్లను మాత్రమే బ్యాంకులు గుర్తించాయన్నారు. కాగా ఈ రూ.1.5-2 లక్షల మొండి బాకీల కోసం బ్యాంకులు రూ.40,000 కోట్ల కేటాయింపులు చేయాల్సి రావొచ్చని జిందాల్ తెలిపారు. పెద్ద ప్రయివేటు బ్యాంకుల రేటింగ్ స్థిరంగా ఉండొచ్చని ఈ ఎజెన్సీ అంచనా వేసింది. అదే విధంగా ప్రభుత్వ రంగంలోని 19 బ్యాంకుల్లో స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా, బ్యాంకు ఆఫ్ బరోడా ప్రతికూల రేటింగ్ నుంచి బయటపడొచ్చని పేర్కొంది. 2019-20లో కార్పొరేట్ల ఆస్తుల కోసం చేసే కేటాయింపులు, పరిష్కారాలను బట్టి ఆ బ్యాంకుల స్థిరత్వం ఆధారపడనుందని పేర్కొంది. ఎన్‌సీఎల్‌టీ ఉన్న రూ.4.50 లక్షల కోట్ల విలువ చేసే అతిపెద్ద 40 మొండి బాకీల ఆస్తుల కోసం బ్యాంకులు 70-75 శాతం కేటాయింపులు చేయాల్సిన పరిస్థితి రావొచ్చని ఈ రిపోర్టు పేర్కొంది. 2018-19, 2019-20లో పరిష్కారం, లిక్విడేషన్ అంశాలపై ఆధారపడి బ్యాంకుల రుణ వ్యయం నమోదు కానుంది. 2017-18, 2018-19లో కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ బ్యాంకులకు అందించే రూ.1.94 లక్షల కోట్ల మూలధనం కేవలం కార్పొరేట్ల ఎన్‌పిఎల కోసం కేటాయింపులు చేయడానికి సరిపోతుందని ఈ ఎజెన్సీ పేర్కొంది.

పీఎస్‌బీలకు రూ.60వేల కోట్లు..

2018-19 నాలుగో త్రైమాసికంలో రూ.66,000 కోట్ల మూలధనం అవసరమని ఈ ఎజెన్సీ పేర్కొంది. ప్రస్తుత, వచ్చే ఆర్థిక సంవత్సరాల్లో రుణల జారీలో 10-11 శాతం వృద్ధి నమోదు కావచ్చొని అంచనా వేసింది. ప్రభుత్వం అందించే మూలధనం కూడా ఏమాత్రం సరిపోదని పేర్కొంది. 2019-20లో చాలా వరకు ప్రభుత్వ రంగ బ్యాంకులు లాభాల్లోకి రావొచ్చని అంచనా వేసింది. డిపాజిట్లలో తీవ్ర పోటీ ఉండొచ్చని.. వీటిలో 6 శాతం వృద్ధి మాత్రమే నమోదయ్యే అవకాశాలున్నాయని తెలిపింది.

ఒత్తిడిలో ఎన్‌బీఎఫ్‌సీలు..


ఎన్‌బీఎఫ్‌సీలపై ఇండియా రేటింగ్స్ మరో రిపోర్టును వెల్లడించింది. 2019-20లో బ్యాంకింగేతర విత్త సంస్థల (ఎన్‌బీఎఫ్‌సీ) రాబడిలో ఒత్తిడి కొనసాగొచ్చని విశ్లేషించింది. ఆటో, రియల్ ఎస్టేట్ రంగాల లావాదేవీల్లో తగ్గుదల చోటు చేసుకోవడం ద్వారా ఎన్‌బీఎఫ్‌సీలపై మరింత తీవ్ర ప్రభావం పడొచ్చని తెలిపింది. కాగా ఎంఎస్ఎంఇ రుణాల్లోనూ తగ్గుదల చోటుచేసుకోనుందని అంచనా వేసింది. ఈ రంగం రుణాలు ప్రతికూలత నుంచి స్థిరత్వానికి చేరొచ్చని పేర్కొంది. ఇది వరకు ప్రభుత్వం చేపట్టిన నోట్ల రద్దు, వస్తు సేవల పన్ను (జీఎస్టీ) వల్ల ఇంకా ఎగవేతల పర్వం కొనసాగుతుందని ఇండియా రేటింగ్స్ విశ్లేషించింది.

ఫ్లిప్‌కార్ట్ నుంచి వాల్‌మార్ట్ వైదొలగాలి..!

- లాభాలు రాకపోతే ఆలోచించాలి: మోర్గాన్ స్టాన్లే సూచన

న్యూఢిల్లీ : ఫ్లిప్‌కార్ట్‌లో లాభాలు రాకపోతే వాల్‌మార్ట్ వైదొలగడమే మంచిదని ప్రముఖ ఫైనాన్షియల్ సర్వీసెస్ సంస్థ మోర్గాన్‌స్టాన్లీ సూచించింది. కొత్తగా అమల్లోకి వచ్చిన నిబంధనలకు అనుగుణంగా తన వ్యూహాన్ని మార్చుకొని వాల్‌మార్ట్ భారత్‌లో కొనసాగొచ్చని పేర్కొంది. అయితే కొత్త నిబంధనలు ఫ్లిప్‌కార్ట్, అమెజాన్‌లను విక్రయాలను దెబ్బతీస్తాయని అంచనా వేసింది. గతంలో ఈ రెండు సంస్థలు భారీ ఎత్తున పోటాపోటీగా డిస్కౌంట్‌లో వస్తువులను విక్రయించేవి. భారత్‌లో కొత్తగా అమల్లోకి వచ్చిన ఇకామర్స్ నిబంధనలు వ్యాపారాన్ని కష్టంగా మార్చే అవకాశం ఉందని ఇది వరకు రిపోర్టులు వచ్చాయి. అసెసింగ్ ఫ్లిప్‌కార్ట్ రిస్క్ టు డబ్ల్యుఎంటి ఇపిఎస్ అనే నివేదికలో ఈ విషయాన్ని వెల్లడించింది. 2017 మేలో వాల్‌మార్ట్ కంపెనీ దాదాపు 16 బిలియన్ డాలర్లు (దాదాపుగా రూ.లక్ష కోట్లు) వెచ్చించి ఫ్లిప్‌కార్ట్‌లో 77శాతం వాటా కొనుగోలు చేసింది. ఈ ఒప్పందంతో వాల్‌మార్ట్ భారతీయ మార్కెట్లో నేరుగా అమెజాన్‌తో పోటీకి దిగినట్లయ్యింది. చైనాలో వ్యాపారం లాభదాయకంగా లేదని 2017లో అమెజాన్ అక్కడి వ్యాపారం నుంచి వైదొలిగింది.

ద్రవ్యలోటు టార్గెట్ అసాధ్యం



న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం తన లక్ష్యంగా నిర్దేశించుకున్న ద్రవ్యలోటు పరిమితిని కట్టడి చేయడంలో వరుసగా రెండు ఆర్థిక సంవత్సరాల్లోనూ విఫలమవుతుందని మూడీస్ ఇన్వెస్టర్స్ సర్వీస్ అంచనా వేసింది. దీంతో, పరపతి దెబ్బతింటుందని మూడీస్ తెలిపింది. మోడీ ప్రభుత్వం ద్రవ్యలోటును 3.4 శాతానికే పరిమితం చేయాలని టార్గెట్‌గా పెట్టుకున్న విషయం తెలిసిందే. అయితే, సార్వత్రిక ఎన్నికల ముందు ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రైతులకు ఆర్థిక మద్దతు, మధ్యతరగతి ఉద్యోగులకు ఆదాయం పన్ను పరిమితిని పెంచడంసహా ఇతరులకు ప్రకటించిన పలు రాయితీల వల్ల ద్రవ్యలోటును కట్టడి చేయడం సాధ్యం కాదని మూడీస్ అంచనా వేసింది. మార్చి31తో ముగిసే 2019, 2020ల్లో ద్రవ్యలోటు 3.4 శాతానికి అధికంగానే నమోదు కానున్నట్టు అమెరికాకు చెందిన రేటింగ్ సంస్థ మూడీస్ తన నివేదికను మంగళవారం వెల్లడించింది.

ప్రభుత్వరంగ బ్యాంకులకు మూలధన మద్దతుపై స్పష్టమైన ప్రణాళిక బడ్జెట్‌లో లేకపోవడాన్ని మూడీస్ గుర్తు చేసింది. ఇది పరపతిపై వ్యతిరేక ప్రభావం చూపుతుందని తెలిపింది. బడ్జెట్‌లో స్థిరాస్తి రంగానికి అనుకూలంగా, ప్రభుత్వరంగ చమురు, గ్యాస్ కంపెనీలకు ప్రతికూలంగా ప్రతిపాదనలు చేయడాన్ని మూడీస్ తన నివేదికలో ప్రస్తావించింది. దీంతో, స్థిరాస్తులకు డిమాండ్ పెరుగుతుందని మూడీస్ అంచనా వేసింది. అయితే, రైతుల ఆదాయం పెంపు, మధ్యతరగతి వర్గీయులకు పన్ను రాయితీ ప్రతిపాదనల వల్ల భారత ఆస్తుల రక్షణలు(ఏబీఎస్‌లు),గృహ రుణాల రక్షణల(ఆర్ఎంబీఎస్‌ల) విషయంలో సానుకూల ప్రభావముంటుందని మూడీస్ తెలిపింది. ఈ చర్యలు రుణ ఎగవేతలను తగ్గిస్తాయని తెలిపింది.

మోడీనే మళ్లీ ప్రధాని

- కేంద్రం కారణంగానే తెలంగాణ అభివృద్ధి
- వారంలోనే కాళేశ్వరానికి అనుమతులిచ్చాం
- అభివృద్ధిలో రాజకీయాలు చేయం
- అవినీతి లేని పాలన గనుకే ప్రతిపక్షాల దుష్ప్రచారం : నితిన్‌గడ్కరీ



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

నరేంద్రమోడీనే మళ్లీ దేశ ప్రధాని అవుతారని కేంద్ర రోడ్లు-భవనాలు, ట్రాన్స్‌పోర్ట్ శాఖ మంత్రి నితిన్‌గడ్కరీ అన్నారు. కార్యకర్తలు ఉత్సాహంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కేంద్రం సహకారంతోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమైందని, నిధులు ఇవ్వలేదని చెప్పటం సరికాదన్నారు. పార్లమెంట్ ఎన్నికలకు పార్టీ శ్రేణులను సమాయత్తం చేయడంలో భాగంగా హైదరాబాద్‌లో మంగళవారం జరిగిన సికింద్రాబాద్, మల్కాజిగిరి, హైదరాబాద్ లోక్‌సభ నియోజకవర్గాల క్లస్టర్ సమావేశంలో శక్తి కేంద్రాల ఇన్‌ఛార్జీలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. మోడీ వస్తే ముస్లింలను పాక్ పంపుతారని అసత్య ప్రచారం చేశారని, దళితుల్లో, ఆదివాసీల్లో బీజేపీ మీద ద్వేషం పెంచే ప్రయత్నం చేశారని విమర్శించారు. రాజు, ప్రభుత్వం, పరిపాలన సెక్యులర్‌గా ఉండొచ్చుగానీ వ్యక్తి ఎప్పుడూ సెక్యులర్ కాలేడన్నారు. ఈ ఐదేండ్ల కాలంలో దేశంలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలని సూచించారు. అభివద్ధి విషయంలో రాజకీయాలు చేయబోమన్నారు. డీపీఆర్ లేకున్నా.. నీటి సమస్య పరిష్కారం కోసం కాళేశ్వరం ప్రాజెక్టుకు వారం రోజుల్లో అనుమతులిచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని పోలవరం ప్రాజెక్టుకు 100 శాతం నిధులను కేంద్రమే ఇచ్చిందని వెల్లడించారు. హిమాలయాలకు దూరంగా ఉన్న రాష్ట్రాల్లో నీటి సమస్యను పరిష్కరించేందుకు ప్రధాని సించాయ్ యోజనలో కర్నాటక, తెలంగాణ, ఆంధ్ర, మహారాష్ట్రలో 99 ప్రాజెక్టులకు అనుమతిచ్చామన్నారు. 66 ప్రాజెక్టులు ఈ జూన్‌లో ప్రారంభం కాబోతున్నాయని తెలిపారు. 45 టీఎంసీల నీళ్ల విషయంలో నల్లా దగ్గర మహిళలు పంచాయితీ పెట్టుకున్నట్టు తెలంగాణ, ఏపీ రాష్ట్రాల సెక్రటరీలు, మంత్రులు జగడం పెట్టుకోవడం చూసామన్నారు. వేల కోట్ల రూపాయల రోడ్ల, ప్రాజెక్టుల నిర్మాణంలో ఒక్క రూపాయి అవినీతి కూడా జరగలేదన్నారు. తమ ప్రభుత్వం చేసిన అభివద్ధిని ప్రశ్నించలేక ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయని ఆరోపించారు. మోడీకి వ్యతిరేకంగా కాంగ్రెస్‌తో బాబు జతకట్టడాన్ని తప్పుబట్టారు. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి పీ మురళీధరరావు మాట్లాడుతూ..కేంద్ర సంక్షేమ పథకాలు అందరికీ అందుతున్నాయని, మళ్లీ మోడీ ప్రధాని అవుతారని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్ర అధ్యక్షులు కె. లక్ష్మణ్ మాట్లాడుతూ అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలకు చాలా తేడా ఉంటుందన్నారు. చింతా సాంబమూర్తి అధ్యక్షతన జరిగిన క్లస్టర్ సమావేశంలో ఎంపీ బండారు దత్తాత్రేయ, ఎమ్మెల్సీ ఎన్ రాంచందర్ రావు, జి.కిషన్‌రెడ్డి, మంత్రి శ్రీనివాస్, సౌదాన్ సింగ్ ఎన్వీ ఎస్ ఎస్ ప్రభాకర్, చింతల రాంచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తప్పెవరిది?

అమెరికాదా? విద్యార్థులదా?

- లేని వర్సిటీని క్రియేట్ చేయడం సరికాదు
- భారతీయ విద్యార్థుల అరెస్టుపై భిన్నాభిప్రాయాలు
- వివరాలు తెలుసుకున్నాకే వెళ్లాలని సూచన
- విదేశాలకు వెళ్లే విద్యార్థులపై ప్రభుత్వాలు దృష్టి సారించాలి



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి

దొంగలు పడి ఇంటిని దోచుకోవడం వేరు. దొంగలే ఇంట్లోకి అడుగుపెట్టేలా అన్నివిధాల సహకరించి దొంగలు పడ్డారంటూ అరిచి వారిదే మొత్తం తప్పు అంటే ఎలా? దొంగతనానికి పాల్పడిన వారిది ఎంత తప్పు ఉందో..అందుకు సహకరించిన వారూ శిక్షార్హులే. ఇలాంటి వాటికి ప్రోత్సహించడమంటే తప్పుడు మార్గంలోకి వెళ్లమని చెప్పడమే కదా!. ఇటీవల అమెరికాలో విదేశీ విద్యార్థుల అరెస్టు వ్యవహారాన్ని పరిశీలించినప్పుడు భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. పూర్తి విషయాలు తెలుసుకుని వెళ్లితే విద్యార్థులకు ఇంతటి అవమానకరమైన పరిస్థితులు ఎదురయ్యేది కాదని కొంతమంది చెప్పగా, తప్పుడు మార్గంలో వెళ్లేలా ఆశలు కల్పించి విద్యార్థులదే తప్పు అనడం సరికాదని మరికొందరు అభిప్రాయపడ్డారు. తప్పు రెండువైపులా ఉందనీ, అక్రమ వలసదారులు వస్తారని చెప్పి, వారికోసం ఓ ఫేక్ యూనివర్సిటీని ఏర్పాటు చేయడమే తెలివితక్కువ వ్యవహారమని తెలుస్తోంది. నకిలీ పత్రాలు సృష్టించి అడుగుపెట్టినవారిని గుర్తించి అరెస్టు చేయాలి తప్ప దానికి అవకాశం కల్పించి ఇప్పుడు అరెస్టు చేసి వెనక్కిపంపడం వల్ల వారి చదువులు మధ్యలో ఆగిపోవాల్సిందేనా? వీసా కోసం, సీటు కోసం లక్షల రూపాయలు చెల్లించారని, ఆ డబ్బులు ఎవరు తిరిగిస్తారు? అని పలువురు ప్రశ్నిస్తున్నారు. సునాయాసంగా డబ్బు సంపాదించొచ్చని అమెరికా వెళ్లడం కోసం ఏజెంట్లు ఇస్తున్న ఆఫర్ల ఉచ్చులో పడి విద్యార్థులు మోసపోవద్దని విద్యావేత్తలు సూచిస్తున్నారు.

అమెరికాలో అక్రమ వలసదారుల అరెస్టు వ్యవహారం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో తీవ్ర కలకలం రేపిన విషయం తెలిసిందే. విదేశీయులు నకిలీ యూనివర్సిటీల్లో చేరి అమెరికాలో నివాసం ఉండటం కొత్త కాదు. గతంలో చాలాసార్లు ఇలాంటి ఘటనలు బయటపడ్డాయి. అమెరికాలో అక్రమ వలసదారుల సంఖ్య పెరిగిందంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆంక్షలు విధించారు. అక్రమంగా ప్రవేశిస్తున్న వారిని పట్టుకుని వారిని వెనక్కిపంపించాలని అధికారులను ఆదేశించారు. అమెరికాలో నిరుద్యోగం పెరగడంతో యువత ఆందోళనలో ఉంది. తమ యువతకు ఉపాధి దొరక్కపోవడానికి అక్రమ వలసదారులే కారణమని ట్రంప్ అనేక సందర్భాల్లో వ్యక్తం చేశారు. హెచ్1బీ వీసాల విషయంలోనూ కఠినతరం చేయడానికి సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో విదేశీ విద్యార్థుల గుట్టు రట్టు చేయడానికి డీహెచ్ఎస్ స్టింగ్ ఆపరేషన్ చేపట్టింది. అక్రమంగా నివాసం ఉంటున్న వారిని తెలిగ్గా పట్టుకునేందుకు వర్సిటీ వ్యూహాన్ని అమలుచేసింది. ఇందులో భాగంగా 2017 ఫిబ్రవరిలో మిషిగన్ రాష్ట్రంలో యూనివర్సిటీ ఆఫ్ ఫార్మింగ్టన్‌ను ప్రారంభిస్తున్నట్టు ప్రకటనలు ఇచ్చింది. న్యూజెర్సీలో 2015లో మూతపడ్డ ఫార్మింగ్టన్ వర్సిటీ పేరిట డీహెచ్ఎస్ కోర్సులు ఆఫర్ చేసింది. విద్యార్థి వీసా గడువు ముగిసిన, ముగిసే దశలో ఉన్న దాదాపు 600 మంది విద్యార్థులు డీహెచ్ఎస్ వలలో పడ్డారు. అందులో అత్యధికమంది భారతీయులు ఉన్నారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన 139 మంది ఉన్నట్టు పత్రికల ద్వారా వెల్లడైంది. అమెరికాలో ఉన్న తెలుగు సంఘాల ద్వారా కొంతమంది విడుదలై హైదరాబాద్‌కు తిరిగొచ్చారు. మరికొంతమంది రావాల్సి ఉంది. గతంలోనూ ఇలాగే కొంతమంది విదేశీ విద్యార్థులను అరెస్టు చేసి వెనక్కి పంపినట్టు తెలుగుసంఘాల అసోసియేషన్లు గుర్తు చేశాయి.

ప్రస్తుత వ్యవహారంలో అధికారులతో అన్ని ఒప్పందాలు చేసుకున్నాకే విద్యార్థులను యూనివర్సిటీలో చేర్పించామని, వారికి కొంత నగదు కూడా చెల్లించామని మధ్యవర్తులు చెప్పడం గమనార్హం. అక్రమ వలసదారులను గుర్తించడం కోసం యూనివర్సిటీని క్రియేట్ చేసి, మధ్యవర్తులతో మాట్లాడుకుని నకిలీ పత్రాలతో విదేశీ విద్యార్థులను చేర్చుకోవడం ఎంతవరకు సమంజసమని పలువురు ప్రశ్నిస్తున్నారు. గతంలో తప్పుడు సర్టిఫికెట్లు సమర్పించినా అవకాశం కల్పించడంతో దాని ఆధారంగా మరికొంతమంది అదే మార్గాన్ని ఆశ్రయించారని తెలుస్తోంది. అమెరికా వెళితే డబ్బు బాగా సంపాదించొచ్చన్న ప్రచారంతో అప్పులు చేసి కొంతమంది వెళ్లడానికి సిద్ధమవుతున్నారు. చదువుకుంటూ ఉద్యోగం చేయొచ్చని మధ్యవర్తులు మాటలు నమ్ముతున్నారని యూనివర్సిటీ ప్రొఫెసర్ తెలిపారు. ఇందులో గత, ప్రస్తుత ప్రభుత్వాల వైఫల్యాలు ఉన్నాయని, టెక్నాలజీ పేరుతో ఆశలు కల్పించడం కూడా ఒక భాగమని అన్నారు. వాస్తవానికి అమెరికా విశ్వవిద్యాలయాల్లో ప్రవేశం పొందాలంటే జీఆర్ఈ, టోఫెల్ లాంటి ప్రామాణిక పరీక్షల్లో మంచి స్కోరు సాధిస్తే ఏజెంట్ల మోజులో పడాల్సిన అవసరమే ఉండదు. ఇందులో నెగ్గడం కష్టమని భావించినవారే నేరుగా ప్రవేశం కల్పించే విద్యాసంస్థల్లో డబ్బు చెల్లించి కళ్లు మూసుకుని చేరిపోతున్నారు. మనదేశంలోనూ చాలా సంస్థలు ప్రభుత్వ అనుమతి లేకపోయినా బ్రహ్మాండంగా ప్రచారం చేసుకుంటాయని, వాటిల్లో చేరిన విద్యార్థుల పరిస్థితి కళ్లెదుటే ఉందని పలువురు అధ్యాపకులు గుర్తు చేశారు. హైదరాబాద్‌లో అనుమతి లేని ఇంటర్ కాలేజీలో చేరడం వల్ల 200 మంది విద్యార్థులు ఒక సంవత్సరం విద్యాసంవత్సరం కోల్పోవల్సి వచ్చిందన్నారు. అమెరికాలోనూ చిన్న గదిలో విద్యాసంస్థను ఆరంభించి అడ్మిషన్లకు ప్రకటనలు ఇచ్చే సంస్థలు చాలా ఉన్నాయి. ఇలాంటి సంస్థలకు జీఆర్ఈ, టోఫెల్ లాంటివాటితో పనిలేదనీ, వాటిలో కోర్సులు సరిగా ఉండవు. ఇలాంటి తక్కువ స్థాయి విద్యాసంస్థల చేరితే ఎక్కడోచోట పట్టుబడకతప్పదన్నారు. ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ తీసుకుని విదేశాలకు వెళ్తున్న విద్యార్థులు మధ్యవర్తుల మాయలో పడకుండా జాగ్రత్తలు పాటించేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. విదేశాలకు వెళ్లే విద్యార్థులు ఏ యూనివర్సిటీలో చేరుతున్నది, దానికి గుర్తింపు ఉన్నదీ లేనిదీ తెలుసుకున్న తర్వాతే అనుమతి ఇస్తే బాగుంటుందన్నారు.

తగ్గుతున్న ప్రత్యక్ష పన్ను వసూళ్లు

తేడా రూ.65వేల కోట్లు !

- ద్రవ్యలోటు మరింత పెరగొచ్చు : ఆర్థిక విశ్లేషకులు



న్యూఢిల్లీ : ముందు ముందు ప్రత్యక్ష పన్నుల ఆదాయం పెరుగుతుందని...మధ్యంతర బడ్జెట్‌లో చూపిన అంకెలు వాస్తవానికి దూరంగా ఉన్నాయని ఆర్థిక విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. సవరించిన అంచనాల ప్రకారం, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మొత్తంగా పన్ను ఆదాయంలో భారీ తేడా కనపడుతోందనీ, దాదాపు రూ.65వేల కోట్లు తక్కువగా వచ్చే సూచనలు కనపబడుతున్నాయనీ ఆర్థిక నిపుణులు విశ్లేషించారు. దీనికి కారణం ప్రత్యక్ష పన్ను ఆదాయం పడిపోవటమే కారణమని వారు చెబుతున్నారు.

రాబోయే ఆర్థిక సంవత్సరంలో కార్పొరేట్ పన్ను వసూళ్లు 17.5శాతం, వ్యక్తిగత ఆదాయ పన్ను వసూళ్లు 27శాతం పెరుగుతాయనీ మధ్యంతర బడ్జెట్‌లో మోడీ సర్కార్ అంచనావేసింది. తద్వారా మొత్తం జీడీపీలో ప్రత్యక్ష పన్నుల రాబడి 6.3 శాతానికి చేరుకుంటుందనీ, ఇది గత 11ఏండ్లలోనే గరిష్టమని ప్రకటించింది. అయితే పన్ను ఆదాయాన్ని చూపటంలో కేంద్రం అంకెలతో గారడీ చేసిందని విశ్లేషకులు చెబుతున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సవరించిన గణాంకాల్ని పరిశీలిస్తే పన్ను ఆదాయం తగ్గుతుందనీ, తద్వారా ద్రవ్యలోటు 3.4శాతానికి పరిమితం చేయటం గగనమనీ వారు చెప్పారు.

సహజంగా ప్రతీ ఆర్థిక సంవత్సరంలో మొదటి 9 నెలల కాలంలో ప్రత్యక్ష పన్నుల్లో 65శాతం వసూలు అవుతాయి. మిగతాది ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో వసూలు అవుతుంది. దీని ప్రకారం ఆర్థిక సంవత్సరం 2019క్యూ4లో వ్యక్తిగత పన్ను ఆదాయ వసూళ్లు రూ.1,85,150కోట్లు ఉంటుందని విశ్లేషకులు అంచనా వేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సవరించిన అంచనాలతో పోల్చితే రూ.52వేల కోట్లు తక్కువ వసూలు ఉంటాయని తేలింది. అలాగే కార్పొరేట్ పన్నులోనూ రూ.13వేల కోట్లు తక్కువ రానుంది. మొత్తంగా రూ.65వేల కోట్లు ప్రత్యక్ష పన్ను వసూళ్లు తగ్గే సూచన కనబడుతోంది. పన్ను వసూళ్లకు సంబంధించి 'కంట్రోలర్ జనరల్ అకౌంట్స్' సోమవారం తాజా సమాచారం విడుదల చేసింది. ఈ సమాచారంపై 'ఇండియా రేటింగ్స్, రీసెర్చ్' చీఫ్ ఎకనామిస్ట్ దేవేంద్ర కుమార్ పంత్ మాట్లాడుతూ, ప్రత్యక్ష పన్ను వసూళ్లపై ఒత్తిడి పెరుగుతోందనీ, జనవరి-మార్చి 2019లో పన్ను వసూళ్లలో లక్ష్యాన్ని సాధించటం సాధ్యమయ్యే పనికాదనీ అభిప్రాయపడ్డారు.

అసాంఘిక శక్తులపై డేగ కన్నేయాలి

- లోక్‌సభ ఎన్నికల బందోబస్తుపై దక్షిణాది రాష్ట్రాల డీజీపీల నిర్ణయం

నవ తెలంగాణ- ప్రత్యేక ప్రతినిధి

శాంతి భద్రతలకు విఘాతం కలిగించే అసాంఘిక శక్తుల కదలికలపై అప్రమత్తంగా ఉండాలని, ఒకరికొకరు సమాచారాన్ని అందించుకోవాలని దక్షిణాది రాష్ట్రాల డీజీపీల సమావేశం నిర్ణయించింది. లోక్‌సభ ఎన్నికల బందోబస్తుకు సంబంధించి మంగళవారం తిరుపతిలో దక్షిణాది రాష్ట్రాల డీజీపీల సమన్వయ సమావేశం జరిగింది. ఆంధ్రప్రదేశ్ డీజీపీ ఆర్‌పి సింగ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి రాష్ట్రంతో పాటు ఛత్తీస్‌గఢ్, ఒడిషా, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల హోం సెక్రెటరీలు, డీజీపీలు, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు. త్వరలో లోక్‌సభ ఎన్నికలు రాబోతున్న నేపథ్యంలో తమ రాష్ట్రాల పోలీసు వ్యవస్థల మధ్య మరింతగా సమన్వయం కావాలని, ముఖ్యంగా ఎన్నికలు ప్రశాంతంగా జరిపేందుకు అవసరమైన చర్యలన్నింటినీ తీసుకోవాలని డీజీపీలు నిర్ణయించారు. ఇందుకు అంతరాష్ట్ర నేరస్తుల సమాచారాన్ని, ఇచ్చిపుచ్చుకోవాలని డీజీపీలు అభిప్రాయపడ్డారు. ఇంటెలిజెన్స్ విభాగాల మధ్య కో ఆర్డినేషన్‌ను పెంచి వామపక్ష తీవ్రవాదులు, ఐఎస్ఐ దాని ప్రేరేపిత ఉగ్రవాదుల కదలికల గురించి ఎప్పటికప్పుడు అలర్ట్‌గా వ్యవహరించాలని కూడా నిర్ణయించారు. బలగాలను కూడా అవసరమైన మేరకు ఒక రాష్ట్రం మరో రాష్ట్రంతో సహకరించుకోవాలని సమావేశాన్ని ముగించారు. ఈ సమావేశానికి రాష్ట్రం నుంచి హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ రాజీవ్ త్రివేది, డీజీపీ ఎం.మహేందర్‌రెడ్డి, అదనపు డీజీ జితేందర్ తదితర ఉన్నతాధికారులు హాజరయ్యారు.



ఆహ్లాదకరమైన సముద్ర తీరాలు, అందులో కొలువై ఉన్న వేలాది అద్భుత దీవులు.. ఆకర్షణీయమైన పర్వత పంక్తులు. చుట్టూ ఎన్నో వింతైన జీవరాసులు. ఒక్కటేమిటీ ఎటువైపు చూసినా కనుచూపుమేర అందాలతో ఒక కొత్త లోకంలో విహరించే అనుభూతిని కలిగిస్తుంది ఫిలిప్పీన్స్.

చూడ చక్కని దేశం ఫిలిప్పీన్స్...




"ఒక వ్యక్తి ఫిలిప్పీన్స్ అందాలు వీక్షించేందుకు 30 సార్లు వెళ్లి వచ్చాను" అని చెబుతుంటే వినడానికి కాస్త అతిశయోక్తిగా అనిపించింది. కానీ తీరా ఆ దేశాన్ని పర్యటించి వచ్చాక అనిపించింది నాకు 30 ఏంటీ మూడు వందల సార్లు వెళ్లివచ్చినా తనివి తీరదేమో అని. ఇటీవల ఆ దేశాన్ని పర్యటించినప్పుడు మాకు కలిగిన అనుభూతుల సమాహారమే ఈ ఫిలిప్పీన్స్ యాత్ర. మేం హైదరాబాదు నుండి మలేషియాకు, మలేషియా నుండి మనీలాకు టికెట్స్ బుక్ చేసుకున్నాం. మనీలాకు హైదరాబాద్ నుండి రాత్రి 8.30 కు బయలుదేరి ఉదయం 7.30 కి మలేషియాలో ఉన్నాం. అక్కడి నుండి మనీలాకు చేరుకునే వరకూ రాత్రి ఎనిమిది గంటలు అయ్యింది. అంటే మొత్తంగా 24 గంటల ప్రయాణం. వాస్తవానికి ఇండియా నుండి మనీలాకు చేరుకోవడానికి అంత సమయం పట్టదు కానీ మా ఫ్లైట్ ఒక గంట ఆలస్యంగా బయలుదేరడంతో మలేషియా నుండి మనీలాకు వెళ్లాల్సిన ఫ్లైట్ మిస్ అయ్యాం. దీంతో ఆరు గంటలు మలేషియా ఎయిర్ పోర్టులోనే ఉండిపోవాల్సి వచ్చింది.

'మనీలా' అనేది ఫిలిప్పీన్స్ రాజధాని నగరం. ఈ దేశంలో అతి పెద్ద నగరం. ఇది చాలా రద్దీగా ఉంటుంది కూడా. అత్యంత జనసాంద్రత కలిగిన నగరాల్లో ఇదొకటి. మనీలాలో ఫ్లైట్ దిగిన వెంటనే అక్కడ ఒక వాహనం మాట్లాడుకొని 'తగతై' అనే ప్లేస్‌కు బయలు దేరాం. ఇది మనీలాకు కేవలం 60 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. సాధారణంగా అయితే ఒక గంట, గంటన్నరలో ఈ ప్రాంతానికి చేరుకోవచ్చు కానీ మేం అక్కడికి చేరుకోవడానికి మూడు గంటల సమయం పట్టిందంటే అర్థం చేసుకోండి. ఎంత రద్దీ ఉందో అక్కడ.

తగతై ఊటీలాగే చల్లని ప్రదేశం...

తగతై అనే ప్లేస్ మన ఊటీ, కొడై కెనాల్ లాగా చల్లని ప్రదేశం. చాలా ఎత్తయిన కొండల మీద ఉంటుంది. అక్కడ మేం బుక్ చేసుకున్న రిసార్ట్‌కు చేరుకున్నాం. ఆ రాత్రి అక్కడే విశ్రాంతి తీసుకున్నాం. అయితే మనీలా నుండి తగతైకు ప్రయాణంలో గమనించిన ఒక ముఖ్య విషయం ఏమిటంటే. మేం ప్రయాణం చేసిన సమయం క్రిస్మస్ సీజన్ కావడంతో ఎక్కడ చూసినా క్రిస్మస్ వాతావరణ కనిపించింది. దారి పొడవునా ఇరువైపుల సీతాకోక చిలుకల్లాగా అలంకరించారు. అలా కొన్ని కిలో మీటర్లు అలంకరించి ఉంటారు. ఒక చోట సీతకోకచిలుకలు, మరో చోట పువ్వుల తోటి, ఇంకొంత దూరం పోయాక వేరే విధంగా అలంకరించారు. ఇలా అలంకరించడం ఎక్కడా చూడలేదు నేను. ఈ అలంకరాన్ని చూస్తే చాలా ఆశ్చర్యమేసింది.



మేరిలాండ్స్‌లో...

మేరిలాండ్స్‌లో ఒక ఆవిడ పరిచయమైంది. ఆవిడతో మాట్లాడుతున్న సందర్భంలో ఫిలిప్పీన్స్‌లో 'డైవర్స్ రేట్' ఎంత ఉందని అడిగాను. ఫిలిప్పీన్స్‌లో క్యాథలిక్స్ జనాభా (క్రైస్తవుల్లో సంప్రదాయ వాదులు) ఎక్కువగా ఉన్నారు కాబట్టి డైవర్స్ అనేది చాలా తక్కువగా జరుగుతుందని చెప్పింది. వివిధ దేశాలలో లాగా ఇక్కడ విడాకుల సంఖ్య ఉండదని చెప్పింది. కుటుంబ వ్యవస్థ, ఆచార వ్యవహారాలు, స్థానిక సంప్రదాయాలు ఇలా కొన్ని పోలికలు మన ఇండియాను పోలి ఉంటాయనుకోవచ్చు.

గంటకు.. నాలుగు వేలట...

మేం ఉన్న హోటల్‌కు దగ్గర్లోనే రెండు పబ్లిక్ పార్కులు ఉన్నాయి. వాస్తవానికి ఫిలిప్పీన్స్ అంటే స్వచ్ఛమైన సముద్రం, అద్భుతమైన దీవులు, అగ్ని పర్వతాలకు నెలవు. అటువంటప్పుడు అగ్ని పర్వతాలను చూడకుండా వెళితే ఎలా! ఎందుకైన మంచిదని రిసెప్షన్‌కు వెళ్లి కనుక్కుందామని అటువైపు అడుగులు వేశాను. రిసెప్షన్‌కు వెళ్లి అడిగితే వాళ్లు ఒక నాలుగు వేలు కడితే ఆ ప్రాంతాలు చూడటానికి ఒక కారు మాట్లాడతామని చెప్పారు. నాలుగు గంటల్లో ఆ ప్రాంతాలు చూపిస్తామని చెప్పారు. నాలుగు గంటల ప్రయాణానికి నాలుగు వేల రూపాయలు అంటే కాస్త ఎక్కువే అనిపించింది.

స్కై రాంచ్‌లో పిల్లలతో...!

మేం వెళుతున్న దారిలో 'స్కై రాంచ్' అనే ప్రదేశంలో ఒక పార్కు ఉంటే అక్కడ ఆగాం. పార్కు లోపలికి వెళ్లేటప్పుడు రెండు చేతులు జోడించి నమస్కరిస్తున్నట్లు ఒక పెద్ద 'హ్యాండ్ స్టాచ్యూ' ఉంది. అది వంద ఫీట్ల ఎత్తు ఉండొచ్చు. అక్కడ మేం కొన్ని ఫొటోలు దిగి పార్కులోకి వెళాం. ఆ పార్కు చిన్న పిల్లలు ఆడుకోవటానికి అనువైన ప్రదేశం. పెద్ద పార్కుల్లో ఉండేలా అన్నీ ఆట వస్తువులు ఉన్నప్పటికీ ఈ ప్రాంతానికి సంబంధించిన కొన్ని ప్రత్యేకతలు ఇక్కడ పొందు పరిచారు. ఉదాహరణకు హాట్ బెలూన్ వంటివి విహరించాలంటే ఎక్కడో ప్రాంతానికి వెళ్ళేకంటే ఇక్కడే ఉండే ఒక వీల్‌లాంటి దాంట్లో కూర్చుంటే అది ఎత్తయిన ప్రదేశానికి తీసుకెళ్లి అటువంటి అనుభూతిని కలిగిస్తుంది. అలాగే హార్స్‌రైడింగ్ వంటిది కూడా ఏర్పాటు చేశారు.

జింజర్ బ్రెడ్ ఒక ఫేరి ల్యాండ్...

పార్కు అంతా తిరిగిన తర్వాత బయటకు వచ్చి 'జింజల్ బ్రెడ్' అనే ప్రదేశానికి వెళ్లాం. ఇది ఒక పది ఎకరాలలో ఉంది. దాంట్లో ఒక పెద్ద ఇల్లు కూడా ఉంది. అది ఎలా ఉందంటే ఫేరి ల్యాండ్ లాగా ఉంది. చాలా చక్కగా కట్టారు. లోపల చిన్న చిన్న బొమ్మలను ఎంతో అందంగా అలంకరించారు. ఒక బొమ్మ దగ్గర మేం ఫొటో దిగి రెప్‌టేల్ పార్కుకు వెళ్లాం. రెప్‌టేల్ పార్కులో పెద్ద తాబేలు, డైనోసార్సు, రాక్షస బల్లులు, అరుదుగా కనిపించే జంతువులను బొమ్మలుగా చేసి పెట్టారు. అక్కడ మేం ఒక 300 అడుగుల కిందకు దిగి పార్కు అంతా చూసి మళ్లీ పైకి వచ్చాం. అక్కడి నుండి మేం ఇంకాస్త పైకి వెళ్లాం. అక్కడ వెదురు కట్టలతో ఊగుతూ కనిపించే బ్రిడ్జిని చూశాం. అది చాలా అద్భుతంగా అనిపించింది.



పజిల్ మ్యూజియం...

తర్వాత పజిల్ మ్యూజియంకు వెళ్లాం. ఆ మ్యూజియం ప్రత్యేకత ఏంటంటే ఒక ఆవిడ ఆట విడుపు కోసం పజిల్స్ తయారు చేసేదట. అట్టముక్కల్ని, చిన్న చిన్న వస్తువులతో ఆవిడ చేసిన పజిల్స్ ఆసక్తిగా అనిపించడంతో తన కుమారుడితో కలిపి వాటిని తయారు చేసేది. దాన్ని ఒక హాబీలాగా తీసుకుంది. క్రమంగా ఆసక్తి పెరగడంతో వందలు వేలు తయారు చేసే స్థాయికి చేరుకుంది. ఆవిడ చేసిన ఈ అరుదైన గుర్తింపునకుగాను గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్‌ను కూడా సాధించింది. ఇవాళ ఒక టూరిస్ట్ అట్రాక్షన్‌గా ఉన్న ఆమె ఇల్లు వందల, వేల పజిల్స్‌తో నిండి ఉంది. అందులో మోనాలిసా, ఈఫిల్ టవర్, ఏడు ప్రపంచ వింతలు, ఒక్కటేమిటీ ఎన్నో అక్కడ కొలువుతీరి ఉన్నాయి. వాటినన్నింటిని తిరిగి చూస్తున్నప్పుడు ఒక చిన్న హాబీ ఒక మనిషిని ఎంత ఎత్తుకు తీసుకెళుతుందో కదా అనిపించింది వాటిని చూశాక.

ఒకప్పటి యుద్ధ వాహనాలే నేటి జీప్‌నీస్..!

మన దేశాల్లో అయితే రవాణాకు చాలా వరకూ జీపులను వాడుతుంటారు. అలాగే ఫిలిప్పీన్స్‌లో కూడా జీపులు చాలా ఉన్నాయి. అయితే అవి మన దగ్గరిలాంటివి కాదు. అక్కడి ప్రజా రవాణాలో జీప్‌నీస్ అనే వాహనాలు విరివిగా కనబడతాయి. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో 1940లో అమెరికా సైనికులు తిరిగేందుకు ఇక్కడికి వాటిని తీసుకొచ్చారు. ఆ తర్వాత ఇతర దేశస్తులందరూ ఇలాంటి వాటినే ఉపయోగించేవారట. అయితే యుద్ధం ముగిశాక, ఫిలిప్పీన్స్ స్వాతంత్ర్యం పొందాక ఆ దేశస్తులు వదిలి వెళ్లిన జీపులన్నింటినీ కూడా అక్కడి ప్రజలు రవాణాకు అనుగుణంగా మార్చుకున్నారు. వాటిని మినీ బస్సుల్లా కూడా తయారు చేసుకున్నారు. ఈ దేశంలో ఎక్కడ చూసినా అవే కనిపిస్తాయి. మనం ఏ ప్రదేశానికి వెళ్లాలన్నా పది పేసోలు అంటే మన రూపాయల్లో 15 రూపాయలు పెడితే ఒక నాలుగు స్టాప్‌లు దూరం వరకూ వెళ్లొచ్చు.



అగ్ని పర్వతపు అంచుల్లో...

అక్కడి నుండి మేం వాల్కోనా చూడటానికి బయలు దేరాం. ఫిలిప్పీన్స్ అందమైన దీవులకు, సుందరమైన సముద్రతీరాలకు ప్రత్యేకమో! అగ్ని పర్వతాలకు కూడా అలాగే ఫేమస్. 14 మైళు ...న్న ఓ దీవిలో టౌన్లు ఐదుంటే అగ్ని పర్వతాలు మాత్రం ఏడున్నాయంటేనే అర్థం చేసుకోవచ్చు ఈ ప్రాంతం ఎటువంటిదో. ఈ ప్రాంతంలోని మౌంట్ పినాటుబో, టాల్, మేయాన్ అనే అగ్నిపర్వతాలు ఎప్పుడు విరుచుకుపడతాయో ఎవరూ చెప్పలేరు. అయినప్పటికీ ఈ ప్రాంతాలు టూరిస్టు ప్రదేశాలుగా ఇప్పటికీ ప్రజల్ని ఆకర్షిస్తూనే ఉన్నాయి. అయితే ఇక్కడ ఓ విషయం చెప్పాలి. అదేంటంటే మేం దిగిన హోటల్లో వాల్కనో చూడటానికి 25 వేల రూపాయలు అవుతాయని రాసి ఉంచారు. ఒక వాల్కోనాకు వెళడానికే 25 వేలు పెట్టి ఏం వెళతాం అనుకున్నాం. అట్లాంటిది పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు వాళ్లను కనుక్కొని ఒక వేయి రూపాయలతో వెళ్లొచ్చాం. మాతో పాటు ఒక గైడ్‌కు 500 రూపాయలు, తర్వాత పడవలో వెళుతున్నందుకు అతనికి 200, ఒక ఆటోకు 300 ఇలా మొత్తం వేయి రూపాయల్లో ఆ వాల్కోనాను చూసి వచ్చాం. పబ్లిక్ ట్రాన్స్‌పోర్టును నమ్ముకుంటే ఎంత చౌక అనిపించింది మా ట్రిప్‌లో.

సెవన్ వండర్స్ ఆఫ్ ది వరల్డ్...

ఫ్లయిట్‌లో పలవన్‌కు వచ్చాం. ఇక్కడికి ఒక గంట జర్నీ. అక్కడ దిగగానే ఒక ఏజెంట్ వచ్చి మిమ్మల్ని వరల్డ్ హెరిటేజ్ సైట్ అయిన 'సెవన్ వండర్స్ ఆఫ్ ది వరల్డ్' అన్న ప్రదేశానికి తీసుకెళతానని చెప్పాడు. అది భూగర్భంలో 7-8 కిలోమీటర్లు లోపలికి వెళ్లొచ్చు. పలవన్ నుండి ఎల్‌నీడో అనే ప్లేస్‌కు వెళ్లే దారిలో ఈ భూగర్భ గుహలను చూడటానికి తీసుకెళ్లారు. దీనికి రెండు గంటల ప్రయాణం చేసి మధ్యలో ఆగి టీ, కాఫీ తాగటానికి దించారు. అక్కడ అందరూ టీ తాగి గుహవైపునకు వెళ్లాం. ఆ గుహ అంతా అడవి ప్రాంతం. ఆ రెండు కిలోమీటర్లు పడవలో తీసుకెళ్లి అవన్నీ చూపించారు. ఒక్కొక్కటి ఒక్కో ఆకారంలో ఉన్నాయి. అవి కొన్ని ఏండ్ల నుండి నీటి చుక్క ధార ధారగా పడి అలా సాలమైట్సుగా అయ్యాయట. మేం అవన్నీ చూసి బయటకు వచ్చాం.

సీక్రెట్ ఐలాండ్...

ప్రపంచంలో చాలా చోట్ల సముద్రంలో దీవులుంటాయి. మరి కొన్ని చోట్ల సరస్సుల్లో దీవులుంటాయి. కానీ విచిత్రంగా ఫిలిప్పీన్స్‌లో మాత్రం కొండల మధ్యన దీవులున్నాయి. అందుకే దీన్ని సీక్రెట్ ఐలాండ్ అంటారు. అది ఎంత బాగుంది అంటే ఒక పెద్ద కొండకు చిన్న రంధ్రం ఉంది. దాని మీద ఎక్కి అక్కడి నుండి లోపలికి దిగితే అక్కడ చక్కని సరస్సు, మళ్లీ ఆ సరస్సు చుట్టూ కొండలే. ప్రకృతి ఒడిలో అద్భుత లోకంగా ఉన్న ఈ ఫిలిప్పీన్స్ యాత్ర ఒక మరుపురాని అనుభూతినే మిగిల్చిందని చెప్పవచ్చు. ఆ అందాలను కళ్లనిండా నింపుకొని మనీలాకు అక్కడి నుండి ఇంటికి వచ్చాం.

- నర్మదా రెడ్డి, 9849018510

కోటలో సౌండ్ అండ్ లైట్ షో...

మన పర్యాటక ప్రాంతాలను మరింత అకట్టుకునేలా చేసి పర్యాటకుల సంఖ్యను పెంచడానికి తెలంగాణ పర్యాటక శాఖ ప్రత్యేక ప్యాకేజీలను ప్రవేశపెట్టింది. ముఖ్యంగా చారిత్రక ప్రదేశాలను అన్ని వర్గాల వారికి చేరువ చేయడం కోసం గోల్కొండ కోట సౌండ్ అండ్ లైట్ షోలను నిర్వహిస్తున్నది. తెలంగాణ రాష్ట్రం వచ్చాక జాతీయ పర్వదినాలైన జనవరి 26, ఆగస్టు 15 జెండావిష్కరణకు కేంద్రంగా మారిన గోల్కొండ కోట చారిత్రక వైభవాన్ని చెప్పడం కోసం ప్రత్యేక సౌండ్ అండ్ లైట్ షోలను మరింత ఆధునీకరించింది.



మొదటి షో: ఇంగ్లీష్ (అన్ని రోజులు), రెండవ షో: తెలుగు (సోమ, బుధ, శుక్రవారాల్లో,) హిందీ (మంగళ, గురు, శని, ఆదివారాల్లో) నవంబర్-ఫిబ్రవరి ఫస్ట్ షో:సాయంత్రం 6.30, సెకండ్ షో: సాయంత్రం 7.45 నిమిషాలకు. (మార్చి-అక్టోబర్) ఫస్ట్ షో: -సాయంత్రం 7.00, సెకండ్ షో: సా.8.15ని.లకు. కోట సందర్శన సమయం: ఉదయం 9.00 నుండి సాయంత్రం 5.00 వరకు టికెట్ కౌంటర్ ఓపెన్ సమయం సాయంత్రం 5.30.
-మరిన్ని వివరాలకు సంప్రదించాల్సిన నం-: 040-23512401
-బల్క్ బుకింగ్స్ కోసం సంప్రదించాల్సిన నం- 9640069290

ఈ ఏడాదిలో ప్రయాణాలు...


ఏడాదికి ఒకసారి మానసిక ప్రశాంతత కోసం ప్రయాణాలు చేసేవారు చాలామంది ఉంటారు. అది ఒంటరిగా కావొచ్చు, కుటుంబంతో కావొచ్చు. అయితే ఈ ఏడాది మాత్రం ఇంచుమించు ఐదు కోట్ల మంది భారతీయులు విదేశాలను చుట్టేస్తారని 'ప్రపంచ పర్యాటక సంస్థ' అంచనా వేసింది. అమెరికా, ఆస్ట్రేలియా, ఇటలీ, ఫ్రాన్స్... లాంటి దేశాలు వారి జాబితాలో కచ్చితంగా ఉంటాయి. కానీ రొటీన్‌కి భిన్నంగా నూతన సంవత్సరంలో ఎక్కువ మంది వెళ్లాలనుకుంటున్న కొన్ని దేశాలు...

అందాలకు నెలవు : టర్కీ పేరు వినగానే ముందుగా అందరికీ గుర్తొచ్చేది ఆ దేశ రాజధాని ఇస్తాంబుల్. హాలీవుడ్ నుంచి టాలీవుడ్ వరకూ అనేక సినిమాల్లో ఈ నగర అందాలు కనువిందు చేశాయి. అంతెందుకు రెండేళ్ల క్రితం వచ్చిన బాండ్ చిత్రం 'స్కైఫాల్' ఓపెనింగ్ సన్నివేశంలోనూ కనిపిస్తుందీ నగరం. ముఖ్యంగా 'పాముక్కలే' అనే పల్లె అయితే టూరిస్టులకు తెగ ఇష్టం. అక్కడ మీకు ('థర్మల్ పూల్స్' 'వేడి నీటి సరస్సులు) దర్శనమిస్తాయి. కొన్ని వేల ఏళ్ల క్రితం ఆ దేశాన్ని పాలించిన రోమన్ల కాలం నుంచీ ఈ 'పాముక్కలే' సహజసిద్ధమైన స్పాగా ప్రసిద్ధి. ఈ పల్లెకు సమీపంలో ఉన్న 'హీరాపోలిస్' అనే నగరానికి చారిత్రకంగా ఎంతో ప్రాముఖ్యం ఉంది. అందుకే హీరాపోలిస్- పాముక్కలే' లను యునెస్కో సంస్థ ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తించింది. అందుకే 'చర్చ్ ఆఫ్ హెూలీ విజ్‌డమ్'గా పేరొందిన 'హేగియా సోఫియా' మ్యూజియం మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తుంది. దీన్ని నిర్మాణం క్రైస్తవం- ఇస్లాం సంస్కృతులను ప్రతిబింబించేలా ఉంటుంది.


మండే చల్లని దీవి : అడవుల్లేని దేశం అది. ఏడాదంతా మంచు పరుచుకొని ఉంటుంది. వందలకు పైగా అగ్నిపర్వతాలను తనలో దాచుకొన్న విశిష్టత దీని సొంతం. అందుకే ప్రపంచంలోని అనేకమంది సందర్శకులు చూడటానికి పోటీ పడతారు. ఈ దేశం పేరు ఐస్‌ల్యాండ్. ఇదొక దీవి. దీన్ని ల్యాండ్ ఆఫ్ ఫైర్, ఐస్‌గా అభివర్ణిస్తారు. అట్లాంటిక్ మహాసముద్రాన్ని ఆనుకొని ఉన్న ఈ దేశానికి పర్యాటకమే ప్రధాన ఆదాయ వనరు. ప్రతి నాలుగేళ్లకొకసారి బద్దలయ్యే అగ్నిపర్వతాలు నిప్పులు చిమ్ముతూ ఉంటాయి. ఆ భయానక వాతావరణంలో కూడా హెలికాప్టర్లో చక్కర్లు కొడుతూ వీక్షించవచ్చు. మరికొంత మంది ఆ అగ్నిపర్వతాల సమీపం వరకూ వెళ్లడానికి కూడా ఉత్సాహం చూపుతారు.

చరిత్రకు సాక్ష్యం : పర్యాటకానికి అత్యంత ప్రాధాన్యమిచ్చే మిడిల్ ఈస్ట్ దేశాల్లో సిప్రస్ ఒకటి. టర్కీకి దక్షిణ దిక్కులో, చుట్టూ మధ్యధరా సముద్రాన్ని చుట్టుకొని ఉన్న ఈ దేశం పర్యాటకం మీద ఆధారపడింది. ఇక ఈ దేశాన్ని చూడాలంటే వేసవి సెలవులే ఉత్తమం! ముఖ్యంగా అక్కడి అందమైన సాగరతీరాలే పర్యాటకులను ఆకర్షిస్తున్నాయి. సిప్రస్ దేశానికి కేంద్ర బిందువుగా ఉన్న ఒక చారిత్రక నగరాన్ని కచ్చితంగా చూడాల్సిందే. దీని పేరు 'న్యూ పఫోస్'. క్రీస్తు పూర్వం 58వ సంవత్సరంలో రోమన్లు ఈ ప్రాంతాన్ని తమ ఆర్థిక రాజధానిగా చేసుకొని పాలించారు. రాజుల సమాధుల కోసం ప్రత్యేకంగా మరో నగరాన్ని నిర్మించారు. దీని పేరు 'టోంబ్స్ ఆఫ్ కింగ్స్'. ఏప్రిల్ నుంచి అక్టోబర్ నెలల్లో ఈ దేశం పర్యాటకానికి అనువుగా ఉంటుంది.

ఘన వారసత్వం: దక్షిణ కొరియా... రొటీన్ ట్రావెలర్స్‌కు కాకుండా కాస్త కొత్తదనం కోరుకునే వారికి ఈ దేశం సరికొత్త అనుభూతినిస్తుంది. తరతరాల చారిత్రక వారసత్వాన్ని తనలో ఇముడ్చుకున్న దేశం అది. ప్రకృతి అద్భుతాలకు చిరునామాగా నిలిచిన ఈ దేశంలో ఓ క్వారీ ఉంది. ఏ దేశంలోనైనా క్వారీ అంటే కాలుష్యానికి మారుపేరులా ఉంటుంది.



వెల్లాయని కాయల్...



స్వచ్ఛమైన గాలి, తాజాగా ఉండే నీలిరంగు నీళ్ళతో, అందంగా ప్రవహించే నది వెల్లాయని కాయల్. దీన్నే వెల్లాయని సరస్సు అంటారు. తిరువనంతపురం జిల్లా గుండా ప్రవహించే అతి పెద్ద మంచి నీటి సరస్సు. స్థానికులు దీన్ని వెల్లాయని కాయల్ అని పిలుస్తారు. తిరువనంతపురం ప్రధాన బస్సు కూడలి నుండి కేవలం తొమ్మిది కిలో మీటర్ల దూరంలో ఉంటుంది.

స్థానికులు, పర్యాటకులు ఎక్కువగా సందర్శించే విహార కేంద్రాల్లో వెల్లాయని సరస్సు ఒకటి. కోవళం వెళ్తే ఒక్కసారైనా ఈ సరస్సును చూడాల్సిందే. తాజాగా ఉండే స్వచ్ఛమైన నీలిరంగు నీళ్ళతో ఈ సరస్సు చాలా అందంగా కనపడుతుంది. ఈ సరస్సు మీద వెన్నెల పడగానే ఈ ప్రాంతం అంతా మనోహరంగా మారిపోతుంది. ఈ దృశ్యాన్ని చూడడానికి పర్యాటకులు రాత్రిదాకా వేచి ఉంటారు. ఈ సరస్సులో ప్రతి ఏటా ఓనం పండుగ సందర్భంగా పడవ పందాలు జరుగుతాయి. వీటిని చూడడానికి చాలామంది వస్తారు. ఓనం పండుగ రోజులలో కోవళంలో గానీ చుట్టుపక్కల గానీ జరిగే పడవ పందాలను తప్పకుండా చూడవలసిందే.

చెత్త రికార్డులను చెరిపేస్తూ దూసుకెళ్తోన్న టీమ్ ఇండియా, కివీస్ గడ్డపై మరో 'తొలి' విజయంపై కన్నేసింది. పొట్టి ఫార్మాట్‌లో వరుసగా పది ద్వైపాక్షిక సిరీస్‌ల్లో ఓటమెరుగని భారత్‌కు, న్యూజిలాండ్ నేలపై పొట్టి విజయమే లేదు. చివరగా 2009లో ఇక్కడ టీ20 ఆడిన భారత్ 0-2తో సిరీస్ కోల్పోయింది. వెల్లింగ్టన్‌లో నెగ్గితే అదే కివీస్ గడ్డపై భారత్‌కు తొలి విజయం కానున్నది. భారత్, న్యూజిలాండ్ తొలి టీ20 పోరు నేడే.

బోణీ కొడతారా?



- కివీస్ గడ్డపై టీ20 విజయం ఎరుగని భారత్
- న్యూజిలాండ్‌తో తొలి టీ20 పోరు నేడే
- ఫేవరెట్‌గా రోహిత్‌సేన బరిలోకి..

వెల్లింగ్టన్

మరో సిరీస్ విజయంపై టీమ్ ఇండియా కన్నేసింది. పొట్టి ఫార్మాట్‌లో తిరుగులేని ఫామ్‌తో ఉన్న టీమ్ ఇండియా అజేయ సిరీస్ రికార్డును కొనసాగించేందుకు రంగం సిద్ధం చేసుకున్నది. బ్యాటింగ్ మ్యాస్ట్రో విరాట్ కోహ్లి, యార్కర్ల హీరో బుమ్రా లేకుండానే బరిలోకి దిగుతున్నా, టీ20 సిరీస్‌లో టీమ్ ఇండియానే ఫేవరెట్. సొంతగడ్డపై వన్డేల్లో దారుణ పరాభవానికి గురైన న్యూజిలాండ్ టీ20ల్లో ఊరట చెందాలని భావిస్తున్నారు. నాణ్యమైన ఆల్‌రౌండర్ల అండతో కివీస్ పొట్టి సిరీస్ సొంతం చేసుకోవాలని చూస్తోంది. వన్డే సిరీస్ మాదిరి టీ20 సిరీస్ ఏకపక్షంగా సాగే అవకాశం లేదనే చెప్పాలి!. ఇరు జట్లూ సమతూకంతో కనిపిస్తోన్న వేళ అభిమానులకు ధనాదన్ ధమాకా ఖాయం.

గిల్ మెరిసేనా..!

గత రెండేండ్లలో అన్ని జట్లూ ఓపెనర్లను మార్చాయి. నిలకడగా ఓపెనర్లను నిలుపుకున్న జట్లు కేవలం భారత్, ఇంగ్లాండ్ మాత్రమే. రోహిత్ శర్మ, శిఖర్ ధావన్‌లు ఏడాదిన్నరగా అద్భుత ఆటతీరు కనబరుస్తున్నారు. మూడో ఓపెనర్‌గా కెఎల్ రాహుల్ సైతం ఆకట్టుకున్నాడు. అదనపు ఓపెనర్‌గా, మూడో స్థానం బ్యాట్స్‌మన్‌గా, వికెట్ కీపర్‌గా ఉపయోగపడిన రాహుల్ నేటి మ్యాచ్‌లో లేడు. కోహ్లి లేని వేళ ఆ స్థానంలో యువ సంచలనం శుభ్‌మన్ గిల్ ఆడుతున్నాడు. చివరి రెండు వన్డేల్లో నిరాశపరిచిన గిల్, టీ20లో సత్తా చాటాలని ఎదురుచూస్తున్నాడు. ప్రపంచకప్ మిడిల్ ఆర్డర్ బ్యాట్స్‌మన్ రేసులో గిల్ నిలవాలంటే, ఈ సిరీస్‌లో అతడు రాణించటం తక్షణావసరం. యువ వికెట్ కీపర్ రిషబ్ పంత్ టీ20లకు తాజాగా సన్నద్ధమయ్యాడు. నెట్స్‌లో భారీ షాట్లు సాధన చేసిన పంత్ నేడు ప్రధాన ఆకర్షణ కానున్నాడు. రెండో ఆల్‌రౌండర్ రేసులో కృనాల్ పాండ్య, కేదార్ జాదవ్‌లు ఉన్నారు. కెప్టెన్ రోహిత్ తన ముంబయి సహచరుడు కృనాల్‌కు అవకాశం ఇచ్చే వీలుంది!. ఎం.ఎస్ ధోని, దినేశ్ కార్తీక్‌లు వేగంగా పరుగులు సాధించటంపై దృష్టి పెట్టనున్నారు.

భారత్ X న్యూజిలాండ్ తొలి టీ20
అమ్మాయిలు - ఉ॥ 8.30 నుంచి
అబ్బాయిలు - మ॥ 12.30 నుంచి
స్టార్‌స్పోర్ట్స్‌లో ప్రసారం...

భువనేశ్వర్‌తో కలిసి ఖలీల్ అహ్మద్ పేస్ బాధ్యతలు చూసుకోనుండగా.. చాహల్, కుల్దీప్‌లో ఒకరే తుది జట్టులో నిలిచే వీలుంది.

కివీస్ కొత్త కొత్తగా..

టీ20 సిరీస్‌కు కివీస్ శిబిరంలో పెద్ద మార్పులే జరిగాయి. సీనియర్ బ్యాట్స్‌మన్ మార్టిన్ గప్టిల్, ప్రధాన సీమర్ ట్రెంట్ బౌల్ట్ దూరమయ్యారు. కొందరు కొత్త ఆటగాళ్లూ జట్టులోకి వచ్చారు. గప్టిల్ లేని వేళ మన్రోతో కలిసి కెప్టెన్ విలియమ్సన్ ఓపెనర్‌గా రానున్నాడు. గత పది వన్డేల్లో 32 సగటు మాత్రమే కల్గిన విలియమ్సన్‌పై పరుగుల ఒత్తిడి నెలకొన్నది. రాస్ టేలర్ మరోసారి బ్యాటింగ్ భారం మోయనున్నాడు. జేమ్స్ నీషమ్, గ్రాండ్‌హోమె, శాంట్నర్‌ల రూపంలో కివీస్‌కు నాణ్యమైన ఆల్‌రౌండర్లు ఉన్నారు. ఫెర్గుసన్, సోధి, బ్రేస్‌వెల్‌లు బంతితో భారత్‌ను ఏ మేరకు కట్టడి చేస్తారనేది ఆసక్తికరం.

పిచ్ రిపోర్టు

వెల్లింగ్టన్ పిచ్ మిస్టరీ కొనసాగుతోంది. ఇక్కడ కొన్ని సార్లు సీమర్లు అదరగొడితే, మరికొన్ని సార్లు బ్యాట్స్‌మెన్ చెలరేగుతున్నారు. చివరగా ఇక్కడ జరిగిన టీ20లో భారీ స్కోర్లు నమోదయ్యాయి. రెండో ఇన్నింగ్స్‌లో మంచు ప్రభావం చూపించే అవకాశం ఉంది. టాస్ నెగ్గిన జట్టు తొలుత బ్యాటింగ్ ఎంచుకునేందుకు మొగ్గుచూపవచ్చు.

భారత్ : రోహిత్ శర్మ, శిఖర్ ధావన్, శుభ్‌మన్ గిల్, రిషబ్ పంత్, దినేశ్ కార్తీక్, ఎం.ఎస్ ధోని, హార్దిక్ పాండ్య, కృనాల్ పాండ్య/కేదార్ జాదవ్, భువనేశ్వర్ కుమార్, ఖలీల్ అహ్మద్, యుజ్వేంద్ర చాహల్/కుల్దీప్ యాదవ్.

న్యూజిలాండ్ : కేన్ విలియమ్సన్, కొలిన్ మన్రో, టిమ్ సీఫెర్ట్, రాస్ టేలర్, జేమ్స్ నీషమ్, కొలిన్ డీ గ్రాండ్‌హోమె, మిచెల్ శాంట్నర్, స్కాట్, బ్రేస్‌వెల్, ఫెర్గుసన్/సౌథీ, ఇశ్ సోధి.

10 టీ20 ఫార్మాట్‌లో గత పది ద్వైపాక్షిక సిరీస్‌ల్లో టీమ్ ఇండియా అజేయంగా కొనసాగుతోంది.

1 పొట్టి ఫార్మాట్‌లో రోహిత్ శర్మ 12 మ్యాచులకు సారథ్యం వహించాడు. రోహిత్ కెప్టెన్సీ భారత్ ఒక్క టీ20 మ్యాచ్‌లోనే ఓడింది. 11 మ్యాచుల్లో జయకేతనం ఎగురవేసింది.

రిచర్డ్స్, ఇమ్రాన్‌లను తలపిస్తున్నాడు!

- విరాట్ కోహ్లిపై శాస్త్రి ప్రశంస



వెల్లింగ్టన్ : భారత కెప్టెన్ విరాట్ కోహ్లి సహజ అభిమాని, చీఫ్ కోచ్ రవిశాస్త్రి మరోసారి పరుగుల యంత్రంపై ప్రశంసల జల్లు కురిపించాడు. క్రికెట్ దిగ్గజాలు వీవ్ రిచర్డ్స్, ఇమ్రాన్‌ఖాన్‌లను భారత సూపర్ స్టార్ గుర్తు చేస్తున్నాడని శాస్త్రి అభిప్రాయపడ్డాడు. 'దిగ్గజ క్రికెటర్ రిచర్డ్స్‌ను కోహ్లిలో చూస్తున్నాను. విరాట్ ఆటపై ఆధిపత్యం చెలాయించాలని కోరుకుంటున్నాడు. క్రమశిక్షణ, సాధన, త్యాగం విషయానికొస్తే అసలు కోహ్లిని ఊహించజాలం' అని శాస్త్రి కితాబిచ్చాడు. కోహ్లి వంటి కెప్టెన్ లభించటం భారత్ అదృష్టం. ఎన్నో విధాలుగా కోహ్లి.. ఇమ్రాన్ ఖాన్‌ను గుర్తు చేశాడు. జట్టుగా ఉదహం ఇగా నిలువటంలో, ముందుండి నడిపించటంలో కోహ్లి శైలి ఇమ్రాన్ మాదిరి ఉంటుందని శాస్త్రి అన్నాడు. ఆటగాడిగా కోహ్లి అద్భుతమే అయినా, కెప్టెన్‌గా అతడు మెరుగవ్వాల్సి ఉందని అన్నాడు. 'నాకు తెలిసి, కెప్టెన్సీ వ్యూహచతురతలో కోహ్లి ఇంకా మెరుగు పడతాడు. అతడు ఎప్పటికప్పుడు పురోగతి చూపిస్తున్నాడు. ఇటీవల ఆస్ట్రేలియాతో సిరీస్‌లో కోహ్లి నాయకత్వం అమోఘమని అన్నాడు. ఇక విదేశీ టెస్టుల్లో కుల్దీప్ యాదవే భారత ప్రధాన స్పిన్నరని శాస్త్రి అన్నాడు. ఒక్కో క్రికెటర్‌ది ఒక్కో కాలం, ఇప్పుడు కుల్దీప్ జోరు మీదున్నాడు. సిడ్నీ టెస్టులో అతడు బంతులేసి తీరు, ఐదు వికెట్ల ప్రదర్శన విశేషంగా ఆకట్టుకున్నది. అశ్విన్, జడేజాలను దాటేసి కుల్దీప్ ఇప్పటికే భారత నం.1 స్పిన్నర్‌గా నిలిచాడు. ఒకవేళ తుది జట్టులో ఒక స్పిన్నర్‌కే అవకాశం ఉంటే, కుల్దీప్ ఆడతాడని శాస్త్రి పేర్కొన్నాడు.

రసపట్టులో రంజీ ఫైనల్

- గొప్పగా పోరాడిన సౌరాష్ట్ర



నాగ్‌పూర్ : రంజీ ట్రోఫీ ఫైనల్ రసకందాయంగా సాగుతోంది. తొలి రోజు సౌరాష్ట్ర పైచేయి సాధించగా, రెండో రోజు విదర్భ హవా నడిచింది. మూడో రోజుకు వచ్చేసరికి మ్యాచ్‌లో ఇద్దరికీ సమాన అవకాశాలు. తొలి ఇన్నింగ్స్‌లో మెరుగైన ఆధిక్యం ఆశించిన విదర్భకు సౌరాష్ట్ర టెయిలెండర్లు షాకిచ్చారు. జైదేవ్ ఉనద్కత్ (46, 101 బంతుల్లో 4 ఫోర్లు), చేతన్ సకారియా (28, 82 బంతుల్లో 4 ఫోర్లు) చివరి వికెట్‌కు 60 పరుగులు జోడించారు. 173/6తో పీకల్లోతు కష్టాల్లో పడిన సౌరాష్ట్ర టెయిలెండర్ల మెరుపులతో తొలి ఇన్నింగ్స్‌లో 307 పరుగులు చేయగల్గింది. విదర్భ స్కోరుకు కేవలం ఐదు పరుగుల దూరంలోనే నిలిచింది. రెండో ఇన్నింగ్స్‌లో ఓపెనర్ ఫయజ్ ఫజల్ (10), సంజయ్ రామస్వామి (16)లను కోల్పోయిన విదర్భ 55/2తో కొనసాగుతోంది. స్టార్ బ్యాట్స్‌మన్ వసీం జాఫర్ (5 నాటౌట్), గణేశ్ సతీశ్ (24 నాటౌట్) క్రీజులో అజేయంగా ఆడుతున్నారు. విదర్భ ప్రస్తుతం 60 పరుగులు ఆధిక్యంలో నిలిచింది.

సర్ఫరాజే సారథి

- స్పష్టం చేసిన పీసీబీ



కరాచీ : ఐసీసీ క్రమశిక్షణ చర్యలతో నాలుగు మ్యాచుల నిషేధం ఎదుర్కొన్న సర్ఫరాజ్ అహ్మద్‌ను దక్షిణాఫ్రికా పర్యటన నుంచి వెనక్కి పిలిపించిన పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ), తాజాగా నష్ట నివారణ చర్యలు చేపట్టింది. సఫారీ ఆటగాడు ఫెలుక్‌వయోపై జాతీ వివక్ష వ్యాఖ్యలు చేసిన సర్ఫరాజ్, తర్వాత అతడిని కలిసి వ్యక్తిగతంగా, సోషల్ మీడియాలో బహిరంగంగా క్షమాపణలు చెప్పాడు. ఐసీసీ నిషేధంతో కెప్టెన్‌ను టూర్ మధ్యలోనే స్వదేశానికి పిలిపించటం మాజీ క్రికెటర్ల విమర్శలకు కారణమైంది. జట్టులో సర్ఫరాజ్ ప్రాధాన్యత ప్రశ్నార్థకమైంది. దీంతో 2019 ప్రపంచకప్ జట్టుకు సర్ఫరాజ్ అహ్మద్ సారథ్యం వహిస్తాడని పీసీబీ మంగళవారం ప్రకటించింది. 'ప్రపంచకప్ వరకూ సర్ఫరాజ్ అహ్మద్ పాక్ కెప్టెన్‌గా కొనసాగుతాడు. సారథ్యం విషయంలో సర్ఫరాజ్‌పై నాకు ఎల్లప్పుడూ స్పష్టత ఉంది' అని పీసీబీ చైర్మన్ ఈషన్ మణి పేర్కొన్నాడు.

స్కిల్ డెవలప్‌మెంట్ కోత

కేంద్ర పథకాలన్నీ ఆగిపోతాయని పార్లమెంటరీ కమిటీ హెచ్చరిక

- 2020నాటికి కోటిమందికి నైపుణ్య శిక్షణ..నెరవేరేనా?
- తాత్కాలిక బడ్జెట్‌లో ప్రస్తావనే లేదు



న్యూఢిల్లీ : కోటిమంది యువతకు నైపుణ్య శిక్షణ అందించాలన్న లక్ష్యం నీరుగారిపోతోంది. ఎంతో ఆర్భాటంగా 2014లో మోడీ సర్కార్ 'ప్రధానమంత్రి స్కిల్ డెవలప్‌మెంట్' పథకాన్ని ప్రారంభించింది. 2020నాటికి కోటిమంది యువతకు నైపుణ్య శిక్షణ అందించబోతున్నామని ప్రకటించింది. లక్ష్యం గొప్పగా ఉన్నా, దీనికి తగ్గట్టు కేంద్ర బడ్జెట్ కేటాయింపులు లేకపోవటంతో కేంద్ర పథకాల అమలుపై పార్లమెంటరీ కమిటీ (మార్చి 2018)ఆందోళన వ్యక్తం చేసింది. సంబంధిత శాఖ పనితీరును మోడీ సర్కార్ మెరుగుపర్చలేకపోయింది.

కేంద్రంలో 'స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్'(ఎంఎస్‌డీఈ) ప్రత్యేక శాఖను 2014లో కొత్తగా ఏర్పాటుచేశారు. కోటిమంది యువతకు నైపుణ్య శిక్షణ...అనే లక్ష్యాన్ని చేరుకోవటం కోసం 2018-19 ఆర్థిక సంవత్సరంలో రూ.7,696.54కోట్లను కేటాయించాలని ఎంఎస్‌డీఈ కోరింది. అయితే వివిధ కారణాలు చూపుతూ కేంద్ర ఆర్థిక శాఖ నిధుల్లో కోత పెడుతూ కేవలం రూ.3,400కోట్లను కేటాయించింది. మొన్నటి తాత్కాలిక బడ్జెట్ (2019-20)లో అయితే అలా పైపైన ప్రస్తావించి వదిలేశారు. ఎలాంటి వివరాలూ బహిర్గతపర్చలేదు.

ఫలితం...26శాతం...

ప్రత్యేకంగా ఏర్పాటైన 'ఎంఎస్‌డీఈ' శాఖ అమలుజేసిన కార్యక్రమాల వల్ల గతేడాది నవంబరునాటికి కేవలం 36లక్షల మంది యువతీయువకులు నైపుణ్య శిక్షణ పొందారు. ఇందులో సర్టిఫికెట్స్ అందుకున్న వారు 26లక్షలమంది ఉన్నారు. నైపుణ్య శిక్షణా కార్యక్రమాల ద్వారా 4కోట్లమందిని కార్మికశక్తిలోకి తీసుకురావాలని (2012-16) కేంద్రం పథకాల్ని సిద్ధం చేయగా, అందులో సగం లక్ష్యం కూడా నెరవేరలేదని కేంద్ర ప్రభుత్వ గణాంకాలే తేల్చాయి.

నిరుద్యోగాన్ని పెంచిన నైపుణ్యలేమి

దేశంలో నిరుద్యోగ సమస్యకు, నైపుణ్యలేమికి ప్రత్యక్ష సంబంధముంది. పరిశ్రమ కోరిన నైపుణ్యాలు యువతలో లేకపోవటం వారిని ఉపాధి, ఉద్యోగాల నుంచి దూరం చేస్తోందన్న విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో కేంద్రం ప్రకటించిన 'స్కిల్ డెవలప్‌మెంట్' కార్యక్రమాలు పెద్ద ఎత్తున యువతలో ఆశలు కల్పించాయి. అయితే నిధుల లేమితో అనుకున్నంత స్థాయిలో నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు కొనసాగలేదు.

లేబర్‌బ్యూరో అంచనాల ప్రకారం, భారత్‌లో ప్రతీఏటా 47.5లక్షల మంది కొత్తగా కార్మికశక్తిలోకి ప్రవేశిస్తున్నారు. పరిశ్రమ డిమాండ్‌మేరకు వీరికి సరైన వృత్తి నైపుణ్యాలు లేకపోవటంతో అనేకమంది ఉపాధి కోల్పోవాల్సి వస్తోంది. నిరుద్యోగ సమస్య పెరగడానికి ఇదొక ముఖ్యకారణమని ఆర్థిక విశ్లేషకులు అభిప్రాయపడ్డారు.

గతనాలుగేండ్లుగా నిరుద్యోగం పెరగటమేగానీ తగ్గిన దాఖలాలేదనీ పలు నివేదికలు పేర్కొన్నాయి. 2017-18లో నిరుద్యోగం 6.1శాతానికి చేరుకుందనీ, గత 45ఏండ్లకాలంలో ఇదే అత్యధికమనీ 'లేబర్ బ్యూరో' తాజా వార్షిక నివేదిక తెలిపింది. ఇలాంటి వాస్తవాలు బయటకొస్తున్నాయనే, మోడీ సర్కార్ 2016-17 ఉద్యోగ, నిరుద్యోగ సమాచారాన్ని విడుదల కాకుండా అడ్డుకుంటోంది.

19న సీఎంతో ఆర్థిక సంఘం ప్రతినిధుల భేటీ



- నివేదికలు సమర్పించండి : సీఎస్ ఎస్కే జోషి ఆదేశాలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పదిహేనో ఆర్థిక సంఘం ప్రతినిధులు ఈనెల 19న ముఖ్యమంత్రి కేసీఆర్‌తో భేటీ అవుతారని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి తెలిపారు. ఈ నేపథ్యంలో వివిధ శాఖలు నివేదికలు రూపొందించి సమర్పించాలంటూ మంగళవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన ఆదేశించారు. ఎన్కే సింగ్ నేతృత్వంలోని ఆర్థిక సంఘం ప్రతినిధులు.. ఈనెల 18 నుంచి 20 వరకు రాష్ట్రంలో పర్యటించనున్న సంగతి తెలిసిందే. తమ పర్యటనలో భాగంగా 18న పట్టణ, గ్రామీణ స్థానిక సంస్థలు, వ్యాపార, పారిశ్రామిక ప్రతినిధులతో వారు భేటీ నిర్వహిస్తారని సీఎస్ తెలిపారు. 20న ఆర్థిక నిపుణులతో సమావేశమైన అనంతరం... క్షేత్రస్థాయిలో పర్యటిస్తారని చెప్పారు. ఈ నేపథ్యంలో రైతుబంధు, రైతుబీమా, సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, మిషన్ భగీరథ, టీఎస్ ఐపాస్, కేసీఆర్ కిట్, కేజీ టూ పీజీ తదితర ప్రాధాన్యతాంశాలపై నివేదికలు సమర్పించాలని సీఎస్ ఆదేశించారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State Editor : S.Veeraiah.Tel Tel/2014/59462.